PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 44 సంచిక : 232 | విజయవాడ, మంగళవారం 25 మార్చి 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50
Vol No | Vijayawada, Tuesday 25 March 2025 | Rs



పార్లమెంట్‌లో అరకు కాఫీ స్టాల్స్

7



అశుతోష్ మెరుపు ఇన్నింగ్స్

- 31బంతుల్లో 66 పరుగులు
- లక్నోపై ఢిల్లీ సంచలన విజయం
- పూరన్, మార్ష్ అర్ధసెంచరీలు

8

ప్రభుత్వ సాయం లేని పి-4

- దాతృత్వమే కీలకం
- పేద, ధనికులను ఒక వేదికపైకి తేవడమే సర్కారు పని
- ఉగాదిన అమరావతిలో ప్రారంభం
- ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పేదరిక నిర్మూలనే లక్ష్యంగా రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పి-4 కార్యక్రమంలో దాతృత్వమే అత్యంత కీలకమని, ప్రభుత్వం నుండి ఎటువంటి అదనపు సాయమూ ఉండదని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. సచివాలయంలో సోమవారం పి-4 విధానంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పి4 విధానంలో ప్రభుత్వ పాత్ర ఇరువర్గాలను ఒక వేదికపైకి తీసుకురావడమేనని చెప్పారు. పేదలకు సాయం చేసేలా సంపన్నుల్లో స్ఫూర్తి నింపడం ఈ కార్యక్రమం లక్ష్యమని అన్నారు. పేదలకు మద్దతుగా నిలిచేందుకు స్వచ్ఛందంగా ముందుకొచ్చే ఎవరైనా ఈ వేదికను వినియోగించుకోవచ్చని చెప్పారు. సాయం అందించేందుకు ఎవరైనా ముందుకు రావొచ్చని, ఎవరినీ ఇందుకోసం ఒత్తిడి చేయొద్దని అధికారులకు సూచించారు. ఎన్నారైలు కూడా పి4లో భాగస్వాములు కావొచ్చని, గతంలో తన హయాంలో చేపట్టిన జన్మభూమి తరహాలోనే పి4 కార్యక్రమానికి కూడా ప్రజాదరణ వస్తుందని నమ్మకం తనకు ఉందని అన్నారు. లబ్ధిపొందేవారిని బంగారు కుటుంబం, సాయం చేసే వారిని మార్గదర్శిగా పిలవాలని సూచించారు. బంగారు కుటుంబం ఎంపికలో ఎలాంటి పొరపాట్లు జరగడానికి వీల్లేదని చెప్పారు. గ్రామసభ, వార్డు సభలు నిర్వహించడం ద్వారా తుదిజాబితా రూపొందిస్తే వివాదరహితంగా ఉంటుందని సూచించారు. పి4 కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం వివిధ వర్గాల ప్రజలకు అందజేస్తున్న పథకాలకు ఎటువంటి సంబంధమూ లేదని సిఎం అన్నారు. పేదరిక నిర్మూలన, జీవన ప్రమాణాలు పెంచడమే ప్రభుత్వ అంతిమ లక్ష్యమని ముఖ్యమంత్రి వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా మొదటిదశలో 20 లక్షల కుటుంబాలకు లబ్ధి కలుగుతుందని, రాష్ట్రంలో పేదరికాన్ని పూర్తిస్థాయిలో నిర్మూలించేంత వరకు పి4 కార్యక్రమం నిరంతరం కొనసాగుతుందని వివరించారు. ఉగాది రోజున అమరావతిలో జరిగే పి4 ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రతి గ్రామం నుండి ఒకరైనా హాజరయ్యేలా ప్రతి నియోజకవర్గం నుండి ఒక బస్సు ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు.

నేడు, రేపు కలెక్టర్ల కాన్ఫరెన్స్

- తొలిరోజు అజెండాలో మంచినీరు, చెరువులు నింపడం, పి-4 యాక్షన్ ప్లాన్, ఉపాధి హామీ

2

అవినీతిపరుడు మాకొద్దు

- నిరవధిక సమ్మెకు అలహాబాద్ బార్ అసోసియేషన్ పిలుపు

న్యూఢిల్లీ : అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మను అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేయాలనే నిర్ణయాన్ని ఉపసంహరించుకో వాలని ఆ బార్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. అవినీతిపరులైన, కళంకితులైన జడ్జిలకు అలహాబాద్ హైకోర్టు డంపింగ్ గ్రౌండ్ కాదని పునరుద్ఘాటించింది. అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేయాలనే ఉత్తర్వును ఉపసంహరించు కునే వరకూ నిరవధిక సమ్మె నిర్వహించాలనే తీర్మానాన్ని అలహాబాద్ హైకోర్టు బార్ అసోసియేషన్ (ఎహెచ్‌సిబిఎ) ఆమోదించింది. న్యాయవ్యవస్థ ప్రజా విశ్వాసాన్ని తిరిగి పొందాలంటే వర్మ తన పదవీకాలంలో ఇచ్చిన అన్ని తీర్పులనూ సమీక్షించాలంటూ సుప్రీంకోర్టుకు లేఖరాసింది. వర్మ అధికారిక నివాసంలో నోట్ల కట్టలు దొరకడంపై సిబిఐ, ఇడి దర్యాప్తు నిర్వహించాలని, వర్మపై క్రిమినల్ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేసింది.

పోలీసు విచారణ జరిపించాలని సుప్రీంలో రిట్ పిటిషన్

వర్మ అధికారిక నివాసంలో భారీగా నగదు దొరికిందనే ఆరోపణలపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని, దర్యాప్తు నిర్వహించాలని పోలీసులను ఆదేశించాలని కోరుతూ సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ దాఖలయింది. సుప్రీంకోర్టు న్యాయవాది మాథ్యూస్ జె నెడుంపారా ఈ పిటిషన్ వేశారు. ఈ ఘటనపై విచారణ కోసం సుప్రీంకోర్టు కొలిజియం ముగ్గురు సభ్యుల కమిటీని నియమించిందని తెలిపారు. దర్యాప్తునకు కమిటీకి ఎటువంటి అధికారం లేదని, ఆ కమిటీ నియమించేందుకు కొలిజియానికి కూడా అధికారం లేదని పిటిషనర్ పేర్కొన్నారు. ఎఫ్ఐఆర్ నమోదు, విచారణ విషయంలో పోలీస్ పనితీరులో జోక్యం చేసుకోకుండా కమిటీని నిరోధించాలని కోరారు. డబ్బు తనదికాదని చెబుతున్న జస్టిస్ వర్మ ఆ విషయమై పోలీసులకు ఎందుకు ఫిర్యాదు చేయలేదని పిటిషనర్ ప్రశ్నించారు.

పార్లమెంటు సీట్ల పునర్విభజనపై టిడిపి మౌనం

రాష్ట్రానికి నష్టం

కూటమి పార్టీల వైఖరి హానికరం

- విలేకరుల సమావేశంలో వి.శ్రీనివాసరావు
- బిజెపి కుట్రలో భాగస్వామ్యం కావద్దని సూచన
- పార్లమెంటులో టిడిపి, జనసేన ఎంపిలు ప్రశ్నించాలి



మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు, పక్కన వై.వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పార్లమెంటు నియోజకవర్గాల పునర్విభజన విషయంలో కూటమి పార్టీలు అనుసరిస్తున్న వైఖరి రాష్ట్రానికి హానికరమని, టిడిపి మౌనం రాష్ట్రానికి నష్టమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు అన్నారు. విజయవాడలోని బాలోత్సవ భవన్లో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై. వెంకటేశ్వరరావుతో కలిసి పాల్గొన్న ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజనపై టిడిపి, జనసేనలు తమ వైఖరి చెప్పాలని డిమాండ్ చేశారు. డీలిమిటేషన్‌పై డిఎంకె ఏర్పాటు చేసిన సమావేశానికి దక్షిణ భారతదేశంలోని అన్ని రాష్ట్రాల నుండి పార్టీలు హాజరయ్యాయని, ఒక్క మనరాష్ట్రం నుండి మాత్రమే హాజరు కాలేదని చెప్పారు. ఈ వైఖరి రాష్ట్ర ప్రయోజనాలకు నష్టమని అన్నారు. మోడీతో దోస్తీ కోసం రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీస్తున్నారని తెలిపారు. టిడిపి, జనసేన గోడమీద పిల్లివాటంగా వ్యవహరిస్తున్నాయని వ్యాఖ్యానించారు. అదే సమయంలో వైసిపి ఆ సమావేశానికి హాజరు కాకపోయినా కనీసం లేఖ రాసిందని, కూటమి పార్టీలు ఆపని కూడా చేయకుండా, ఉద్దేశపూర్వకంగా దూరంగా ఉన్నాయని అన్నారు. జనసేన అధ్యక్షులు పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ ఆ పార్టీల నాయకులు డీలిమిటేషన్‌పై ముందు పార్లమెంటులో లేవనెత్తాలని చెప్పారని, అసలు జనసేన పార్టీ సభ్యులు లోక్‌సభలో ఎందుకు లేవనెత్తలేదో చెప్పాలని అన్నారు. డీలిమిటేషన్ రాష్ట్రానికి లాభమా, నష్టమా అన్న అంశాన్నైనా స్పష్టం చేయాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆ విషయం మాట్లాడకుండా అసెంబ్లీలో మహిళలకు 75 సీట్లు పెరుగుతాయని చెబుతూ అసలు విషయాన్ని పక్కదారి పట్టిస్తున్నారని అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 25 పార్లమెంటు సీట్లు ఉన్నాయని, అవి తగ్గుతాయా పెరుగుతాయా అన్న విషయం చెప్పాలని డిమాండ్ చేశారు. జనాభా ప్రతిపదికన గనుక సీట్లు కేటాయిస్తే దేశంలో ఉత్తరప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్ లాంటి ఒకటీ రెండు రాష్ట్రాలకు తప్ప ఎక్కువ రాష్ట్రాలకు నష్టం జరుగుతుందని శ్రీనివాసరావు పేర్కొన్నారు. దీనివల్ల బిజెపి పాలిత రాష్ట్రాలకు ఉపయోగం తప్ప దేశంలో మరెవరికీ సీట్లు పెరగవని అన్నారు. దక్షిణ భారతదేశంలో రాష్ట్రాలు అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని జనాభాను తగ్గించిన విషయాన్ని గుర్తు చేశారు. జనాభా ప్రాతిపదికనే డీ లిమిటేషన్ జరిగితే దేశాభివృద్ధికి తోడ్పడిన రాష్ట్రాలకు పార్లమెంటులో ప్రాతినిధ్యం తగ్గుతుందని వివరించారు. బిజెపి కుట్ర పూరితంగా వ్యవహరిస్తుంటే రాష్ట్రంలో టిడిపి, జనసేన సమర్థించే విధంగా వ్యవహరిస్తున్నాయని అన్నారు. బిజెపి కుట్రలో భాగస్వామ్యం కావద్దని ఆ పార్టీలకు సూచించారు. డీలిమిటేషన్ చేసేటట్లయితే ప్రస్తుతం పార్లమెంటులో ఎంత శాతం సీట్లు పెరుగుతున్నాయో రాష్ట్రాలకూ అలాగే సీట్ల ప్రాతిపదికగా పెరుగుదల శాతాన్ని పరిగణనలోకి తీసుకుని సీట్లు పెంచాలని తెలిపారు. ప్రస్తుత జనాభా ఆధారంగా సీట్లు పెరిగితే ప్రాంతీయ అసమానతలు పెరుగుతాయని, ప్రజల మధ్య ఐక్యత దెబ్బతినే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రాంతీయ పార్టీల ఉనికిని కూడా ఇది దెబ్బతీస్తుందన్నారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో మరోసారి సమావేశం ఏర్పాటు చేస్తామని కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారని, ఆ సమావేశానికైనా రాష్ట్రంలో ఉన్న కూటమి పార్టీలు, వైసిపి హాజరై అభిప్రాయం చెప్పాలన్నారు. టిడిపి తెలుగు ప్రజల ప్రయోజనాల కోసం ఏర్పడిందని, మోడీకి భయపడి మౌనం వహిస్తే ,దానివల్ల సీట్లు తగ్గితే రాష్ట్రానికి అన్యాయం జరుగుతుందని వివరించారు. కూటమి పార్టీలు వారి అభిప్రాయాన్ని మోడీకి చెబుతూ జగన్ రాసిన మాదిరి మిగతా 7లో

ప్రభుత్వానిది కపట ప్రేమ

- అకాల వర్షాలు, ఈదురుగాలులకు నష్టపోయిన ప్రతి రైతుకూ పరిహారం అందించాలి
- ఇందుకోసం సర్కార్‌పై ఒత్తిడి తెస్తాం : వైఎస్.జగన్



తాతిరెడ్డిపల్లెలో దెబ్బతిన్న అరటి పంటను పరిశీలిస్తున్న జగన్

ప్రజాశక్తి- లింగాల

ఎన్నికల సమయంలో గొప్పగా హామీలిచ్చి, అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయకుండా టిడిపి కూటమి ప్రభుత్వం అన్నదాతలను మోసగించిందని మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి విమర్శించారు. అకాల వర్షాలు, ఈదురు గాలులకు అరటి, ఇతర పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం తక్షణమే పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇందుకోసం సర్కార్‌పై ఒత్తిడి తెచ్చి బాధిత రైతులకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు. అకాల వర్షాలు, ఈదురు గాలులకు పడిపోయిన వైఎస్‌ఆర్ జిల్లా లింగాల మండలం తాతిరెడ్డిపల్లె, కోమన్నూతలలోని అరటి తోటలను సోమవారం ఆయన పరిశీలించారు. నష్టపోయిన రైతులతో మాట్లాడారు. అప్పులు చేసి సాగు చేశామని, పంట చేతికందే సమయంలో దెబ్బతిన్నడంతో తీవ్రంగా నష్టంపోయామని మహిళా రైతులు వాపోయారు. అరటి పంటకు జరిగిన నష్టాన్ని చూసి మనస్తాపంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన అనంతపురం జిల్లా యల్లనూరు మండలం నేర్జాంపల్లికి చెందిన ఇద్దరి రైతుల కుటుంబ సభ్యులు జగన్ ముందు బోరున విలపించారు. తమకు జరిగిన నష్టాన్ని వివరించారు. లింగాల మండల పరిధిలోని చెర్లపల్లె, ఎగువపల్లె, పార్నపల్లె, గ్రామాల్లో నాలుగు వేల ఎకరాల్లో అరటి పంట దెబ్బతినిందని ఆయా గ్రామాలకు చెందిన రైతులు ఏకరువు పెట్టారు. పంట నష్టంపై ఉద్యాన శాఖ అధికారులతో జగన్ చర్చించారు. అనంతరం విలేకర్లతో ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో పండిన మిగతా 7లో



జార్జియా నేషనల్ యూనివర్సిటీ ప్రతినిధులతో మంత్రి లోకేష్

'ఉత్తరాంధ్ర'కు ఇంటర్నేషనల్ యూనివర్సిటీ

- జార్జియా నేషనల్ యూనివర్సిటీతో ఒప్పందం
- మంత్రి లోకేష్ సమక్షంలో ఎంఒయు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉత్తరాంధ్రలో ఇంటర్నేషనల్ యూనివర్సిటీ ఏర్పాటుకు జార్జియా నేషనల్ యూనివర్సిటీ (జిఎన్‌యు)తో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ సమక్షంలో సోమవారం ఈ ఒప్పందం జరిగింది. ఉండవల్లిలోని మంత్రి నివాసం లో జరిగిన ఈ ఒప్పందం పై విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్, జిఎన్‌యు వ్యవస్థాపకులు, రెక్టార్ గియా కావ్టెలిష్విలి సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ప్రకారం ఉత్తరాంధ్రలో ఇంటర్నేషనల్ యూనివర్సిటీ స్థాపనకు జిఎన్‌యు రూ.1,300 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లా డుతూ.. రాష్ట్ర విద్యార్థులకు ప్రపంచస్థాయి విద్యను అందించడంతో పాటు రాష్ట్ర విద్యారంగాన్ని ప్రపంచ పటంలో నిలిపేందుకు దోహద పడుతుందని అన్నారు. ఇంటర్నేషనల్ యూనివర్సిటీ ద్వారా రాష్ట్రంలో విద్యా ప్రమాణాలను పెంచడమే కాకుండా ప్రపంచ ఉద్యోగ మార్కెట్‌లో విజయం సాధించ డానికి అవసరమైన నైపుణ్యాలు అందుతాయని తెలిపారు. రాష్ట్ర విద్యార్థులను గ్లోబల్ మిగతా 7లో

అమెరికాలో గుడివాడ సాఫ్ట్‌వేర్ ఆత్మహత్య



ప్రజాశక్తి- గుడివాడ

అమెరికాలోని టెక్సాస్ సమీపంలోగల ఫినీక్స్‌లో నివాసం ఉంటున్న కృష్ణా జిల్లా గుడివాడ సమీపంలోని దొండపాడుకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కొల్లి అభిషేక్ (30) ఆత్మహత్య చేసుకున్నారు. నాలుగు రోజుల క్రితం అదృశ్యమైన ఆయన కోసం స్నేహితులు తీవ్రంగా గాలించారు. ఈ నేపథ్యంలో అభిషేక్ మృతదేహాన్ని ఆదివారం గుర్తించారు. పదేళ్ల క్రితం నుండి ఆయన అమెరికాలో ఉంటున్నారు. ఏడాది క్రితం వివాహమైంది. ఆరు నెలల నుంచి ఉద్యోగం లేకపోవడంతో ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానికులు చెబుతున్నారు. అభిషేక్ మరణ వార్త విన్న తల్లితండ్రులు శోకసముద్రంలో మునిగిపోయారు. తమకు చేదోడువాదోడుగా ఉంటూ ఎదిగొచ్చిన కుమారుడు చనిపోయాడని తెలియడంతో కన్నీరుమున్నీరవుతున్నారు. అభిషేక్ మృతదేహాన్ని గుడివాడ తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

హేబిటేట్ స్టూడియో కూల్చివేత

- స్టాండప్ కమెడియన్ కునాల్‌పై కక్షసాధింపు
- మూక హింసే వారి మార్గం : సిపిఎం ఖండన

7లో..

బీమాపై 5 శాతం జిఎస్‌టి..!

3లో..


ఎన్ఇపిని వెనక్కి తీసుకోవాలి

- విద్య కాషాయీకరణ ఆపాలి
- యునైటెడ్ స్టూడెంట్ పార్లమెంట్ మార్చ్

7లో..

వేతనాలు పెంచండి

- 'కాలపరిమితి'ని రద్దు చేయండి
- ధర్నాలో ఎపి మెప్మా ఆర్పీల డిమాండ్



మాట్లాడుతున్న కె.ధనలక్ష్మి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పట్టణ ప్రాంతాల్లో మహిళల ఆర్థిక స్వావలంబనకు కృషి చేస్తున్న రిపోర్సు పర్సన్ల (ఆర్పీ) సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎపి మెప్మా ఆర్పీ ఉద్యోగుల సంఘం (సిఐటియు) ఆధ్వర్యంలో సోమవారం విజయవాడలో భారీ ధర్నా జరిగింది. ధర్నాచౌక్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో ఆర్‌పిలు హాజరయ్యారు. వేతనాలు పెంచాలని, మూడేళ్ల కాలపరిమితి సర్కులర్‌ను రద్దు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, గ్రేడింగ్ విధానం ఉపసంహరించాలంటూ వారు చేసిన నినాదాలతో ఆ ప్రాంతం మారుమ్రోగింది. సభ్యులకు ఫేస్ రీడింగ్ విధానాన్ని ఎత్తేయాలని, ఆర్పీలకు రూ.10 లక్షల గ్రూపు బీమా సౌకర్యాన్ని కల్పించాలని కోరారు. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన ఆర్పీలు వేసవి ఎండను సైతం లెక్క చేయకుండా ధర్నాను కొనసాగించారు. ఈ ధర్నాకు ఎస్.ఉమాదేవి అధ్యక్షత వహించారు.

ఈ సందర్భంగా మాట్లాడిన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి కాలపరిమితి సర్కులర్ వల్ల గత 20 ఏళ్లుగా మెప్మాలో పని చేస్తున్నా... ఆర్పీలకు ఉద్యోగాలకు గ్యారంటీ లేకుండా పోయిందని అన్నారు. ఈ సర్కులర్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆర్పీలకు రూ.10 వేల వేతనం చెల్లించాలని ఉత్తర్వులు ఉన్నా నెలకు రూ.3 నుంచి 6వేల లోపే వేతనాలు అందుతున్నాయని, దీనికి కారణమైన గ్రేడింగ్ విధానాన్ని తక్షణమే రద్దు చేసి, ఉత్తర్వుల్లో పేర్కొన్న విధంగా ప్రభుత్వమే చెల్లించాలని కోరారు. ప్రభుత్వం ఆర్పీలకు ఎప్పటికప్పుడు కొత్త పనులు అప్పగిస్తుందని, పనికి తగిన వేతనం చెల్లించడం లేదన్నారు. పని భారాన్ని తగ్గించాలని కోరారు. ఆన్‌లైన్ వర్క్ చేయడానికి సెల్ ఫోన్లు, సిమ్ కార్డులు ఇవ్వడం లేదన్నారు. సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎ.వి నాగేశ్వరరావు మాట్లాడుతూ... ప్రభుత్వం పెరుగుతున్న ధరలకు మిగతా 7లో



రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌కు స్వాగతం పలుకుతున్న ఎసిఎ అధ్యక్ష, కార్యదర్శులు కేశినేని శివనాథ్, సాన సతీష్

విశాఖలో క్రికెట్ సందడి

- రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు రాక

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

క్రికెట్ అభిమానుల కేరింతలు, కోలాహలంతో విశాఖ నగరంలోగల మధురవాడలోని ఎసిఎ-విడిసిఎ క్రికెట్ స్టేడియంలో పండగ వాతావరణం నెలకొంది. ఇండియన్ ప్రీమియర్ లీగ్-2025లో భాగంగా సోమవారం విశాఖలో ఢిల్లీ క్యాపిటల్స్, లక్నో సూపర్ జెయింట్స్ మధ్య జరిగిన మ్యాచ్ ఆద్యంతం ఉత్సాహం నింపింది. ఈ మ్యాచ్‌ను చూసేందుకు పలువురు ప్రముఖులు స్టేడియంకు విచ్చేశారు. వారిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, విశాఖపట్నం పార్లమెంటు సభ్యులు ఎం.శ్రీ భరత్ ఉన్నారు.

కాంప్లిమెంటరీ టికెట్లు బ్లాక్‌లో అమ్ముతున్న ముగ్గురు అరెస్టు

స్టేడియం సమీపంలో కాంప్లిమెంటరీ టికెట్లను బ్లాక్‌లో అమ్ముతున్న ముగ్గురిని టాస్క్‌ఫోర్స్ అధికారులు అరెస్టు చేశారు.

ప్రపంచ బ్యాంకు షరతులను బహిర్గతం చేయాలి

- స్థానికులకు రాజధాని పనుల్లో ప్రాధాన్యతివ్వాలి
- రాజధాని అమరావతి గ్రామాల అభివృద్ధి సమీక్షా సమావేశంలో సిహెచ్ బాబూరావు




హాజరైన రాజధాని గ్రామాల రైతులు , కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న బాబూరావు తదితరులు

ప్రజాశక్తి - తుళ్లూరు (గుంటూరు జిల్లా)

రాజధాని అమరావతి నిర్మాణానికి రుణం మంజూరు కోసం ప్రపంచ బ్యాంకు విధించిన షరతులను రాష్ట్ర ప్రభుత్వం బహిర్గతం చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు డిమాండ్ చేశారు. రాజధాని అమరావతి గ్రామాల అభివృద్ధి సమీక్ష సమావేశం సిఆర్‌డిఎ ఆధ్వర్యాన తుళ్లూరులోని హెచ్‌ఎస్‌ఆర్ కళ్యాణ మండపంలో సోమవారం జరిగింది. సిఆర్‌డిఎ కమిషనర్ కె.కన్నబాబు, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, పలువురు ఇతర అధికారులు, రైతులు, అసైన్డ్ రైతులు హాజరయ్యారు. ఈ సమావేశంలో సిహెచ్.బాబూరావు మాట్లాడుతూ ప్రపంచ బ్యాంకు రుణ మంజూరుకు సంబంధించిన వివరాల కాపీలను రాజధాని రైతులకు, ప్రజలకు అందజేయాలని, దీనివల్ల వాటిలో ఏమైనా నష్టపరిచే అంశాలు ఉంటే సరిజేసుకునే వీలు ఉంటుందని అన్నారు. ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు ఇచ్చే రుణాలు పారదర్శకంగా ఉండాలని పేర్కొన్నారు. 44 కేంద్ర ప్రభుత్వ సంస్థలకు రాజధానిలో కేటాయించిన భూముల్లో తక్షణమే నిర్మాణాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రాజధాని నిర్మాణ పనులకు బీహార్, ఒడిశా తదితర ప్రాంతాల నుంచి కార్మికులను తీసుకొస్తూ స్థానికులను పట్టించుకోవడం లేదన్నారు. రాజధాని పనుల్లో మొదటి ప్రాధాన్యత స్థానికులకు ఇవ్వాలని కోరారు.

ఒక శాతం లేబర్ సెస్ రూపేణా వివిధ కంపెనీల నుండి సమకూరిన సుమారు రూ.400 కోట్లను కార్మికుల, పేదల సంక్షేమానికి ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. రాజధాని గ్రామాల్లో నాలుగు వేల మంది పేదలకు అమరావతి పింఛను రద్దయిందని, దీనిని వెంటనే పునరుద్ధరించాలని కోరారు. 2014లో ల్యాండ్ పూలింగ్ సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన అన్న క్యాంటీన్ల ఏర్పాటు, యువతకు రూ.25 లక్షల రుణ సౌకర్యం, ఉచిత విద్య, వైద్యం తదితర హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పారిశుధ్య కార్మికులకు రూ.21 వేలు ఇస్తుంటే, రాజధానిలో మాత్రం రూ.12 వేలు ఇవ్వడం అన్యాయమన్నారు. ప్రతి గ్రామంలో గ్రామ సభలు ఏర్పాటు చేసి సిఆర్‌డిఎ అధికారులు రూపొందించిన ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేపట్టాలని కోరారు. రాజధానిలో రైతుల ప్లాట్ల అభివృద్ధితో పాటు దళిత, ఇతర పేదల అభివృద్ధికి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వివిధ సమస్యలపై సిఆర్‌డిఎ కమిషనర్‌కు బాబూరావు, సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి వినతిపత్రాలు అందజేశారు. ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ రాజధాని గ్రామాల్లో తాగునీరు, డ్రెయినేజీ తదితర మౌలిక వసతుల కల్పనకు అధికారులు, గ్రామస్తులు డిపిఆర్‌లు రూపొందించుకొని అందుకనుగుణంగా పనులు జరిగేలా చూడాలని సూచించారు. అనంతవరం, ఐనవోలు, మందడం తదితర గ్రామాల్లో తాగు నీటి ఇబ్బందులు ఉన్నాయన్నారు. టిడ్కో గృహాల్లో నెలకొన్న సమస్యలపై ఎవరితో మాట్లాడాలో తెలియని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. సిఆర్‌డిఎ అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తే తాను సహకరించేది లేదన్నారు. ఈ సందర్భంగా పలు గ్రామాల ప్రజలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. రైతులు, ,ప్రజలు కమిషనర్‌కు, ఎమ్మెల్యేకు వినతిపత్రాలు అందజేశారు.



క్యూబా సంఘీభావ నిధిని కూపన్స్ ద్వారా సేకరిస్తున్న సిహెచ్.నర్సింగరావు

సోషలిస్టు క్యూబాకు అండగా నిలుద్దాం

- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

సోషలిస్టు దేశమైన క్యూబాకు కార్మిక వర్గం యావత్తు అండగా నిలుద్దామని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు అన్నారు. సోమవారం విశాఖ రైల్వే స్టేషన్ వద్ద ఆటో కార్మికులకు కరపత్రాలు పంపిణీ చేసి, క్యూబా సంఘీభావ నిధిని కూపన్స్ ద్వారా సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సోషలిస్ట్ దేశమైన క్యూబాను సామ్రాజ్యవాద దేశమైన అమెరికా తన చెప్పు చేతల్లో ఉంచుకోవాలని అనేక సంవత్సరాల నుంచి ఆంక్షలు విధిస్తోందన్నారు. క్యూబాతో ఇతర దేశాలేవీ వ్యాపార, వాణిజ్య, స్నేహ సంబంధాలు జరపకూడదని ఆంక్షలు విధించడాన్ని తప్పుబట్టారు. కాస్ట్రో, చేగువేరా నాయకత్వంలో 1958లో క్యూబాలో విప్లవం జయప్రదమైన నాటి నుంచి నేటి వరకు అమెరికా పక్కలో బల్లెంలా ఉంటూ క్యూబా సోషలిజాన్ని కొనసాగిస్తోందన్నారు. కోవిడ్ సమయంలో ప్రపంచంలోని అనేక దేశాలకు వైద్యులను పంపిన ఏకైక దేశం క్యూబా అని కొనియాడారు. క్యూబాపై అమెరికా ఎన్ని నిర్బంధాలను విధించినా 'మా ప్రాణాలైనా ఇస్తాం.. కానీ సోషలిజాన్ని మాత్రం వదలం' అన్న పట్టుదలతో క్యూబా ప్రజలు ముందుకు వెళుతున్నారన్నారు. క్యూబాపై అమెరికా ఆంక్షలను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని కోరారు. సోషలిస్ట్ క్యూబాకు అండగా ఢిల్లీలో ఏర్పడిన క్యూబా సంఘీభావ కమిటీ ఆర్థికంగా వారికి సహాయం చేయాలని పిలుపునిచ్చిందన్నారు. అందులో భాగంగానే విశాఖలో ఉన్నటువంటి అన్ని ప్రభుత్వ రంగ సంస్థలలోనూ, కార్మికుల వద్ద నిధిని వసూలు చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఆటో కార్మికులు స్వచ్ఛందంగా క్యూబా సంఘీభావ నిధిని అందించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, కె.సత్యనారాయణ, వి.బాబ్జిరావు, ఎర్రినాయుడు, గణేష్ పాల్గొన్నారు.

సిసిఎస్ కార్యాలయాన్ని ఆర్‌టిసి హౌస్‌లోనే కొనసాగించాలి

- ఎపిపిటిడి కార్మిక పరిషత్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎపిఎస్ ఆర్‌టిసి కో- ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ (సిసిఎస్) కార్యాలయాన్ని ఆర్‌టిసి హౌస్‌లోనే కొనసాగించాలని ఎపి పిటిడి కార్మిక పరిషత్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు కార్మిక పరిషత్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్‌వి శేషగిరిరావు, వై.శ్రీనివాసరావులు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సిసిఎస్‌కు నూతన భవనం కొనుగోలు చేయాలని సిసిఎస్ పాలకవర్గ సభ్యులు నిర్ణయం తీసుకున్నట్లు వస్తున్న పత్రికల్లో వస్తున్న వార్తలు ఉద్యోగుల్లో ఆందోళన కలిగిస్తున్నాయన్నారు.

డబ్బులు తిరిగివ్వాలని అడిగినందుకు..

- మహిళను హత్యచేసిన నిందితుడు

ప్రజాశక్తి-పిడుగురాళ్ల (పల్నాడు జిల్లా)

తనతో సహజీవనం చేస్తున్న మహిళను ఇనుప రాడ్డుతో కొట్టి చంపి క్వారీ గుంతలో పడేసిన దుండగుడి ఘాతుకం పల్నాడు జిల్లా పిడుగురాళ్ల పట్టణంలో సోమవారం వెలుగుచూసింది. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని మారుతి నగర్‌కు చెందిన తాటి ఆదిలక్ష్మి (37)కి జానపాడుకు చెందిన కొండలు అనే వ్యక్తితో 17 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. వివాదాల కారణంగా దంపతులిద్దరూ ఐదేళ్ల కిందట విడిపోయారు. పిల్లలతో పిడుగురాళ్లలోని మారుతీ నగర్‌లో ఆదిలక్ష్మి ఉంటున్నారు. తాను పనిచేసే సున్నపు బట్టీ మేస్త్రి అయిన వేముల ఏడుకొండలు అనే వ్యక్తితో ఆమె సహజీవనం చేస్తున్నారు. ఈ క్రమంలో ఏడుకొండలుకు ఆదిలక్ష్మి రూ.మూడు లక్షలు ఇచ్చారు. డబ్బులు తిరిగి ఇవ్వాలని అడిగినప్పుడల్లా ఆమెను ఏడుకొండలు కొడుతుండేవాడు. ఆదివారం కూడా గొడవ జరగడంతో పిల్లలిద్దర్నీ సమీపంలోని అమ్మమ్మ ఇంటికి పంపించారు. అర్ధరాత్రి ఆదిలక్ష్మి తలపై ఇనుప రాడ్డుతో కొట్టి ఆమెను చంపేశాడు. అనంతరం మృతదేహాన్ని మారుతీనగర్ పక్కనే ఉన్న క్వారీలో పడేసి రోజూ మాదిరే కూలి పనులకు వెళ్లాడు. తెల్లవారిన తర్వాత ఇంటికొచ్చిన పిల్లలు.. ఇల్లంతా రక్తం ఉండడం, తల్లి కనిపించకపోవడంతో ఇరుగుపొరుగు వారికి చెప్పారు. వారు పోలీసులకు సమాచారం ఇవ్వగా పట్టణ సిఐ వెంకట్రావ్ ఆ ఇంటిని పరిశీలించారు. క్వారీ గుంతలో ఆదిలక్ష్మి మృతదేహం లభించింది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

తులసిబాబు పిటిషన్‌పై తీర్పు వాయిదా

ప్రజాశక్తి-అమరావతి

డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామ కృష్ణరాజును టార్చర్ చేశారంటూ గుంటూరు, నగరపాలెం పోలీసులు పెట్టిన కేసులో తనకు బెయిల్ ఇవ్వాలంటూ నిందితుడు కామేపల్లి తులసిబాబు పిటిషన్‌పై హైకోర్టు తీర్పును వాయిదా వేసింది.

ఈ మేరకు జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జునరావు సోమవారం ఉత్తర్వులిచ్చారు. పిటిషనర్‌ను జైల్లో పెట్టి రెండు నెలలు దాటిందని, ఇప్పటికే పోలీసులు రెండు సార్లు కస్టడీలోకి తీసుకుని విచారించారన్నారు. బెయిల్ మంజూరు చేయాలని కోరారు. పోలీసుల తరఫున సీనియర్ న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు ప్రతివాదన చేస్తూ, రఘురామను అంతం చేయాలనే కుట్ర కూడా ఉందన్నారు. తులసిబాబు పాత్రను అతని స్నేహితులే వెల్లడించారన్నారు. వాదనలు పూర్తి కావడంతో తీర్పును రిజర్వు చేస్తున్నట్లు జడ్జి ప్రకటించారు.

నేడు, రేపు కలెక్టర్స్ కాన్ఫరెన్స్

- తొలిరోజు అజెండాలో మంచినీరు,
- చెరువులు నింపడం, పి-4 యాక్షన్ ప్లాన్, ఉపాధి హామీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఈ నెల 25, 26 తేదీల్లో కలెక్టర్ల కాన్ఫరెన్స్ సచివాలయంలో సిఎం చంద్రబాబు అధ్యక్షతన జరగనుంది. మంగళవారం ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభమై సాయంత్రం 7 గంటల వరకు జరగనుంది. కాన్ఫరెన్స్‌లో తొలుత సిసిఎల్‌ఎ ప్రారంభోపన్యాసం చేస్తారు. అనంతరం చీఫ్ సెక్రటరీ, రెవెన్యూశాఖ మంత్రి, ఆర్థికశాఖ మంత్రి, అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రసంగించనున్నారు. ఉదయం 11 గంటల నుంచి 11:30 గంటల వరకు ఆర్థికశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ విజన్, జిఎస్‌డిపి గురించి ప్రెజెంటేషన్ ఇవ్వనున్నారు. 11:40 గంటల నుంచి వాట్సాప్ గవర్నెన్స్, ఆర్‌టిజిఎస్‌పై ఐటి ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రెజెంటేషన్ ఇస్తారు. అనంతరం గ్రీవెన్స్ రెసిడెన్షియల్ స్టేటస్‌పై చీఫ్ సెక్రటరీ ప్రెజెంటేషన్ ఇస్తారు. అనంతరం భూముల సర్వే గురించి సిసిఎల్‌ఎ ప్రెజెంటేషన్ ఇస్తారు. అనంతరం సీజనల్ సమస్యలు, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి ప్రెజెంటేషన్ ఆయా శాఖల సెక్రటరీలు ఇవ్వనున్నారు. తొలుత మంచినీటి సమస్య, సమ్మర్ స్టోరేజీ ట్యాంకుల గురించి జలవనరులశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ప్రెజెంటేషన్ ఇవ్వనున్నారు. ఎక్స్ అఫీషియో చీఫ్ స్పెషల్ సెక్రటరీ చెరువులు నింపడం గురించి ప్రెజెంటేషన్ ఇవ్వనున్నారు. అనంతరం పశుసంవర్ధకశాఖ, వేసవిలో ఆరోగ్యశాఖ తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరిస్తారు. పంచాయతీరాజ్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఉపాధిహామీ పథకం, గ్రామీణ ప్రాంతాల్లో మంచినీటి సౌకర్యాలు గురించి వివరిస్తారు. అర్బన్ ప్రాంతాల్లో మంచినీటి సమస్యపై మున్సిపల్‌శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, ఉష్ణోగ్రతలు, వాతావరణంలో మార్పులు గురించి విపత్తుల నిర్వహణ సంస్థ ఎమ్‌డి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇవ్వనున్నారు. రూఫ్‌టాప్ సోలార్, పిఎం సూర్యఘర్, గ్రీన్ కవర్, నగర వనం, ఫారెస్ట్ క్లియరెన్స్ (మేజర్ ఫారెస్ట్) ఎకో టూరిజం గురించి కలెక్టర్లకు సిఎస్ వివరిస్తారు. సాయంత్రం సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, బిసి వెల్ఫేర్, మైనార్టీ వెల్ఫేర్, పి4 గురించి ప్లానింగ్ సెక్రటరీ వివరించనున్నారు. వీటితో పాటు 2025-26 జిల్లాల్లో చేపట్టనున్న యాక్షన్ ప్లాన్, 15 శాతం గ్రోత్ రేట్ గురించి వివరించనున్నారు. రెండోరోజు సమావేశంలో లా అండ్ ఆర్డర్ గురించి డిజిపి వివరిస్తారు. ముఖ్యమంత్రి ముగింపు సందేశం ఉండనుంది.

దళితుల అభ్యున్నతికి సమగ్ర చర్యలు

- రాజీవ్ రంజన్ మిశ్రా నివేదికను బహిరంగపరచాలి
- ముఖ్యమంత్రికి కెవిపిఎస్ లేఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

దళితుల అభ్యున్నతికి ప్రభుత్వం సమగ్ర చర్యలు చేపట్టాలని కెవిపిఎస్ డిమాండ్ చేసింది. ఈ మేరకు సిఎం చంద్రబాబుకు కెవిపిఎస్ అధ్యక్షులు ఓ నల్లప్ప, ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి సోమవారం లేఖ రాశారు. దళితుల అభ్యున్నతికి కీలకమైన అంశం భూ పంపకమన్నారు. రాజీవ్ రంజన్ మిశ్రా నివేదిక ఈ అంశాన్ని నొక్కి చెప్పిందన్నారు. గత పదేళ్ల కాలంలో ప్రభుత్వం అసైన్డ్ భూముల క్రమబద్ధీకరణ పేరుతో దళితుల నుంచి వేల ఎకరాల భూములు పెత్తందారులకు కట్టబెట్టారని లేఖలో ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో ప్రతి దళిత కుటుంబానికి రెండెకరాల భూమి పంచాలని, అన్యాక్రాంతమైన భూములను పేదలకు స్వాధీనం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ రంగంలో ఉద్యోగాలు పడిపోతున్న నేపథ్యంలో ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు అమలు చేయకుండా దళితులు, ఆదివాసీలు, వెనుకబడిన తరగతులకు న్యాయం జరగదన్నారు. ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం చట్టం చేయాలన్నారు. రాష్ట్రంలో గత 15 ఏళ్లుగా బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయలేదని, అనేక ప్రభుత్వ రంగ సంస్థల్లో ఎన్ని ఖాళీలు ఉన్నాయనేది కూడా చూపడం లేదని అన్నారు. అన్ని డిపార్టుమెంట్లలో ఉన్న ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. షెడ్యూల్డ్ కులాల వర్గీకరణ విషయంలో దళితులను మోసం చేయకుండా పారదర్శకంగా వ్యవహరించాలని వారు విజ్ఞప్తి చేశారు. రాజీవ్ రంజన్ మిశ్రా నివేదికను బహిరంగపరచి పబ్లిక్ డొమైన్‌లో పెట్టాలని, రాష్ట్రంలోని అన్ని పక్షాలతో చర్చించి పూర్తి స్థాయిలో పారదర్శకంగా అమలు జరిపేందుకు చర్యలు తీసుకోవాలని సిఎంను కోరారు.

బలభద్రపురంలో అదుపులోనే కేన్సర్

- 31 వైద్య బృందాలతో పరీక్షలు
- మంత్రి సత్యకుమార్ యాదవ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తూర్పుగోదావరి జిల్లా, బలభద్రపురం గ్రామంలో కేన్సర్ అదుపులోనే ఉందని, ప్రజలు ఆందోళన చెందొద్దని వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. సచివాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బలభద్రపురంలో 31 వైద్య బృందాలతో సార్వత్రిక కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో అనపర్తి శాసనసభ్యులు బలభద్రపురం కేన్సర్ కేసులు అధికంగా నమోదైనట్లు సభ దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. అందుకు అనుగుణంగా గ్రామంలో సమగ్ర కేన్సర్ సర్వేను ప్రారంభించినట్లు చెప్పారు.

నవంబర్ నుంచి ఆరోగ్య శాఖ నోటి, రొమ్ము, గర్భాశయ కేన్సర్ నిర్ధారణ చేసే సార్వత్రిక కేన్సర్ స్క్రీనింగ్ నిర్వహిస్తోందని తెలిపారు. కేన్సర్‌పై ప్రజల్లో పెద్దయెత్తున అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రాష్ట్రంలో 4.09 కోట్ల మందికి స్క్రీనింగ్ చేయాలని లక్ష్యం కాగా ఇప్పటికే 1.93 కోట్ల మందికి స్క్రీనింగ్ పూర్తిచేశామని చెప్పారు. వీరిలో 1,45,649 అనుమానిత కేసుల్లో 95,263 మందిని పిహెచ్‌సి వైద్య బృందాలు పరీక్షించాయని వెల్లడించారు. 2022 నుంచి 2025 వరకు 1,13,363 కేన్సర్ కేసులకు చికిత్సలు అందించామని, వీటిల్లో అత్యధిక కేసులు కాకినాడ జిల్లాలో 5,931 నమోదయ్యాయని తెలిపారు. ఈ సమావేశంలో వైద్యారోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎమ్‌టి కృష్ణబాబు, మెడికల్ విద్య డైరెక్టర్ నర్సింహ పాల్గొన్నారు.

ఆయుష్ సేవల విస్తృతికి ప్రణాళికలు

ఆయుష్ సేవలకు డిమాండ్ పెరుగుతున్న దృష్ట్యా వీటి విస్తృతికి ప్రణాళికలు చేపట్టాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ అధికారులను ఆదేశించారు. ఆయుష్ సేవల పరిస్థితిపై సంబంధిత అధికారులతో సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో 1,188 ఆయుష్ డిస్పెన్సరీల్లో 50 శాతం డాక్టర్ల కొరత ఉందని పేర్కొన్నారు. మెడికల్ రిక్రూట్మెంట్ బోర్డు ద్వారా ఈ ఖాళీల భర్తీకి వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. గత ప్రభుత్వం మూడేళ్లపాటు జాతీయ ఆయుష్ మిషన్ కింద ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని, ఈ నిర్లక్ష్యం వల్ల రాష్ట్రంలో ఆయుష్ సేవలు దెబ్బతిన్నాయని విమర్శించారు. ఆయుష్ భవనాల పునర్నిర్మాణం, మరమ్మతుల కోసం దాతల సాయాన్ని కోరాలని అధికారులకు సూచించారు. సెంటర్ ఫర్ రీసెర్చ్ ఇన్ యోగా, ఆయుర్వేద అండ్ నేచురోపతి (క్రియాన్) నిర్మాణాన్ని రెండేళ్లలో పూర్తి చేసేలా తగు చర్యల్ని చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో ఎమ్‌టి కృష్ణబాబు, ఆయుష్ కమిషనర్ డి మంజుల తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోండి

- రైతు, కౌలు రైతు సంఘాల డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అకాల వర్షాల వల్ల అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో నష్టపోయిన ఉద్యాన పంటల రైతులను ఆదుకోవాలని కోరుతూ ఎపి రైతు సంఘం, ఎపి కౌలు రైతు సంఘం డిమాండ్ చేశాయి. ఈ మేరకు రైతు సంఘం రాష్ట్ర నాయకులు వి రాంభూపాల్, కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి బి హరిబాబు... వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి రాజశేఖర్‌ను సచివాలయంలో సోమవారం కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. గత రెండు రోజులుగా అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్‌ఆర్ కడప, అన్నమయ్య జిల్లాల్లో ఈదురుగాలులు, వడగండ్ల వర్షాల వల్ల ఉద్యాన పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని తెలిపారు. అధికారుల నుంచి సరైన స్పందన రాకపోవడంతో అనంతపురం జిల్లా యల్లనూరు మండలం నీర్జాంపల్లి గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ, చిన్న వెంగప్ప అనే రైతులు ఆత్మహత్యాయత్నం చేసుకున్నారని చెప్పారు. పంట నష్టపరిహారం చెల్లించడంలో వాస్తవ సాగుదారులైన కౌలు రైతులను ఆదుకునే చర్యలు తీసుకోవాలని కోరారు. నష్టపోయిన అరటి, దానిమ్మ రైతులకు ఎకరాకు రూ.లక్ష, మామిడి, బొప్పాయి, ఇతర పంటలకు ఎకరాకు రూ.50 వేలు పరిహారం చెల్లించాలన్నారు. రాజకీయాలకు అతీతంగా పంట నష్టపోయిన రైతులను గుర్తించి, గ్రామ సచివాలయాల్లో బాధిత రైతుల పేర్లు ప్రకటించాలని కోరారు. పంట నష్టపోయిన రైతుల రుణాలపై మారిటోరియం ప్రకటిం చాలని, బ్యాంకు అప్పులు రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. పంట సాగుకు అవసరమైన పెట్టుబడిసాయం ప్రభుత్వమే అందించాలని కోరారు.



బి.రాజేఖర్‌కు వినతిపత్రం అందిస్తున్న రైతుసంఘం నాయకులు

బాధిత రైతు కుటుంబాల్లో చదువుకుంటున్న పిల్లల చదువులకు ఆటంకం లేకుండా ప్రభుత్వమే సాయం చేయాలని, ఆత్మహత్యాయత్నం చేసుకున్న ఇద్దరు రైతులకు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు.

నష్టపరిహారం తక్షణమే అందించండి : సిపిఐ

ఇటీవల సంభవించిన అకాల వర్షాలు, ఈదురుగాలుల వల్ల పంట నష్టాన్ని వెంటనే అంచనా వేసి తక్షణమే నష్టపరిహారాన్ని అందించి రైతులను ఆదుకోవాలని సిపిఐ కోరింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ.. ముఖ్యమంత్రి చంద్రబాబుకు సోమవారం లేఖ రాశారు. ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన రైతులకు మెరుగైన వైద్య సాయం అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. యల్లనూరు మండలంలోని నీర్జాంపల్లికి చెందిన రైతులు లక్ష్మీనారాయణ 12 ఎకరాల్లో రూ.18 లక్షల పెట్టుబడి తో, చిన్న వెంగప్ప 9 ఎకరాల్లో రూ.12 లక్షల పెట్టుబడితో అరటి సాగు చేశారని తెలిపారు. పంట నేలరాలడంతో దిగులు చెందిన వారు ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం బాధాకరమన్నారు.

వయో వృద్ధులకు డిజిటల్ గుర్తింపు కార్డులు

- వచ్చే ఏడాది నుంచి అంధ విద్యార్థులకు బ్రెయిలీ లిపి పుస్తకాలు
- కొత్తగా 12 వృద్ధాశ్రమాలు
- మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వయో వృద్ధులకు డిజిటల్ గుర్తింపు కార్డులు ఇవ్వనున్నామని, వయో వృద్ధుల హక్కులపై వారికి అవగాహన కల్పించడంతోపాటు చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేయాలని వయో వృద్ధులు, వికలాంగుల సంక్షేమశాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి పేర్కొన్నారు. సీనియర్ సిటిజన్స్ స్టేట్ కౌన్సిల్ 2వ సమావేశం, స్టేట్ అడ్వైజరీ బోర్డు ఆన్ డిజాబిలిటీ సమావేశం మంత్రి అధ్యక్షతన సచివాలయంలో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా వయో వృద్ధుల ఆరోగ్య సంరక్షణ వృద్ధాశ్రమాలు ఏర్పాటు, సామాజిక భద్రత పింఛన్లు, గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా డిజిటల్ కార్డుల పంపిణీ, వికలాంగుల వైకల్య ధ్రువపత్రాల జారీ, ప్రధాన మంత్రి దివ్యాస కేంద్రాలు స్థాపన, ఉపకరణాల సరఫరా, వివిధ అభివృద్ధి పథకాల్లో 5 శాతం రిజర్వేషన్ల అమలు, వసతి గృహాలు, కళాశాలల్లో విద్యనభ్యసిస్తున్న వికలాంగ విద్యార్థులకు డిబిటి మోడల్ పెన్షన్ల పంపిణీ అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి మాట్లాడుతూ.. వయో వృద్ధులు, వికలాంగుల సంక్షేమంలో రాష్ట్రం దేశానికే ఆదర్శంగా ఉండాలన్నదే సిఎం చంద్రబాబు లక్ష్యమన్నారు. ఇంటికి దూరంగా ఉంటూ వివిధ ప్రాంతాల్లో వసతి గృహాలు, కళాశాలల్లో విద్యనభ్యసిస్తున్న వికలాంగ విద్యార్థులకు ఫించను నేరుగా వారి ఖాతాల్లోనే జమ చేస్తామన్నారు.

నిజమైన లబ్ధిదారులకు ఫించన్ అందించడమే లక్ష్యంగా ఫించన్ వెరిఫికేషన్ జరుగుతోందన్నారు. అర్హత కలిగిన ప్రతిఒక్కరికీ పథకాలు అందాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. రాష్ట్రంలో 5 ప్రధాన మంత్రి దివ్యాస కేంద్రాల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. ఇందులో విజయవాడ, విశాఖపట్నం, ఒంగోలు, తిరుపతి, కర్నూలులో ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల్లో వికలాంగులకు వీల్ చైర్లు ఏర్పాటు చేయాలని ఇప్పటికే ఆదేశాలిచ్చామన్నారు. ప్రతి ఒక్కరికీ ఆధార్ కార్డు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

అంధ విద్యార్థులకు వచ్చే విద్యా సంవత్సరం నుంచి బ్రెయిలీ లిపి పుస్తకాలు అందజేస్తామన్నారు. ఆటిజం విద్యార్థులు, తల్లిదండ్రులకు సైకాలజిస్టుల ద్వారా కౌన్సెలింగ్ ఇప్పిస్తామని మంత్రి డోలా తెలిపారు. కేంద్ర సహకారంతో రాష్ట్రంలో కొత్తగా 12 వృద్ధాశ్రమాలు నిర్మిస్తున్నామని, అన్ని జిల్లాల్లో వృద్ధాశ్రమాల ఏర్పాటుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఒంటరిగా నివాసం ఉంటున్న వయో వృద్ధుల వివరాలు పోలీస్‌శాఖ సేకరించి గ్రామ సచివాలయాల్లో ప్రదర్శించాలన్నారు. వయో వృద్ధులపై వేధింపులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని మంత్రి హెచ్చరించారు. వృద్ధుల ఆరోగ్య సంరక్షణతోపాటు ఆస్తుల సంరక్షణకు ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకుంటుందన్నారు.

టిటిడి వార్షిక బడ్జెట్ రూ.5258.68 కోట్లు

- పోటు కార్మికులకు కోత లేకుండా వేతనం
- బ్రేక్ దర్శన వేళలు మార్పు
- అన్యమత ఉద్యోగులకు బదిలీ లేదా విఆర్‌ఎస్

ప్రజాశక్తి -తిరుమల

తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ బిఆర్ నాయుడు అధ్యక్షతన టిటిడి పాలకమండలి సమావేశం తిరుమల అన్నమయ్య భవన్‌లో సోమవారం జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. 2025-26వ సంవత్సరం వార్షిక బడ్జెట్‌ను రూ.5258.68 కోట్లతో పాలకమండలి ఆమోదం తెలిపింది. పాలకమండలిలో తీసుకున్న నిర్ణయాలను మీడియాకు బిఆర్ నాయుడు వెల్లడించారు. ముంతాజ్ హోటల్ నిర్మాణానికి వేరేచోట భూమి కేటాయించాలని సిఎం చంద్రబాబు ఆదేశాల మేరకు అలిపిరి వద్ద ఉన్న 35.24 ఎకరాలతో పాటు 15 ఎకరాల టూరిజం భూమిని టిటిడి స్వాధీనం చేసుకొని.. ప్రత్యామ్నాయంగా 50 ఎకరాల భూమిని మరో ప్రదేశంలో ప్రభుత్వానికి కేటాయిస్తామని స్పష్టం చేశారు. మన దేశంలోనే కాక ఇతర దేశాల్లోనూ శ్రీవారి ఆలయాలు నిర్మిస్తామని తెలిపారు. శ్రీవాణి ట్రస్టుతో పాటు నూతనంగా ఏర్పాటు చేయబోయే మరో ట్రస్టు ద్వారా వచ్చే విరాళాలతో ఈ ఆలయాలను నిర్మిస్తామని అన్నారు. శ్రీవారి ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా ప్రత్యేక కమిటీ నియమిస్తున్నామని చెప్పారు. శ్రీవారి ఆస్తులకు సంబంధించి న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరగా పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటున్నా మన్నారు. టిటిడిలో ప్రస్తుతం విధుల్లో ఉన్న అన్యమతస్తులను వారి హోదాకు తగినట్లుగా, వారి మనోభావాలకు భంగం కలగకుండా వివిధ ప్రత్యామ్నాయ పద్ధతుల ద్వారా బదిలీ లేదా విఆర్‌ఎస్ ఇచ్చేందుకు చర్యలు చేపడతామని ప్రకటించారు. దేశంలోని అన్ని రాష్ట్రాల రాజధానుల్లో శ్రీవారి ఆలయాలు నిర్మిస్తామని, ఇప్పటికే పలువురు సిఎంలు ఆలయ నిర్మాణాలకు ఆమోదం తెలిపారని గుర్తుచేశారు. రాష్ట్రంలో పలుచోట్ల నిలిచిపోయిన దేవాలయాలను పునర్ నిర్మించాలని ఈ సమావేశంలో నిర్ణయించామని వెల్లడించారు. పోటు కార్మికులకు జిఎస్‌టి భారం లేకుండా జీతం రూ.43 వేలు చెల్లించేలా నిర్ణయం తీసుకున్నామని అన్నారు. సైన్స్ సిటీకి టిటిడి కేటాయించిన 20 ఎకరాల స్థలాలను రద్దు చేశామన్నారు. టిటిడి ఉద్యోగులకు మూడు నెలలకు ఒక్కసారి సుపథం ద్వారా దర్శనం కల్పిస్తామని ప్రకటించారు. లైసెన్స్ లేని హకర్ల నిర్మూలనకు రెవెన్యూ, విజిలెన్స్ శాఖ ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేస్తామని అన్నారు. టిటిడి ఉద్యోగుల నేమ్ బ్యాడ్జ్‌ల ఏర్పాటుపై అధ్యయనం చేశామని తెలిపారు. విఐపి బ్రేక్ దర్శనాలు గతంలో మాదిరిగానే ఉదయం ఆరు గంటలకు ప్రారంభించాలని సూచించామని చెప్పారు. తిరుపతి గంగమ్మ, తలకోన, కర్నూల్ జిల్లాలో బుగ్గ, అనకాపల్లి జిల్లాలోని ఉపమాక, ధర్మవరం, తెలంగాణలోని కొడంగల్, సికింద్రాబాద్, కరీంనగర్‌లలో నూతనంగా ఆలయాలు నిర్మిస్తున్నామని ప్రకటించారు. 180 మంది కాంట్రాక్టు లెక్చరర్‌లకు జీత భత్యాల పెంపుపై కమిటీ వేశామని చెప్పారు. వికలాంగులు, వృద్ధులకు అఫ్‌లైన్‌లో టికెట్లు జారీపై కమిటీ వేశామని అన్నారు. పాత ఆగమ సలహా మండలిని రద్దు చేశామని.. త్వరలోనే నూతన కమిటీని నియమిస్తామని స్పష్టం చేశారు. శ్రీనివాసం స్పోర్ట్స్ కాంప్లెక్స్ అభివృద్ధికి రూ. కోటి నిధులు మంజూరు చేశామని అన్నారు. గూగుల్ సంస్థ ద్వారా తిరుమల కార్యకలాపాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగిస్తున్నట్లు తెలిపారు.



తిరుమల అన్నమయ్య భవన్‌లో టిటిడి వార్షిక బడ్జెట్ సమావేశం

యువకుడిపై పోక్సో కేసు

ప్రజాశక్తి - నాగలాపురం(తిరుపతి జిల్లా)

తిరుపతి జిల్లా నాగలాపురం మండలం కాలంజేరి కాలనీకి చెందిన 17 ఏళ్ల బాలికపై అదే కాలనీకి చెందిన చరణ్ (23) అత్యాచారం చేసిన కేసులో పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సునీల్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. కాలంజేరి కాలనీకి చెందిన బాలికను పెళ్లి చేసుకుంటానని ప్రలోభపరచి చరణ్ పలుమార్లు అత్యాచారం చేశాడు. పెళ్లి చేసుకోవాలని బాలిక కోరగా నిరాకరించాడు. ఈ విషయాన్ని బాలిక తల్లికి చెప్పడంతో గ్రామ పెద్దల సమక్షంలో మధ్యవర్తిత్వం జరిగింది. ఆ సమయంలో బాలిక నడవడిక సరిగ్గా లేదని, ఆమె మంచిది కాదని పెళ్లి చేసుకోవడానికి చరణ్ నిరాకరించాడు. దీంతో ఆవేదనకు గురైన బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారని, పోక్సో కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

ఎంపి మిథున్‌రెడ్డి పిటిషన్‌పై సమగ్ర విచారణ

ప్రజాశక్తి-అమరావతి

మద్యం కొనుగోళ్లపై సిఐడి కేసు పెట్టడాన్ని సవాల్ చేస్తూ రాజంపేట ఎంపి మిథున్‌రెడ్డి వేసిన పిటిషన్‌పై సమగ్ర విచారణ బుధవారం జరుపుతామని హైకోర్టు ప్రకటించింది. మద్యం కొనుగోళ్ల వ్యవహారంలో 164 స్టేట్‌మెంట్లకు సంబంధించిన వివరాలను తమ ముందుంచాలని సిఐడిని జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జునరావు సోమవారం ఆదేశాలిచ్చారు.

నష్టపోయిన ప్రతి రైతునూ ఆదుకుంటాం

- మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అకాల వర్షాలకు అరటి, మొక్కజొన్న, బొప్పాయి, వరి పంటలకు కొన్నిచోట్ల పంట నష్టం జరిగిందన్నారు. ఇప్పటికే అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి అకాల వర్షాలకు జరిగిన పంటనష్టం వివరాలు సేకరిస్తున్నారన్నారు. హెక్టారుకు రూ.35 వేల సబ్సిడీ అందజేయడంతోపాటు ఉద్యానవన పంటల ప్రోత్సాహం కింద మొక్కలు తిరిగి వేసుకునేందుకు అదనంగా హెక్టారుకు రూ.75 వేలు అందజేస్తామన్నారు. ఇన్సూరెన్స్ ఉంటే వారికి అదనంగా పరిహారం ఉంటుందని, అనంతపురం, సత్యసాయి, కడప, ప్రకాశం జిల్లాల్లో ఇప్పటికే అధికారులు పర్యటించి వివరాలు సేకరిస్తున్నారని మంత్రి తెలిపారు. మిగిలిన ప్రాంతాల్లోనూ త్వరలో ఎన్యూమరేషన్ ప్రక్రియ మొదలవుతుందన్నారు. [illegible] ప్రతిపక్ష ప్రభుత్వం అండగా నిలుస్తుందని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇన్‌పుట్ సబ్సిడీని రూ.25 వేల నుంచి రూ.35 వేలకు పెంచిన విషయం వైసిపి అధినేత వైఎస్ జగన్ కనిపించలేదా? అని ఆయన ప్రశ్నించారు. పులివెందులలో అరటి రైతులు ఉన్నారని ఇప్పుడు గుర్తొచ్చిందా? జగన్ హయాంలో అరటి రైతులను ఆదుకునేందుకు ఒక్క రూపాయి కూడా సహాయం అందించలేదన్నారు. వైసిపి హయాంలో ప్రభుత్వ కార్యాలయాలకు రూ.3 వేలకోట్లతో రంగులు వేయడంపై చూపించిన శ్రద్ధలో ఒక వంతు కూడా రైతులను ఆదుకునేందుకు చూపలేదన్నారు.

సిఐడి కార్యాలయానికి పోసాని

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

వైసిపి నాయకుడు, సినీనటుడు పోసాని కృష్ణమురళి సోమవారం గుంటూరు సిఐడి ప్రాంతీయ కార్యాలయం అధికారుల ఎదుట హాజరయ్యారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌ను దూషించిన కేసులో అరెస్టు అయిన ఆయనకు ఇటీవల గుంటూరు కోర్టులో బెయిల్ మంజూరు అయిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా కోర్టు కొన్ని షరతులు విధించింది. అందులో భాగంగా వారంలో రెండు రోజులు సోమవారం, గురువారం గుంటూరు సిఐడి కార్యాలయానికి హాజరు కావాలని షరతు విధించారు. ఈ మేరకు సోమవారం సిఐడి కార్యాలయానికి వచ్చి అధికారుల సమక్షంలో సంతకం చేసి వెళ్లిపోయారు.

స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించొద్దు

- హెచ్‌పిసిఎల్ వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి నిరసన

ప్రజాశక్తి - ములగాడ (విశాఖపట్నం)

విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించాలని, ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని, కాంట్రాక్టు కార్మికుల తొలగింపులు ఆపాలని, ప్లాంట్ ప్రయివేటీకరణను నిలిపివేస్తున్నట్టు పార్లమెంట్‌లో ప్రకటన చేయాలని డిమాండ్ చేస్తూ విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన సోమవారం హెచ్‌పిసిఎల్ వద్ద నిరసన చేపట్టారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం కేంద్రంపై టిడిపి కూటమి ప్రభుత్వం ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమానుద్దేశించి జెఎసి చైర్మన్ ఎం.జగ్గునాయుడు, ఐఎన్‌టియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బి.నాగభూషణం, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.లక్ష్మణమూర్తి, ఎఐటియుసి జిల్లా నాయకులు జి.రాంబాబు, వైఎస్‌ఆర్‌టియుసి జిల్లా అధ్యక్షులు అనిల్ కుమార్ మాట్లాడారు. దేశంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు రంగ స్టీల్‌ప్లాంట్లకు సొంత గనులు కేటాయించి, విశాఖ ఉక్కు కర్మాగారానికి మాత్రం కేటాయించకుండా కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపడం దారుణమన్నారు. ఈ చర్య వల్ల ప్లాంట్ ఉత్పత్తి వ్యయం పెరిగి నష్టాల బారిన పడుతోందని తెలిపారు. అనకాపల్లి జిల్లాలో ఇంకా నిర్మాణమే మొదలుకాని ఆర్సెలార్ మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌కు గనులు కేటాయించాలని ప్రధానిని సిఎం చంద్రబాబు అభ్యర్థించారని, వైజాగ్ స్టీల్‌ప్లాంట్ విషయంలో మాత్రం ఆ చొరవ ప్రదర్శించలేదని



నిరసన తెలుపుతున్న విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి నాయకులు

విమర్శించారు. విశాఖ ఉక్కు కర్మాగారంపై ఆయనకు చిత్తశుద్ధి ఉందా ? అని ప్రశ్నించారు. ప్లాంట్‌లో ఇప్పటికే 960 మంది కాంట్రాక్టు కార్మికులను తొలగించారని, ఈ ఏడాది 5600 మందిని తొలగించేందుకు కుట్రలు జరుగుతున్నాయని విమర్శించారు.

బిజెపి ఎమ్మెల్సీ వ్యాఖ్యలు, బెదిరింపులపై ఖండన

విశాఖ ఉక్కు నష్టాలకు స్టీల్‌ప్లాంట్ కార్మిక సంఘాల నాయకులే కారణమని, వారి ఆస్తులపై విచారణ జరిపించాలని బిజెపి ఎమ్మెల్సీ సోము వీర్రాజు తీవ్ర వ్యాఖ్యలు చేస్తూ.. బెదిరింపులకు పూనుకోవడాన్ని జెఎసి నాయకులు తీవ్రంగా ఖండించారు. స్టీల్‌ప్లాంట్‌ను నష్టాలకు గురి చేస్తున్నది, కార్పొరేట్లకు కట్టబెట్టాలని కుట్రలు కొనసాగిస్తోన్నది మోడీ ప్రభుత్వమేనని అన్నారు. విశాఖ ఉక్కుకు కేంద్రం ప్రకటించిన రూ.11440 కోట్ల ఆర్థిక ప్యాకేజీతో సమస్యంతా పరిష్కారం అయినట్టు సోము వీర్రాజు వ్యాఖ్యలున్నాయని అన్నారు. ఈ నిధులను సంస్థ ఉత్పత్తికి, ముడి సరుకుకు, యంత్రాలకు, కార్మికుల జీతాలకు వినియోగించకుండా కేంద్రం ఎందుకు ఆంక్షలు పెట్టిందని నాయకులు ప్రశ్నించారు. ధైర్యముంటే తమ ప్రశ్నలకు ఆయన సమాధానం చెప్పాలని సవాలు విసిరారు.

ఇజ్రాయిల్ దుశ్చర్యలపై నిరసన ప్రదర్శన

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

గాజాలో ఇజ్రాయిల్ సాగిస్తున్న మారణహోమాన్ని నిరసిస్తూ శ్రీకాకుళంలో అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం ఆధ్వర్యాన మంగళవారం నిరసన ప్రదర్శన చేపట్టారు. స్థానిక సూర్యమహల్ కూడలి నుంచి సాగిన ర్యాలీ జిటి రోడ్డు మీదుగా ఏడు రోడ్ల జంక్షన్ వరకు ప్రదర్శన సాగింది. పాలస్తీనాపై దాడులు ఆపాలని, పశ్చిమాసియాలో శాంతి నెలకొల్పాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు కె శ్రీనివాసు మాట్లాడుతూ కాల్పుల విరమణ ఒప్పందానికి అంగీకరించిన ఇజ్రాయిల్ ఒప్పందాన్ని అమలు చేయకుండా 600 మందిని పొట్టన పెట్టుకుందని, అందులో మహిళలు, చిన్నారులే అధికంగా ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అమెరికా ప్రోద్బలంతోనే ఇజ్రాయిల్ మారణహోమానికి తెగబడుతోందన్నారు. గాజా నుంచి ముస్లిములను వెళ్లగొట్టేందుకు ట్రంప్ చూస్తున్నారని చెప్పారు. పశ్చిమాసియాపై పట్టు కోసం ఆయన ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. అమెరికా, ఇజ్రాయిల్ దురాగతాలపై ప్రధాని మోడీ కనీసం ఖండించడంలేదన్నారు. పాలస్తీనాపై దాడులను విరమించాలని, ఇజ్రాయిల్‌ను వెనక్కి పిలిపించాలని డిమాండ్ చేశారు. నిరసన ర్యాలీకి అధిక సంఖ్యలో ముస్లిములు వచ్చి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో నాయకులు భవిరి కృష్ణమూర్తి, జామియా మసీదు అధ్యక్షుడు మొహిబిల్లాఖాన్, ప్రభాకరరావు, ఎం ఆదినారాయణమూర్తి, కె నాగమణి, లక్ష్మి పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం నాయకులు, ముస్లింలు

వినియోగదారుల హక్కులకు భరోసా

- మంత్రి నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వినియోగదారుల హక్కులకు రక్షణ, భరోసా కల్పించేందుకు కృషి చేస్తున్నామని పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. విజయవాడ సివిల్ కోర్టు సెంటర్‌లో వినియోగదారుల కమిషన్ రెండో అదనపు బెంచ్‌ను సోమవారం బెజవాడ బార్ అసోసియేషన్ భవనం రెండో అంతస్తులో మంత్రితో కలిసి పౌరసరఫరాలశాఖ కమిషనరు సౌరబ్‌గౌర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మాట్లాడుతూ.. నాణ్యత లేని సరుకులు, కాలం చెల్లిన వస్తువులు అమ్ముతూ వినియోగదారులను మోసం చేసే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. విజయవాడలో వినియోగదారుల హక్కులకు వేదికగా ఈ అదనపు బెంచ్ పనిచేస్తుందన్నారు. అంతేకాకుండా వినియోగదారులకు సమాచారం అందించడంతోపాటు రాష్ట్ర వ్యాప్తంగా వినియోగదారుల హక్కులపై అవగాహన కల్పిస్తామన్నారు. దేశంలో రాష్ట్ర వినియోగదారుల ఫోరం కేసుల పరిష్కారం, పరిహారం అందించడంలో ముందు వరుసలో ఉన్నారన్నారు. రాష్ట్రంలో డిజిటల్ క్యాంపెయిన్‌ను స్కూల్స్, కళాశాలల్లో ప్రచారం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో విజయవాడ వినియోగదారుల అదనపు బెంచ్ ఫోరం చైర్మన్ సిహెచ్ కిషోర్, సభ్యులు కె శశికళ, బెజవాడ బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ అరిగల శివ రామ్‌ప్రసాద్, అధ్యక్షులు చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.


సిఎం పర్యటించే ప్రాంతాలను మ్యాప్ ద్వారా పరిశీలిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

27న చంద్రబాబు పోలవరం పర్యటన

- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, జెసి

ప్రజాశక్తి - పోలవరం

ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ నెల 27న పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులను పరిశీలించనున్న నేపథ్యంలో పర్యటన ఏర్పాట్లను ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి, జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి సోమవారం పరిశీలించారు. తొలుత ప్రాజెక్ట్ సైట్‌ను పరిశీలించి అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ నెల 27న ప్రాజెక్ట్ పనులను పరిశీలించేందుకు సిఎం వస్తున్నారని, అధికారులందరూ పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని అన్నారు. పోలవరం ప్రాజెక్ట్ పనుల్లో డయాఫ్రమ్‌వాల్, అప్పర్ కాఫర్ డ్యామ్, లోయర్ కాఫర్ డ్యామ్, గ్యాప్-1, గ్యాప్-2, వైబ్రో కంప్రెషన్ తదితర పనులను సిఎం పరిశీలించే అవకాశం ఉందన్నారు. అనంతరం అధికారులతో సమీక్షిస్తారని చెప్పారు. ప్రాజెక్ట్ పనులను సిఎం పరిశీలించే ప్రదేశాల్లో పనుల ప్రగతి సూచించేలా ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అంతకుముందు డయాఫ్రమ్ వాల్, అప్పర్ కాఫర్ డ్యామ్, లోయర్ కాఫర్ డ్యామ్, గ్యాప్-1, గ్యాప్-2, వైబ్రో కంప్రెషన్ తదితర పనులను కలెక్టర్, జెసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఎ పిఒ రాములు నాయక్, ఎఎస్‌పి నక్కా సూర్యచంద్రరావు, ఆర్‌డిఒ రమణ, పోలవరం ప్రాజెక్ట్ ఎస్ఇ రెడ్డి రామచంద్రరావు, పోలవరం ప్రాజెక్ట్ ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న కోకో రైతుల సంఘం నేతలు, రైతులు

సమస్యలు పరిష్కరించాలని కోకో రైతుల ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏలూరు కలెక్టరేట్ వద్ద, పెదవేగి, ముసునూరు తహశీల్దార్ కార్యాలయాల వద్ద కోకో రైతులు సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్‌లోని స్పందన కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కోకో రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బొల్లు రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ... రైతుల వద్ద ఉన్న కోకో గింజలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, కిలో గింజలకు రూ.900 చెల్లించాలని డిమాండ్ చేశారు. విదేశీ కోకో గింజలను దిగుమతిని నిలిపివేసి రాష్ట్రంలో రైతులు పండించిన గింజలను కొనుగోలు చేయాలని కోరారు. ఉద్యానవన శాఖ నుంచి రావాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని, ధరల స్థిరీకరణ పథకం వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం నాయకులు రాధాకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం, అధికారులు స్పందించి గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. కోకో రైతుల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఎస్.గోపాలకృష్ణ, ఆయిల్ పామ్ రైతు సంఘం అధ్యక్షులు ఉండవల్లి వెంకట్రావు, ప్రాంతీయ కొబ్బరి రైతుల సంఘం ఉపాధ్యక్షులు మున్నంగి సుబ్బారెడ్డి ౦ పాల్గొన్నారు.

కొండగుట్టలపైనే మా బతుకులు

- కాంటూరు లెక్కలన్నీ కాకి లెక్కలే
- భద్రాచలం వద్ద 45 అడుగుల నీటిమట్టానికే మా గ్రామాలన్నీ మునక
- కుక్కునూరు, వేలేరుపాడు మండలాల నిర్వాసితుల ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పోలవరం ప్రాజెక్టు ముంపు గ్రామాలకు సంబంధించి ప్రభుత్వం చెబుతున్న కాంటూరు లెక్కలన్నీ కాకి లెక్కలనేనంటూ కుక్కునూరు, వేలేరుపాడు మండలాలకు చెందిన ముంపు గ్రామాల ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాజెక్టు కోసం సర్వం త్యాగం చేస్తున్న తమను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇబ్బందులకు గురి చేస్తున్నాయని తీవ్ర ఆవేదనకు గురయ్యారు. సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం ఏలూరు కలెక్టరేట్ వద్ద వందలాది మంది పోలవరం ముంపు గ్రామాల ప్రజలు ఆందోళన నిర్వహించి, ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అధికారులకు తమ్మ గోడు చెప్పుకుని వినతులు అందించారు. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల పరిధిలోని మద్రిపాడు, కౌండిన్యముక్తి, ఆంబోతుల గూడెం, యల్లప్పగూడెం, కొత్తూరు, మాధవరం, సుద్దగుంప, వసంతవాడ, కొత్తూరు వంటి పలు నిర్వాసిత గ్రామాలకు చెందిన ప్రజలు కలెక్టరేట్‌కు చేరుకుని ఆందోళన నిర్వహించారు. నిర్వాసితులు మాట్లాడుతూ.. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 45 అడుగులుకు చేరేసరికి తమ గ్రామాలన్నీ మునిగిపోతున్నాయన్నారు. ఈ గ్రామాలను 45.75 కాంటూరులో చేర్చి ఇప్పటి వరకూ పరిహారంగానీ, భూమికి భూమిగానీ ఏ ఒక్కటీ ఇవ్వలేదన్నారు. దీంతో ప్రతి ఏటా గోదావరి వరదలకు కొండగుట్టలపైన తమ బతుకులు కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాంటూరు లెక్కలపై ప్రభుత్వం మరోసారి పరిశీలన చేసి తమకు న్యాయం చేయాలని కోరారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ. రవి మాట్లాడుతూ.. ప్రభుత్వం చెబుతున్న కాంటూరు లెక్కలు తప్పని 2022 గోదావరి వరదలతో తేలిపోయాయన్నారు. ఏళ్లు గడుస్తుండటంతో 18 ఏళ్లు నిండిన వారి సంఖ్య పెరుగుతోందని, బాధితుల సంఖ్యను తగ్గించడం నిర్వాసితులకు అన్యాయం చేయడమేనన్నారు. 18 ఏళ్లు నిండిన వారికి పరిహారం విషయంలో అల్లూరి సీతారామరాజు జిల్లాలో కటాఫ్ తేదీ 2022గా నిర్ణయించి, ఏలూరు జిల్లాలో 2017 అక్టోబర్ ఏడో తేదీగా నిర్ణయించడం అన్యాయమన్నారు. కాంటూరు లెక్కలతో సంబంధం లేకుండా మండలం మొత్తాన్ని యూనిట్‌గా తీసుకుని పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఖాళీ చేయించే రోజు కటాఫ్ తేదీగా నిర్ణయించి యువతకు పరిహారం ఇవ్వాలని, యజమానులు చనిపోతే వారసులకు పరిహారం ఇవ్వాలని కోరారు. గతంలో రూ.1.15 లక్షల పరిహారం ఇచ్చిన భూములకు రూ.ఐదులక్షలు ఇవ్వాలని, గత ప్రభుత్వం ఇచ్చిన ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ రూ.పది లక్షల హామీని అమలు చేయాలని, 2013 భూసేకరణ చట్టం పటిష్టంగా అమలు చేయాలని, వివాహమైన ఆడపిల్లలకు పునరావాస పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాలను నిర్వాసితులతో కలిసి అధికారులకు అందించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఆర్.లింగరాజు, పి.రామకృష్ణ, వై.నాగేంద్రరావు, ధర్ముల రమేష్, మడివి దుర్గారావు ఇతర నాయకులు, నిర్వాసితులు పాల్గొన్నారు.


ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న పోలవరం ముంపు గ్రామాల ప్రజలు

41.15 కాంటూరులో లేదంటున్నారు



మా గ్రామం ఏటా వరదలకు మునిగిపోతోంది. కానీ, 45.75 కాంటూరులో ఉందని, 41.15 కాంటూరులో లేదని పరిహారం ఇవ్వలేదు. గ్రామంలో ఉన్న దాదాపు 70 కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. భూమికి భూమి ఇవ్వలేదు. ప్రాజెక్టు పూర్తయితే మా బతుకులు ఏమిటో అర్థం కావడం లేదు.

- యాకుబ్, మద్రిపాడు, కుక్కునూరు మండలం

ముంపులో గ్రామం లేదంటున్నారు



మా గ్రామంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రి ముంపులో ఉందని వేరేచోటుకు మార్చేశారు. గ్రామం మాత్రం ముంపులో లేదని చెబుతున్నారు. గోదావరి వరదకు మా గ్రామం ఏటా మునిగిపోతోంది. అయినప్పటికీ 45.75 కాంటూరులో మా గ్రామం ఉందని చెబుతున్నారు. గోదావరి వరదలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. పెళ్లయిన అమ్మాయిలకు పరిహారం ఇవ్వడం లేదు. చనిపోయిన వారి పేర్లు తీసేస్తున్నారు. వారసులకు పరిహారం ఇవ్వకపోవడం దారుణం.

- పూడెం జ్యోతి, సుద్దగుంప, వేలేరుపాడు మండలం

విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల రిలే దీక్షలు ప్రారంభం

- పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

ప్రజాశక్తి - తిరుపతి సిటి

దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించారని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలను సోమవారం ప్రారంభించారు. తిరుపతి జిల్లా ఎస్‌పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఈ దీక్షను ఉద్దేశించి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి మాట్లాడుతూ విద్యుత్తు సంస్థల్లో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్, కాంటాక్ట్ కార్మికుల సమస్యలు ఏళ్ల తరబడి పరిష్కారం కాలేదని తెలిపారు. రెగ్యులర్ ఉద్యోగుల సమస్యలూ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారయ్యాయన్నారు. వినియోగదారులను రకరకాల ఛార్జీల పేరుతో దోచుకుంటోందని, అయినా సంస్థకు సంబంధించి రూ. లక్షల కోట్లు అప్పులు చూపిస్తున్నారన్నారు. కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతున్నారని విమర్శించారు. ప్రభుత్వరంగంలో పర్మినెంట్ అనేది కనుమరుగవుతోందన్నారు. సమాన పనికి సమాన వేతన విషయాన్ని కోర్టు చెబుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కాంట్రాక్టు కార్మికుల సమస్యలను వినేందుకు ఎస్‌పిడిసిఎల్ సిఎండికి పట్టడం లేదన్నారు. యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుమార్ మాట్లాడుతూ విద్యుత్తు సంస్థలో కాంట్రాక్ట్ కార్మికులు దశాబ్దాలుగా పనిచేస్తున్నా రెగ్యులర్ కావడంలేదన్నారు. 16 నెలలు అరియర్స్ ఇవ్వకపోవడం దారుణమని తెలిపారు. ఏప్రిల్ ఏడో తేదీలోపు సమస్యలు పరిష్కరించాలని, లేకుంటే డిస్కం ముట్టడి కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుదర్శన్ రెడ్డి, రాష్ట్ర నాయకులు నాయబ్ రసూల్, కిరణ్ కుమార్, శివశంకర్, శివ ప్రసాద్ రెడ్డి, కడప జిల్లా సిఐటియు ప్రధాన కార్యదర్శి కె శ్రీనివాసులు రెడ్డి, తిరుపతి జిల్లా సిఐటియు కార్యదర్శి జయచంద్ర పాల్గొన్నారు.



ఎస్‌పిడిసిఎల్ కార్యాలయం ఎదుట రిలేదీక్షలు

ఎంఎస్‌ఎంఇల టర్నోవర్ పరిమితి రెట్టింపు

- పెట్టుబడుల పరిమితిలోనూ మార్పులు

న్యూఢిల్లీ : సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్‌ఎంఇ)ల పెట్టుబడులు, టర్నోవర్‌ల పరిమితుల్లో మార్పులు చేస్తూ కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. దీంతో నూతన విధానం ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానుంది. ఈ కొత్త విధానంతో సూక్ష్మ సంస్థల పెట్టుబడుల పరిమితిని రూ.1 కోటి నుంచి రూ.2.5 కోట్లకు పెరిగింది. వీటి టర్నోవర్‌ను కూడా రూ.5 కోట్ల నుంచి రూ.10 కోట్లకు చేర్చింది. చిన్న సంస్థల పెట్టుబడులను రూ.10 కోట్ల నుంచి రూ.25 కోట్లకు పెంచింది. వీటి టర్నోవర్‌ను రూ.50 కోట్ల నుంచి రెట్టింపు చేసి రూ.100 కోట్లకు చేర్చింది. రూ.25 కోట్ల నుంచి రూ.125 కోట్ల వరకు పెట్టుబడులను కలిగిన వాటిని మధ్యతరహా పరిశ్రమలుగా గుర్తింపు. వీటి టర్నోవర్‌ను రెట్టింపు చేసి రూ.500 కోట్లకు పెంచింది. ఇటీవలి కేంద్ర బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక శాఖ నిర్మలా సీతారామన్ ఎంఎస్‌ఎంఇల పెట్టుబడులు, టర్నోవర్‌ల పరిమితుల్లో మార్పులు తెస్తున్నామని చెప్పారు. పెట్టుబడుల పరిమితిని 2.5 రెట్లు, టర్నోవర్ రెట్టింపు చేయనున్నట్లు ప్రతిపాదిస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలోనే కేంద్రం ఎంఎస్‌ఎంఇలకు సంబంధించి నూతన విధానానికి ఆమోదం తెలిపింది.



సెన్సెక్స్ 1078 పాయింట్ల వృద్ధి

- ఆరో రోజూ మార్కెట్ల ఉరకలు

ముంబయి : దేశీయ స్టాక్ మార్కెట్లు కొనుగోళ్ల మద్దతుతో ఆరో రోజూ పరుగులు పెట్టాయి. సోమవారం సెషన్‌లో బ్యాంకింగ్ షేర్ల మద్దతుతో మార్కెట్లు భారీ లాభాలను ఆర్జించాయి. బిఎస్‌ఇ సెన్సెక్స్ 1078.87 పాయింట్లు లేదా 1.40 శాతం పెరిగి 77,984.38కి చేరింది. ఇంట్రాడేలో 1200 పాయింట్ల మేర లాభపడి 78,107 గరిష్ట స్థాయిని తాకింది. చాలా రోజుల తర్వాత 78 వేల పాయింట్ల మార్క్‌ను తాకడం విశేషం. ఎన్‌ఎస్‌ఇ నిఫ్టీ 307.95 పాయింట్లు లేదా 1.32 శాతం రాణించి 23,658.35 వద్ద ముగిసింది. ఎఫ్ఐఐల కొనుగోళ్లు, చాలా నెలలుగా పతనమైన షేర్లు తక్కువ ధర వద్ద ఆకర్షణీయంగా ఉండటంతో కొనుగోళ్లకు మద్దతు లభించింది. సెన్సెక్స్ 30లో 24 సూచీలు లాభాల్లో ముగిశాయి. బిఎస్‌ఇలోని లిస్టెడ్ కంపెనీల మార్కెట్ విలువ దాదాపు రూ.5 లక్షల కోట్ల మేర పెరిగి రూ.418 లక్షల కోట్లకు చేరింది. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు సైతం ఒక శాతం మేర పెరిగాయి. సెన్సెక్స్ 30 సూచీలో ఎన్‌టిపిసి, కోటక్ మహీంద్రా, ఎస్‌బిఐ, టెక్ మహీంద్రా, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ షేర్లు అధికంగా లాభపడిన వాటిలో టాప్‌లో ఉన్నాయి. మరోవైపు టైటాన్, ఇండస్ ఇండ్ బ్యాంక్, జొమాటో, మహీంద్రా అండ్ మహీంద్రా, భారతీ ఎయిర్‌టెల్ షేర్లు అధిక నష్టాలను చవి చూశాయి.



జిఎస్‌ఎంఎ బోర్డు నూతన చైర్మన్‌గా గోపాల్ విట్టల్



న్యూఢిల్లీ : జిఎస్‌ఎంఎ బోర్డు ఆఫ్ డైరెక్టర్ల నూతన చైర్మన్‌గా భారతీ ఎయిర్‌టెల్‌కు చెందిన వైస్ ఛైర్మన్, ఎండి గోపాల్ విట్టల్ నియమితు లయ్యారు. దీంతో ఆ పరిశ్రమ బాడీ అనుసరించాల్సిన అంతర్జాతీయ ఎత్తుగడలు, విధానాలకు సంబంధించిన నిర్ణయాలను విట్టల్ కీలకంగా వ్యవహరించనున్నారు. జిఎస్‌ఎంఎ బోర్డు చైర్మన్ బాధ్యతలు తీసుకున్న భారతీయుల్లో సునీల్ భారతీ మిట్టల్ తర్వాత రెండవ వ్యక్తిగా గోపాల్ విట్టల్ నిలిచారు. ప్రపంచంలోని టెలికం కంపెనీలకు చెందిన ఉత్పత్తులు, సాఫ్ట్‌వేర్ కంపెనీలు, ఇంటర్నెట్ కంపెనీలు తదితర వాటికి చెందిన 1.000కి పైగా కంపెనీలు జిఎస్‌ఎంఎ బాడీలో భాగస్వామ్యం కలిగి ఉన్నాయి.

బీమాపై 5 శాతం జిఎస్‌టి..!



న్యూఢిల్లీ : ఆరోగ్య, జీవిత బీమా పాలసీలపై భారంగా ఉన్న 18 శాతం జిఎస్‌టిని తగ్గించే అవకాశం ఉందని తెలుస్తోంది. బీమాపై అధిక పన్ను రేటు ఈ రంగానికి ప్రతికూలంగా ఉండటంతో పాటుగా పాలసీదారులపై తీవ్ర భారం పడుతోంది. దీన్ని తగ్గించాలని ఎప్పటి నుంచో డిమాండ్ ఉంది. దీనిపై ఎట్టకేలకు అడుగు ముందుకు పడుతోన్నట్లు సమాచారం. త్వరలో జరగబోయే జిఎస్‌టి కౌన్సిల్ సమావేశంలో బీమాపై జిఎస్‌టిని 5 శాతానికి తగ్గించనున్నట్లు సంబంధిత వర్గాల సమాచారం. జీవిత, ఆరోగ్య బీమా ప్రీమియంలను జిఎస్‌టి నుంచి పూర్తిగా మినహాయించడానికి తాము అనుకూలంగా లేమని.. అయితే పన్ను రేట్లు తగ్గించాలని భావిస్తున్నామని జిఎస్‌టి కౌన్సిల్ మంత్రుల బృందంలోని ఓ సభ్యుడు పేర్కొన్నారు. మెజారిటీ సభ్యులు దీనికి అనుకూలంగా ఉన్నారన్నారు. మరోవైపు బీమా సంస్థలు సైతం జిఎస్‌టి పూర్తి రద్దును వ్యతిరేకిస్తున్నాయని.. ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌ను పొందడానికి అవకాశం లేకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేస్తోన్నాయి. ఏప్రిల్ నెలాఖరులో గానీ, మే నెలలో గానీ జరగనున్న తదుపరి జిఎస్‌టి కౌన్సిల్ భేటీలో బీమాపై పన్ను రేట్ల తగ్గింపునపై స్పష్టత రానుందని సమాచారం.

సామ్‌సంగ్ ఉత్పత్తులపై 48 శాతం వరకు తగ్గింపు

న్యూఢిల్లీ : సామ్‌సంగ్ బెస్పోక్ ఎఐ డిజిటల్ ఉపకరణాలపై ప్రత్యేక పండుగ ఆఫర్లను అందిస్తున్నట్లు ఆ కంపెనీ తెలిపింది. ఇందులో భాగంగా 48 శాతం వరకు తగ్గింపు, రూ.20,000 వరకు క్యాష్‌బ్యాక్, జీరో డౌన్ పేమెంట్‌తో వినియోగదారులు వారి ఇళ్లను ఆధునిక టెక్నాలజీ ఉత్పత్తులతో అప్‌గ్రేడ్ చేసుకోవడానికి వీలుకల్పిస్తోన్నట్లు పేర్కొంది. ఎఐ ఆధారిత రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మిషన్లు, ఎసి, మైక్రోవేవ్ ఉత్పత్తులపై మార్చి 31 వరకు ఈ ఆఫర్లు అందుబాటులో ఉంటాయని వెల్లడించింది.

అమెజాన్‌లో పలు ఉత్పత్తులపై సెల్లర్ ఫీజు రద్దు

న్యూఢిల్లీ : దిగ్గజ ఇ-కామర్స్ సంస్థ అమెజాన్ ఇండియా తన వేదికపై విక్రయించే 135 కేటగిరీలకు చెందిన రూ.300 కంటే తక్కువ విలువ కలిగిన 1.2 కోట్ల ఉత్పత్తులకు సెల్లర్ ఫీజును (రిఫరల్ ఫీజు) రద్దు చేసింది. ఏప్రిల్ 7 నుంచి ఇది అమల్లోకి రానుందని ఆ సంస్థ సోమవారం వెల్లడించింది. వీటిపై ఇప్పటి వరకు కేటగిరీని బట్టి 2 శాతం నుంచి 16 శాతం వరకు ఫీజు వసూలు చేసింది.

'ఎలక్ట్రానిక్స్ ప్రీమియర్ లీగ్' ఆఫర్లు..

మార్చి 21 నుంచి 26 వరకు 'ఎలక్ట్రానిక్స్ ప్రీమియర్ లీగ్' పేరుతో పలు ఉత్పత్తులపై ఆఫర్లను అందిస్తున్నట్లు అమెజాన్ తెలిపింది. పలు ఎలక్ట్రానిక్స్ కంపెనీల ఉత్పత్తులపై 75 శాతం వరకు ఆదా, పలు బ్యాంక్ కార్డులపై 7.5 శాతం వరకు క్యాష్‌బ్యాక్, సేవింగ్స్‌ను పొందవచ్చని ఆ కంపెనీ ప్రతినిధి జెబా ఖాన్ తెలిపారు.

కేర్ హెల్త్ ఇన్సూరెన్స్‌కు రూ.105 కోట్ల డిమాండ్ నోటీసులు

న్యూఢిల్లీ : రెలిగేర్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ (ఆర్ఇఎల్) అనుబంధ సంస్థ అయిన కేర్ హెల్త్ ఇన్సూరెన్స్‌కు ఆదాయపు పన్ను శాఖ రూ.104.77 కోట్ల డిమాండ్ నోటీసులు అందించింది. 2020-21, 2021-22 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించి ఈ నోటీసులు అందుకున్నట్లు సోమవారం ఆ కంపెనీ వెల్లడించింది. ముంబయిలోని సెంట్రల్ సర్కిల్ 6(2)లోని ఆదాయపు పన్ను అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయం ఈ నోటీసులను జారీ చేసిందని ఆర్ఇఎల్ రెగ్యులేటరీ ఫైలింగ్‌లో పేర్కొంది.

సంపాదకీయం

డీలిమిటేషన్ పోరు

జనాభా ప్రాతిపదికన పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్)ను వ్యతిరేకిస్తూ వివిధ రాజకీయ పార్టీలతో జాయింట్ యాక్షన్ కమిటీ (జెఎసి) ఏర్పాటు మోడీ ప్రభుత్వ కుట్ర పూరిత చర్యకు తిరుగులేని హెచ్చరిక. జనాభా ప్రాతిపదికన 2026లో డీలిమిటేషన్ ప్రక్రియ ప్రారంభమవుతుందని కేంద్రం ఎప్పుడైతే వెల్లడించిందో ఆ క్షణం నుంచి రాజకీయంగా కలకలం లేచింది. నియంత్రణా చర్యలతో జనాభాను అదుపు చేసిన దక్షిణాది రాష్ట్రాల్లో ఆందోళన మరింత ఎక్కువైంది. సరిగ్గా ఈ సమయంలోనే దక్షిణాది రాష్ట్రాల్లో పార్లమెంట్ సీట్లు తగ్గబోవంటూ హోం మంత్రి అమిత్‌షా వంటి వారి వివాదాస్పద వ్యాఖ్యలతో అగ్నికి ఆజ్యం పోసినట్లయింది. కేంద్ర ఈ గందరగోళ అస్పష్ట వ్యవహారం నేపథ్యంలో తమిళనాడు ముఖ్యమంత్రి, డిఎంకె చీఫ్ స్టాలిన్ దక్షిణాది రాష్ట్రాలతో పాటు డీలిమిటేషన్ వల్ల సీట్ల కోత కత్తి వేలాడుతున్న పంజాబ్, ఒడిశా, పశ్చిమబెంగాల్ తదితర రాష్ట్రాల్లోని ప్రధాన రాజకీయపార్టీలతో శనివారం చెన్నయ్‌లో నిర్వహించిన తొలి సమావేశం జయప్రదమైంది. కేరళ, పంజాబ్, తెలంగాణ సిఎంలతోపాటు కర్ణాటక డిప్యూటీ సిఎం, బిఆర్‌ఎస్ సహా ఆరు రాష్ట్రాలకు చెందిన 14 పార్టీలు పాల్గొనడమే కాకుండా జెఎసిగా ఏర్పడటం భవిష్యత్ కార్యాచరణపై పలు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించడం మంచి పరిణామం.

డీలిమిటేషన్‌పై కేంద్ర ప్రభుత్వం పారదర్శకతకు పాతరేసిందని అది చేస్తున్న విన్యాసాలే తెలుపుతాయి. దేశ వ్యాప్తంగా సీట్లు పెరగుతాయంటున్న మోడీ సర్కారు అందుకు ప్రాతిపదికేంటో ఇదమిత్థంగా పేర్కొనలేదు. రాష్ట్రాల్లో ఇప్పుడున్న సీట్ల నిష్పత్తితోనే పెరుగుతాయా లేదంటే జనాభా ప్రాతిపదికనా అనే విషయంలో మబ్బులో పెట్టి మాట్లాడుతోంది. ఒక వేళ జనాభానే కొలబద్ద అయితే జాతి హితం కోసం జనాభాను నియంత్రించిన రాష్ట్రాల్లో సీట్లు తగ్గుతాయి. పార్లమెంట్‌లో వాటి ప్రాతినిధ్యం కుదించుకుపోతుంది. ఈ చర్య అన్యాయంగా ఆయా రాష్ట్రాలను శిక్షించడమే అవుతుంది. పర్యవసానంగా కేంద్రం నుంచి నిధులు తగ్గుతాయి. సంప్రదాయం, గుర్తింపు, అభివృద్ధి, రాజకీయశక్తి క్షీణిస్తుంది. రాష్ట్రాల మధ్య అసమానతలు పెరుగుతాయి. సామాజిక న్యాయం, మహిళా సాధికారత దెబ్బతింటుంది. 1971 తర్వాత దక్షిణాది సహా మరికొన్ని రాష్ట్రాలు జనాభాను నియంత్రించాయి. ఎమర్జెన్సీ సమయం 1976లో, వాజ్‌పేయి హయాం 2001లో చేసిన రాజ్యాంగ సవరణలు సీట్ల సంఖ్యను ఫ్రీజ్ చేశాయి. ఇప్పుడు జనాభా ప్రాతిపదిన డీలిమిటేషన్ అంటే జనాభా నియంత్రణ లక్ష్యాలను చేరుకోని ఉత్తరప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో సీట్లు పెరుగుతాయి. జనాభా లెక్కల సేకరణ ప్రక్రియ నిజానికి 2021కే పూర్తి అయి ఉండాలి. కాని ఆ లెక్కలు వెల్లడించే కఠోర వాస్తవాలను స్వీకరించే దమ్ము లేని బిజెపి ఏకంగా జనగణననే నిరవధికంగా వాయిదా వేస్తోంది. మరోపక్క డీలిమిటేషన్ వివాదాన్ని ముందుకు తెచ్చి 'జనాభా ప్రాతిపదిక' అంటోంది. ఇది ఆ పార్టీ నయవంచనను వెల్లడిస్తోంది. ఉత్తరాదిలో బిజెపి ప్రభావం ఎక్కువ. ఉత్తరాదిలో, బిజెపి పాలిత రాష్ట్రాల్లో సీట్లు పెంచుకొని రాజకీయంగా లబ్ధి పొందే కుట్రకు బిజెపి తెరతీసిందని అనుమానం వస్తుంది. ఈ తరుణంలో మరో పాతికేళ్లపాటు డీలిమిటేషన్ వద్దన్న విపక్ష పార్టీల జెఎసి డిమాండ్ న్యాయసమ్మతమైంది.

డిఎంకె నిర్వహించిన సమావేశానికి దక్షిణాది రాష్ట్రాల నుంచి దాదాపు అన్ని ప్రధాన రాజకీయ పార్టీలూ హాజరుకాగా ఆంధ్రప్రదేశ్ నుంచి ఎవ్వరూ వెళ్లలేదు. అధికార కూటమి పార్టీలు డీలిమిటేషన్ పర్యవసానాలపై నోరు మెదపకపోవడం రాష్ట్రానికి హానికరం. టిడిపి, జనసేన పార్టీలు బిజెపి కుట్రలో భాగస్వాములైతే రాష్ట్ర ప్రయోజనాలకు నష్టం చేసినవారవుతారని గ్రహించాలి. వైసిపి స్టాలిన్ నిర్వహించిన సమావేశానికి వెళ్లకుండా ప్రధానికి లేఖ రాసింది. దక్షిణాది రాష్ట్రాల వాటా తగ్గకూడదంటూనే మోడీ నేతృత్వం పట్ల తన విధేయతను జగన్ చాటుకోవడం ఆ పార్టీ అవకాశవాద వైఖరికి నిదర్శనం. ఇక తెలుగు ప్రజల కోసమే పుట్టానని చెప్పే టిడిపి మౌనం వహించడం తెలుగు ప్రజలను వంచించడమే. ఇప్పుడైనా మౌనం వీడి అసంబద్ధ, అన్యాయమైన డీలిమిటేషన్‌కు వ్యతిరేకంగా టిడిపి, జనసేన తమ వైఖరిని ప్రకటించాలి. రాష్ట్ర ప్రజలకు జవాబు చెప్పవలసిన బాధ్యత నుంచి ఈ పార్టీలు తప్పించుకోలేవు.

మహనీయుల మాట



కార్మికవర్గ పోరాటం
వారి విముక్తి కోసమే కాదు.
అణచివేత నుంచి, దోపిడీ నుంచి
మొత్తంగా
మానవాళి విముక్తి కోసం
అది పోరాడుతుంది.
- హోచిమిన్,
వియత్నాం విప్లవ సారథి.



అంతర్జాతీయం

సుంకాల యుద్ధం - బలహీన పడుతున్న అమెరికా ఆధిపత్యం



సాత్యకి రాయ్



ప్రపంచం మీద పెత్తనం చెలాయిస్తున్న శక్తులు తమ ప్రచార దిశను మార్చుకున్నట్టుంది. నిన్నటిదాకా అంతర్జాతీయ వాణిజ్యం మీద ఏ దేశమూ ఎటువంటి ఆంక్షలూ విధించకూడదని, ఆంక్షలు లేని వాణిజ్యం భాగస్వాములందరికీ ప్రయోజనకరంగా ఉంటుందని చెప్పారు. ఇప్పుడు తమ తమ దేశాల ప్రయోజనాలను రక్షించుకోవడమే ప్రధానంగా మారినట్టు కనిపిస్తోంది. దానితోబాటు పాత కాలపు వలసాధిపత్య భావాలను కూడా మళ్ళీ ప్రకటిస్తున్నారు. ఈ ప్రపంచాన్ని శాసించే హక్కు తమకే ఉందన్నట్టు ప్రవర్తిస్తున్నారు. అమెరికా వివిధ దేశాలతో జరిపే వాణిజ్యంలో ఆ దేశాల నుండి దిగుమతి చేసుకునే సరుకులే ఎక్కువ. అమెరికా నుండి ఆ దేశాలకు జరిగే ఎగుమతులు తక్కువ. ఇప్పుడు ట్రంప్ అటువంటి దేశాల నుండి వచ్చే దిగుమతులపై అధిక సుంకాలను విధిస్తున్నాడు. ఈ చర్యల్లో ఆర్థిక హేతుబద్ధత కన్నా ప్రజలను ఆకట్టుకోవడమే ప్రధానంగా కనిపిస్తోంది. గతంలో అమెరికా చాలా ఉదారంగా ఇతర దేశాల ఎడల వ్యవహరించినట్టు, దానివలన ఆ దేశాలన్నీ ప్రయోజనాలు పొందినట్టు, ఇప్పుడు అమెరికా తన స్వంత దేశపు పరిశ్రమల రక్షణకు, తన స్వంత కార్మికుల ప్రయోజనాలకు అధిక ప్రాధాన్యతను ఇవ్వడానికి సుంకాల పెంపు తప్పదన్నట్టు ఈ నాటకం నడుస్తోంది.

పెట్టుబడి ఎప్పుడూ రంగులు మారుస్తూనే వుంటుంది. నయా ఉదారవాద శకం ప్రపంచం మీద తన విధానాలను రుద్దడానికి ఐఎంఎఫ్, ప్రపంచబ్యాంక్ వంటి సంస్థలను సాధనాలుగా వాడుకోవడంతో ఆవిష్కరించబడింది. ప్రపంచంలో ఎక్కడెక్కడ చౌకగా కార్మికుల శ్రమను కొల్లగొట్టవచ్చో, అక్కడికల్లా ప్రపంచ పెట్టుబడి తరలిపోయింది. ఎక్కడ సహజ వనరులు చౌకగా దొరుకుతాయో అక్కడ వాటిని చేజిక్కించుకుంది. ఒకదాని వెంట మరొకటిగా దేశాలు ఈ నయా ఉదారవాద పెత్తనానికి లొంగిపోయాయి. పోటీ ప్రపంచం అనే పేరుతో తమ తమ దేశాల ఆర్థిక వ్యవస్థల మీద తమకున్న నియంత్రణను విడిచిపెట్టి, తమ పాలనా విధానాలను తామే రూపొందించుకునే హక్కును సైతం గాలికొదిలేశాయి. దిగుమతుల మీద ఆంక్షలు ఎప్పుడైతే సడలించడం జరిగిందో అప్పుడు ఆ యా దేశాల్లోకి పెద్దపెట్టున సరుకులు వచ్చిపడడం మొదలైంది. దాని వలన దేశీయ పరిశ్రమలు దెబ్బ తిన్నాయి. ఈ విధానాలకు లోబడి వ్యవహరించడానికి నిరాకరించిన చైనా వ్యూహాత్మకంగా తన స్వంత శక్తి సామర్థ్యాలను పెంచుకోవడం మీద కేంద్రీకరించింది. ప్రపంచ మార్కెట్‌లో పోటీ పడగల సామర్థ్యాన్ని పెంచుకుంది.

చాలామంది ఆర్థిక వ్యాఖ్యాతలు చైనా బలమైన ఆర్థిక శక్తిగా ఎదిగిందన్న వాస్తవాన్ని గుర్తిస్తున్నారు కాని అలా ఎదగడానికి కారణం చైనా నయా ఉదారవాద విధానాల చట్రంలో ఇమిడేందుకు తిరస్కరించి తన స్వంత విధానాలను అమలు చేయడమేనన్న వాస్తవాన్ని మాత్రం గుర్తించరు. ప్రస్తుతం జి-7 దేశాలు నమోదు చేస్తున్న ఆర్థిక వృద్ధిరేటు కన్నా ఎక్కువ వృద్ధిరేటుతో ఉన్న దేశాలు బ్రిక్స్ కూటమిలో భాగస్వాములుగా ఉన్నాయి. అమెరికా అగ్ర స్థానం క్రమంగా చేజారుతోంది. అందుకే దిక్కు తోచని స్థితిలో పడి గతంలో తాను ప్రవేశపెట్టిన స్వేచ్ఛా వాణిజ్య సూత్రాలను ఇప్పుడు తానే ఉల్లంఘిస్తోంది. అంతర్జాతీయ పెట్టుబడి ప్రయోజనాల గురించి మాట్లాడుతూ వచ్చిన అమెరికా ఇప్పుడు 'జాతీయ ప్రయోజనాల' గురించి మాట్లాడుతోంది. ఎంత గొప్పగా జాతీయ ప్రయోజనాల గురించి మాట్లాడినా, అదనంగా విధించిన సుంకాల వలన అమెరికాకు దిగుమతి అయ్యే సరుకుల ధరలు పెరుగుతాయి. దానివలన అమెరికన్ పౌరులు ఎక్కువ సొమ్ము వెచ్చించాల్సి వస్తుంది. ఇంకో పక్క ఈ కొత్త సుంకాలపై అంతర్జాతీయ పెట్టుబడి ఏ విధంగా ప్రతిస్పందిస్తుందో, ఆ యా దేశాలు అమెరికాతో తమ వాణిజ్య సంబంధాలను ఏ విధంగా మార్చుకుంటారో చూడాలి. దీని పర్యవసానాలను అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ఏ విధంగా స్వీకరిస్తుందో అదీ చూడాలి. వాణిజ్య సంబంధాలలో పెరుగుతున్న అనిశ్చిత పరిస్థితులు ప్రపంచ వ్యాప్తంగా విస్తరించిన ఉత్పత్తి, సరఫరా చెయిన్లను ఏ విధంగా దెబ్బ తీస్తాయో అది కూడా పరిశీలించాలి. ప్రస్తుతం అమెరికా, భారత్‌ల మధ్య జరుగుతున్న వాణిజ్య చర్చలు రానున్న కాలంలో ఇరు దేశాల వాణిజ్య సంబంధాలపై ఏ విధమైన ప్రభావాన్ని చూపుతాయో చూడాలి.

> చాలామంది ఆర్థిక వ్యాఖ్యాతలు చైనా బలమైన ఆర్థిక శక్తిగా ఎదిగిందన్న వాస్తవాన్ని గుర్తిస్తున్నారు కాని అలా ఎదగడానికి కారణం చైనా నయా ఉదారవాద విధానాల చట్రంలో ఇమిడేందుకు తిరస్కరించి తన స్వంత విధానాలను అమలు చేయడమేనన్న వాస్తవాన్ని మాత్రం గుర్తించరు.

> ఇప్పుడు కార్మికవర్గం ప్రపంచవ్యాప్తంగా ఎక్కడ చూసినా కార్పొరేట్ల దోపిడీకి బలైపోవడమే కనిపిస్తోంది. ఆ కార్పొరేట్లు స్వదేశీయులా, లేక బహుళజాతి సంస్థలా అన్నదానితో నిమిత్తం లేదు. అయితే ప్రభుత్వాలు మాత్రం 'జాతీయ ప్రయోజనాలు' అన్న ముసుగులో ఈ కార్పొరేట్ల దోపిడీని ప్రజలు గమనించకుండా దాచిపెడుతున్నాయి.

> నిస్సహాయులమై పోయామని భావిస్తున్న అమెరికన్ పౌరులకు ట్రంప్ ప్రకటించిన రక్షణాత్మక విధానాలు ఒకింత ఆశను కల్పించాయి. ఆ ఆశను నిలబెట్టుకోడానికే ట్రంప్ ఇప్పుడు తాను అమెరికన్ పరిశ్రమలను, అమెరికన్ కార్మికుల ఉద్యోగాలను కాపాడేందుకు పాటు పడుతున్నట్టు నమ్మించడానికి ప్రయత్నిస్తున్నాడు.

ప్రతీకార సుంకాలు

భారతదేశానికి, అమెరికాకు నడుమ 125 బిలియన్ల డాలర్ల (12,500 కోట్ల డాలర్లు లేదా రూ.10, 79,500 కోట్లు) వాణిజ్యం సాగుతోంది. అమెరికాకు భారతదేశం ఎగుమతి చేసే సరుకులపై విధించే సగటు సుంకం ఇప్పుడు 2.8 శాతం ఉంది. అదే అమెరికా భారతదేశానికి ఎగుమతి చేసే సరుకుల మీద సగటు సుంకం 7.7 శాతం ఉంది. ఇప్పుడు అమెరికా కూడా భారతదేశం నుండి ఎగుమతి అయ్యే సరుకుల మీద 7.7 శాతానికి సుంకాన్ని పెంచనుంది. దీని వలన వివిధ రంగాలలో వివిధ రకాలుగా ప్రభావం పడుతుంది. ట్రంప్ కోరుతున్నట్టు అమెరికా నుండి మనకు దిగుమతి చేసుకునే సరుకులపై మనం సుంకాన్ని గనుక తగ్గిస్తే అప్పుడు అక్కడి నుండి ఎక్కువగా దిగుమతి అయ్యే వ్యవసాయ ఉత్పత్తులు భారతీయ మార్కెట్ లో చౌకగా లభిస్తాయి. మన స్వదేశీ వ్యవసాయ ఉత్పత్తులకు రేట్లు ఇంకా తగ్గిపోతాయి. అదే మనదేశం నుండి ఎగుమతి అయే సరుకులపై అమెరికా ఎక్కువ సుంకాన్ని విధిస్తే ఇక్కడి నుండి మనం పంపే ఆటో విడి భాగాలు, మాంసం తదితర ప్రాసెస్డ్ ఆహార ఉత్పత్తులు, వజ్రాలు, బంగారు ఆభరణాలు, రసాయనాలు, ఔషధాలు వంటివి మరింత ఖరీదౌతాయి. అప్పుడు వాటికి అమెరికాలో డిమాండ్ తగ్గుతుంది. ఒక తాజా అధ్యయనం ప్రకారం మన దేశం నుండి ఎగుమతి చేసే ప్రాసెస్డ్ ఫుడ్ మీద సుంకం 32.37 శాతం పెరుగుతుంది. అదే విధంగా ఆటో విడి భాగాల మీద 23.10 శాతం, వజ్రాలు, ఆభరణాల మీద 13.32 శాతం, రసాయనాలు, ఔషధాల మీద 8.63 శాతం పెరుగుతుంది. ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ వస్తువుల మీద, లెదర్, పేపర్, గ్లాస్, ప్లాస్టిక్ వస్తువుల మీద, జౌళి, దుస్తుల మీద, యంత్రాల మీద, కంప్యూటర్ తయారీలో ఉపయోగించే ఖనిజాల మీద, వివిధ రకాల లోహాల మీద సుంకాలు పెరుగుతాయి.

సుంకాలు పెరిగితే మనం ఎగుమతి చేసే సరుకుల ధరలు పెరుగుతాయి. దాని ఫలితంగా మన ఎగుమతులు తగ్గవచ్చు. మరోపక్క అమెరికా తాను భారతదేశానికి ఎగుమతి చేసే వ్యవసాయోత్పత్తుల మీద విధిస్తున్న సుంకాన్ని తగ్గించాలని పట్టుబడుతోంది. ప్రస్తుతం ఇండియా నుండి అమెరికాకు ఎగుమతి అయే వ్యవసాయోత్పత్తుల మీద అక్కడ 5.3 శాతం సుంకం పడుతోంది. అదే అమెరికా నుండి ఇండియాకు వచ్చే వ్యవసాయోత్పత్తుల మీద 37.7 శాతం సుంకం విధిస్తున్నాం. ఇప్పుడు గనుక అమెరికా కోరిన విధంగా అక్కడి నుండి వచ్చే దిగుమతులమీద సుంకాన్ని 5.3 శాతానికి తగ్గిస్తే అది మన భారతీయ రైతుల పాలిట వినాశనకరంగా మారుతుంది. అమెరికా తన వ్యవసాయ రంగానికి భారీగా సబ్సిడీలు ఇస్తోంది. అక్కడి అగ్రో-ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలోని గుత్తాధిపతులు ఆ సబ్సిడీలను ఉపయోగించుకుని భారతీయ మార్కెట్లను తేలికగా ఆక్రమిస్తారు. దాని ఫలితంగా ఇక్కడ ఉన్న చిన్న చిన్న రైతులు, చిన్న ఉత్పత్తిదారులు చితికిపోతారు. ఇప్పటికే వినిమయ సరుకుల ఉత్పత్తి రంగంలో దిగుమతుల దాడి ఫలితంగా దేశీయ పరిశ్రమలు దారుణంగా దెబ్బ తినిపోయాయి. ఇకపైన రైతుల పరిస్థితీ అలాగే అవుతుంది. ఏ దేశానికి ఆ దేశం తన జాతీయ అవసరాల రీత్యా, ప్రత్యేకతల రీత్యా సుంకాలను విధిస్తుంది. దానికి భిన్నంగా అగ్రరాజ్యం ప్రయోజనాల కోసం సుంకాల విధానాన్ని మార్చితే దాని ప్రతికూల ప్రభావం దేశంలోని ప్రజల మీద తీవ్రంగా పడుతుంది.

అమెరికాలో సంక్షోభం

ప్రతీకార చర్యలుగా సుంకాలను విధించడం, అనుమతులు లేని కార్మికులను వెనక్కి పంపివేయడం, కెనడా, గ్రీన్‌లాండ్, పనామా, గాజా భూభాగాలను స్వాధీనం చేసుకుంటామని ప్రకటించడం, పరిశోధనల మీద ఖర్చులకు కోత పెట్టడం వంటి ట్రంప్ చర్యలకు మీడియా బాగా ప్రచారం ఇస్తోంది. ఇవన్నీ తాత్కాలిక స్వభావం కలిగిన చర్యలే. వీటి వెనుక అమెరికా ఎదుర్కొంటున్న సంక్షోభపు తీవ్రతను కప్పిపుచ్చుతున్నారు. అమెరికా ఆర్థిక వ్యవస్థ నిజానికి తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయి వుంది. రాబోయే రెండేళ్లలో దాని ఆర్థిక మందగమనం మరింత ఎక్కువ కానుంది. ఇప్పుడు మూడవ ప్రపంచ దేశాలతో జరుగుతున్న చర్చల పర్యవసానంగా అమెరికా వాణిజ్యం ఎంత మేరకు పుంజుకోగలదో వేచి చూడాలి. కాని ఇప్పుడు అమెరికన్ మార్కెట్‌లో నెలకొన్న మాంద్యం, దేశీయ వనరుల, పెట్టుబడుల వృద్ధి బాగా దెబ్బ తినడం చూస్తే అమెరికన్ పెత్తనానికి చివరి రోజులు దగ్గరపడ్డాయని అనిపిస్తుంది.

అమెరికాలో కార్మికవర్గం నిజ వేతనాలు బాగా దెబ్బ తినిపోవడం, మరోవైపు కార్పొరేట్లు సూపర్ లాభాలకు పడగలెత్తడం వల్లే డెమాక్రాట్లు ఎన్నికల్లో ఓడిపోయారు. నిజానికి వాళ్ళ దగ్గర రిపబ్లికన్లు ప్రతిపాదించిన మితవాద ఎజెండాకు ప్రత్యామ్నాయమైన ఎజెండా అంటూ ఏదీ లేదు. ఈ రెండు పార్టీల నడుమ ఉన్న విధానపరమైన తేడా దాదాపు శూన్యం. నిస్సహాయులమై పోయామని భావిస్తున్న అమెరికన్ పౌరులకు ట్రంప్ ప్రకటించిన రక్షణాత్మక విధానాలు ఒకింత ఆశను కల్పించాయి. ఆ ఆశను నిలబెట్టుకోడానికే ట్రంప్ ఇప్పుడు తాను అమెరికన్ పరిశ్రమలను, అమెరికన్ కార్మికుల ఉద్యోగాలను కాపాడేందుకు పాటు పడుతున్నట్టు నమ్మించడానికి ప్రయత్నిస్తున్నాడు.

రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో న్యూ డీల్ పేరిట కీన్సియన్ విధానాలు అమలైన కాలంలో అమెరికన్ కార్మికులు పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులు, సదుపాయాలు గత ఏభై ఏళ్ళ కాలంలో క్రమంగా కరిగిపోయాయి. గత రెండు దశాబ్దాల కాలంలో కార్మికుల నిజవేతనాలు బాగా పడిపోయాయి. కార్పొరేట్ల లాభాలు బాగా పెరిగాయి. ఇప్పుడు దిగుమతుల మీద అమెరికా విధిస్తున్న అదనపు సుంకాల వలన దేశీయంగా ఉత్పత్తి అయ్యే సరుకులకు డిమాండ్ కొంతమేరకు పెరిగి కొన్ని ఉద్యోగాలు కలగవచ్చు. కాని అదనపు సుంకాల వలన దిగుమతి అయే సరుకుల ధరలు పెరుగుతాయి. దాని భారం మళ్ళీ కార్మిక వర్గం మీదనే పడుతుంది. అప్పుడు వారి జీతాలను గనుక పెంచితే అమెరికన్ ఉత్పత్తుల ధరలు పెరిగి వాటి డిమాండ్ తగ్గుతుంది. దాని వలన ఉపాధి అవకాశాలు తగ్గిపోతాయి. ఒకవేళ జీతాలను పెంచకపోతే కార్మికవర్గం సంక్షోభ భారాన్ని నేరుగా మోయవలసి వస్తుంది. ఏది జరిగినా దెబ్బ తినిపోయేది కార్మికవర్గమే.

ఇప్పుడు కార్మికవర్గం ప్రపంచవ్యాప్తంగా ఎక్కడ చూసినా కార్పొరేట్ల దోపిడీకి బలైపోవడమే కనిపిస్తోంది. ఆ కార్పొరేట్లు స్వదేశీయులా, లేక బహుళజాతి సంస్థలా అన్నదానితో నిమిత్తం లేదు. అయితే ప్రభుత్వాలు మాత్రం 'జాతీయ ప్రయోజనాలు' అన్న ముసుగులో ఈ కార్పొరేట్ల దోపిడీని ప్రజలు గమనించకుండా దాచిపెడుతున్నాయి.

(స్వేచ్ఛానుసరణ)

వ్యాఖ్య

పడిపోయిన పంట ధరలు.. నిద్ర లేవని ప్రభుత్వాలు..

వి.కృష్ణయ్య



రాష్ట్రంలో ఏ ప్రాంతంలోకి వెళ్లినా పంటల సాగు ఖర్చు పెరిగిపోవడం, దిగుబడి తగ్గడం, మార్కెట్‌లో ధర లేకపోవడం, రైతుల దివాళాలు సర్వసాధారణం అయ్యాయి.

అన్నింటికన్నా ముందు మార్కెట్లోకి వచ్చింది పత్తి. ఈ సంవత్సరం అకాల వర్షాలకు నల్లి తెగులు వచ్చి ఎకరానికి సరాసరిన 5 క్వింటాళ్ళకు మించి రాలేదు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది క్వింటాలుకు రూ.7521. కానీ ఖర్చు మాత్రం రూ.9400 అయ్యిందని పత్తి ఉత్పత్తిదారుల అసోసియేషన్ ప్రకటించింది. కానీ బయట వ్యాపారస్తులు కొంటున్న ధర రూ.5000 నుండి రూ.6500 వరకు ఉంటుంది. దీనికి అధికారులను కారణం అడిగితే పొడుగు పింజ పత్తి విదేశాలలో మనకన్నా తక్కువ రేటుకు దొరుకుతున్నదని, ప్రైవేట్ వ్యాపారస్తుల ద్వారా లక్ష బేళ్ల పత్తి తక్కువ రేటుకు దిగుమతి అయ్యిందని చెప్తున్నారు. దీనివలన పత్తి రైతులకు కాటన్ కార్పొరేషన్ ఉన్నా ప్రయోజనం లేకుండా పోయింది. బడా వ్యాపారస్థులదే రాజ్యం అయిపోయింది. కాటన్ కార్పొరేషన్ కొనుగోలు కేంద్రాలను యార్డుల నుండి ప్రైవేట్ జిన్నింగ్ మిల్లులకు మార్చడం వలన రైతుల పరిస్థితి పెనం మీద నుండి పొయ్యిలో పడ్డట్లయ్యింది. ఇప్పుడు కాటన్ దిగుబడి బ్రెజిల్‌తో పోల్చితే మన దేశంలో నాల్గవ వంతు మాత్రమే ఉందని, దానిని పెంచడానికి కొత్త బడ్జెట్‌లో 'కాటన్ మిషన్' అని ఒక కొత్త ప్రయోగాన్ని కేంద్ర ప్రభుత్వం చేయబోతున్నట్లుగా ప్రకటించింది. పత్తి రైతులకు రక్షణగా ఉండే విధంగా ఈ మిషన్‌ని నడిపితేనే రైతులకు ఉపయోగపడుతుంది. లేదంటే నిరుపయోగమవుతుంది. రోజురోజుకు పత్తి వ్యాపారస్థులు కోటీశ్వరులు అవుతున్నారు. పత్తి రైతులు ఆత్మహత్యల వైపు నెట్టబడుతున్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కొనే బాధ్యతను వదిలివేస్తే జరిగే పరిణామాలు ఇవే.

మిర్చికి నల్లి తెగులు వచ్చి ఎకరాకు సరాసరిన 5 క్వింటాలకు మించి దిగుబడి రాలేదు. గత సంవత్సరం సరాసరిన రూ.20 వేలు ఉన్న రేటు ఈ సంవత్సరం కూడా వస్తుందని రైతులు ఆశపడ్డారు. కానీ రూ.8 వేల నుండి రూ. 12 వేల మధ్యనే మార్కెట్ ఉన్నందున రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మార్కెట్‌కు వచ్చిన రైతులు క్వింటాలుకు రూ.11,781 కన్నా తక్కువకు అమ్ముకుంటే...ఆ తగ్గిన మొత్తాన్ని వారికి చెల్లిస్తామని ఒక పథకాన్ని ప్రవేశపెట్టారు. ఈ లోపుగా రూ.12,000కు దగ్గరగా ధరలు పెరిగాయి. రాష్ట్ర ప్రభుత్వం గొప్ప పథకం అని ప్రవేశపెట్టినా అది పనికిరాదని తేలిపోయింది. ఆశతో ఉన్న మిర్చి రైతులు నిరాశకు గురయ్యారు. ఇప్పటికైనా రైతులు ఎదురు చూస్తున్న విధంగా క్వింటాకు రూ. 20 వేలు ప్రభుత్వాలు చెల్లిస్తేనే వారికి న్యాయం చేసినట్లు.

ధరలు తగ్గిపోయి ఏమి చేయాలో తెలియని శనగ రైతులు కోల్డ్ స్టోరేజ్‌లకు చేర్చారు. కందులు, మినుములు, పెసలు గత సంవత్సరంతో పోల్చితే తక్కువ రేట్లే ఉన్నాయి. ఈ పంటలకు కూడా ధరల స్థిరీకరణ నుండి రాష్ట్ర ప్రభుత్వం సహాయం చేయాలి.

ఇప్పుడు వచ్చిన నల్ల బెర్లి పొగాకును ఇంతవరకు ఏ వ్యాపారస్తులూ అడగడం లేదు. వ్యాపారులు కొంటారో, కొనరో అని రైతులు ఆందోళనగా ఉన్నారు. గత సంవత్సరం లాగా ధర బాగా ఉంటుందని ఆశపడిన పేద, కౌలు రైతులు ఎక్కువ ధరకు పొలాలు కౌలుకు తీసుకుని పొగాకు వేశారు. ఇప్పుడు ఈ పరిస్థితిని చూచి కౌలు రైతులు ఆందోళన పడుతున్నారు.

కోకో రైతుల పరిస్థితి విచిత్రంగా ఉంది. మన రాష్ట్రంలో 10 వేల మంది రైతులు 50 వేల ఎకరాలలో కొబ్బరిలో అంతర పంటగా దీనిని వేశారు. గత సంవత్సరంలో కేజి 1000 రూపాయల నుంచి రూ.1050గా ఉన్న కోకో నేడు రూ.200 నుంచి రూ.300 మధ్యలో దోబూచులాడుతోంది. కాడ్‌బరీ, ఇతర కార్పొరేట్ కంపెనీలు కుమ్మక్కై సరైన ధరలు రాకుండా చేస్తున్నారని రైతులు వాపోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత తీసుకుని పొగాకు లాగా ఓపెన్ ప్లాట్‌ఫారాలను ఏర్పాటు చేయడం, కనీస మద్దతు ధరను ప్రకటించడం, అవకాశం ఉన్నప్పుడు అంతర్జాతీయ మార్కెట్ ధర వచ్చేట్లుగా చేయాలని రైతులు కోరుతున్నారు.


విశాఖ డెయిరీ ఆధారంగా జరుగుతున్న పాల రైతుల పోరాటం చూస్తున్నాం. రాష్ట్రమంతా 40 లక్షల కుటుంబాలు సంవత్సరానికి లక్ష కోట్లకు పైగా విలువైన పాలను ఉత్పత్తి చేస్తున్నారు. దాణా ధర, ఇతర ఖర్చులు పెరిగిపోయి పాడి రైతులకు గిట్టుబాటు కాకుండా పోయింది. దానికి తోడు ప్రభుత్వ బాధ్యతా రాహిత్యం కారణంగా ప్రైవేట్ వ్యాపారస్తులు లాభపడుతున్నారు. గత ప్రభుత్వం ప్రకటించిన లీటరుకు 5 రూపాయలు బోనస్, దాణా సగం రేటుకే సబ్సిడీని ఈ ప్రభుత్వమైనా ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. వాటి గురించి టిడిపి కూటమి ప్రభుత్వం చప్పుడు చేయడం లేదు.

మన రాష్ట్రంలో 5 లక్షల ఎకరాలలో మామిడి తోటలు పూత రాలిపోయి రైతులు ఆందోళనలో ఉన్నారు. జీడి మామిడి రేటు పూర్తిగా ప్రైవేట్ వ్యాపారస్తులపరం అయిపోయింది. టొమాటో, ఉల్లి ధరల గురించి మాట్లాడకపోవడమే మంచిది. ఎప్పుడు ఏది ఆకాశానికి ఎగురుతుందో, పాతాళానికి పడిపోతుందో తెలియడం లేదు. కొబ్బరి, కాఫీ, మినుములు, పెసలు, చెరకు, పసుపు లాంటి పంటల ధరలకు దిక్కే లేదు.

ఫ్రూట్స్ బాస్కెట్‌గా ప్రకటించిన రాయలసీమ గత ప్రభుత్వంతో పోల్చితే కొద్దిగా మెరుగైనప్పటికీ మార్కెట్ సౌకర్యాలుగానీ, ఎగుమతి సౌకర్యాలు గానీ కొత్త వంగడాలను పరిచయం చేయడంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి.

ప్రధాన పంట వరి ధాన్యం బస్తాకు రూ. 300 నుంచి రూ. 500 వరకు మద్దతు ధర కన్నా తక్కువ రేటుకు రైతులు తెగనమ్ముకుంటున్నారు. నేడు నెల్లూరు జిల్లాలో అదే చూస్తున్నాము. ఈ పంటల ధరలు దిగజారడానికి గల కారణాన్ని పరిశీలిస్తే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు రైతుల పట్ల ఉన్న చిన్న చూపు స్పష్టమవుతుంది. ఈ సమస్యలను అధిగమించడానికి ప్రభుత్వాలు సమన్వయంతో సహకారంతో చిన్న పేద రైతులు నిల్వ చేసుకోవడానికి సరైన గోడౌన్లు, పంటల స్థిరీకరణ నిధి అందుబాటులో ఉండేట్లుగా చర్యలు తీసుకోవాలి.

> కేంద్ర ప్రభుత్వం గత బడ్జెట్లో స్థిరీకరణ నిధికి సున్నా చుట్టింది. ఇక మిగిలింది ప్రైవేట్ వ్యాపారస్తుల దయాదాక్షిణ్యాలు మాత్రమే. ఇలాంటి స్థితిలో కేరళ లాగా కనీస మద్దతు ధరల చట్టం, రుణ మాఫీ చట్టం రావలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ఢిల్లీ చుట్టుపక్కల కనీస మద్దతు ధర కోసం జరుగుతున్న పోరాటాన్ని నీరుగారుస్తున్నారు. సంవత్సరానికి 2 నుండి 3 లక్షల కోట్లతో కేంద్రం కనీస మద్దతు ధరల చట్టం అమలు పరిస్తే వ్యవసాయంలో ఉన్న 60 కోట్ల మందికి రక్షణ కల్పించినట్లు అవుతుంది.



కేంద్ర ప్రభుత్వం గత బడ్జెట్లో స్థిరీకరణ నిధికి సున్నా చుట్టింది. ఇక మిగిలింది ప్రైవేట్ వ్యాపారస్తుల దయాదాక్షిణ్యాలు మాత్రమే. ఇలాంటి స్థితిలో కేరళ లాగా కనీస మద్దతు ధరల చట్టం, రుణ మాఫీ చట్టం రావలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ఢిల్లీ చుట్టుపక్కల కనీస మద్దతు ధర కోసం జరుగుతున్న పోరాటాన్ని నీరుగారుస్తున్నారు. సంవత్సరానికి 2 నుండి 3 లక్షల కోట్లతో కేంద్రం కనీస మద్దతు ధరల చట్టం అమలు పరిస్తే వ్యవసాయంలో ఉన్న 60 కోట్ల మందికి రక్షణ కల్పించినట్లు అవుతుంది. చైనా, జపాన్‌లో లాగా పంటల కొనుగోలు విషయంలో కేంద్ర ప్రభుత్వం బాధ్యత తీసుకోవడం వలన ఈ ధరల సంక్షోభాల నుండి వ్యవసాయాన్ని బయట పడవేయగలుగుతుంది. దేశాన్ని కాపాడగలుగుతుంది.

/ వ్యాసకర్త రైతుసంఘం అధ్యక్షులు /

ప్రజా సంఘాల నేతల అక్రమ అరెస్టు

- ఇళ్ల స్థలాల కోసం ఐదు రోజులుగా పేదల ఆందోళన

విజయవాడ రూరల్ : ఇళ్ల స్థలాల కోసం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన ఆందోళన చేస్తున్న ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడ రూరల్ మండలం పి.నైనవరం గ్రామంలో పోలీసుల తీరు కారణంగా ఉద్రిక్తత నెలకొంది. తమకు స్థానిక కుక్కలవాని కుంటలోనే ఇళ్ల స్థలాలివ్వాలని ఐదు రోజులుగా వందలాది నిరుపేద మహిళలు సంఘం అండతో శాంతియుతంగా ఆందోళన చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులకు తమ సమస్యను మరోసారి విన్నవించడానికి సిద్ధమవుతున్న తరుణంలో సోమవారం ఆకస్మికంగా ఇళ్ల స్థలాల పోరాట కమిటీ నాయకులు మాతంగి ఆంజనేయులును పోలీసులు అదుపులోకి తీసుకుని విజయవాడ వన్‌టౌన్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. విషయం తెలిసి కలెక్టర్ లక్ష్మీశాను కలవడానికి ఆందోళన కమిటీ వారంతా సన్నద్ధమవుతున్న సమయంలో నాయకులు సట్టు శ్రీనివాసరావు, సురేష్‌లను అక్రమంగా అరెస్టు చేసి వారిని కూడా వన్‌టౌన్ స్టేషన్‌కు తరలించారు. సుమారు మరో పదిమందిపై కూడా వివిధ సెక్షన్ల కింద ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు. 'సమస్యల పరిష్కార వేదిక'లో పెద్ద సంఖ్యలో ఆందోళనకారులు.. ప్రధానంగా మహిళలు కలెక్టర్‌ను కలిసి ఇళ్ల సమస్యను, అక్రమ అరెస్టులను వివరించారు. దీంతో అరెస్టు చేసిన ముగ్గురినీ సాయంత్రం విడుదల చేశారు.

Paper Publication
[Substituted Service]
FORM NO.14
{See Regulation 33(2)}

OFFICE OF THE RECOVERY OFFICER-I
DEBTS RECOVERY TRIBUNAL
(Department of Financial Services, Ministry of Finance, Government of India)
31-31-21, Narayana Bhavanam,
Sai Baba Street, Dabagardens, Visakhapatnam-530020.

DEMAND NOTICE
(NOTICE UNDER SECTIONS 25 TO 28 OF THE RECOVERY OF DEBTS & BANKRUPTCY ACT, 1993 AND RULE 2 OF SECOND SCHEDULE TO THE INCOME TAX ACT, 1961)

RC/469/2017 **13.03.2025**
Indian Overseas Bank, Krishna Nagar Branch, Vijayawada, Krishna District.
Versus
M/s Saibaba Industries & another

To,
(CD-1) M/s Saibaba Industries, Rep. by its Prop. Smt. Durga Raj Kalpana, Plot No. 13, Block No. C-01, New Auto Nagar, Kanuru, Vijayawada, Krishna District - 520007.
(CD-2) Smt. Durga Raj Kalpana, W/o Sri. Vemana Ravi, D No. 14-265/4, Plot No. 10, SF-1, Mahadevapuram Colony, Vijayawada, Krishna District - 520007.

1. This is to notify that as per the Recovery Certificate issued in pursuance of orders passed by the Presiding Officer, Debts Recovery Tribunal Vishakhapatnam in **OA/259/2014** an amount of **Rs. 24,67,532.41 Ps (Rupees twenty four lakhs sixty seven thousand five hundred thirty two and forty one paisa only)** (i.e. Rs. 15,91,040.50 Ps with interest @ 12.75% p.a in Term Loan account and Rs. 8,76,491.89 Ps with interest @ 12.50% p.a in CC Account) along with pendentellite and future interest compounded with monthly rests from the date of application i.e. 19.05.2014 till realization / date of payment and the costs become due against you (Jointly and severally/ Fully/Limited).
2. You are hereby directed to pay the above sum within 15 days of the receipts of the notice, failing which the recovery shall be made in accordance with the Recovery of Debts Due to Banks and Financial Institutions Act, 1993 and Rules there under.
3. You are hereby ordered to declare on an affidavit the particulars of yours assets on or before the next date of hearing.
4. You are hereby ordered to appear before the undersigned on **28.04.2025** at **10:30 a.m**. for further proceedings.
5. In addition to the sum aforesaid you will be liable to pay :
 (a) such interest as is payable for the period commencing immediately after this notice of the execution proceedings;
 (b) all costs, charges and expenses incurred in respect of the service of this notice and other process that may be taken place for recovering the certificate amount.
6. Attention is invited to **Rule 16** of the Second Schedule to the Income Tax Act, 1961 which is reproduced below:

16(1) Where a notice has been served on a defaulter under Rule 2, the defaulter or his representative in interest shall not be competent to mortgage, charge, lease or otherwise deal with any property belonging to him except with the permission of the Recovery Officer, nor shall any Civil Court issue any process against such property in execution of a decree for the payment of money.
16(2) Where an attachment has been made under this Schedule, any private transfer or delivery of the property attached or of any interest therein and any payment to the defaulter of any debt, dividend or other moneys contrary to such attachment shall be void as against all claims enforceable under the attachment.
(Given under my hand and the seal of the Tribunal, Visakhapatnam on this day 13th March 2025)
(Avasarala Anil) Recovery Officer
Debts Recovery Tribunal, Visakhapatnam

यूनियन बैंक ऑफ इंडिया | యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
అస్సెట్ రికవరీ బ్రాంచి (79170), విజయవాడ,
4వ అంతస్తు, ఆంధ్రా బ్యాంక్ భవనం, ఆర్.ఆర్. అప్పారావు వీధి, విజయవాడ, ఏపి-520001.

అమ్మకం గురించి ఋణగ్రహీతకు తెలియపరుచు ప్రకటన (30 రోజుల ప్రకటన)
(RULE 6(2)/RULE 8(6) OF SECURITY INTEREST (ENFORCEMENT) RULES 2002)

ఋణగ్రహీతలు/కో ఆబ్లిగెంట్స్ / తనఖాదారులు / హామీదారులు: 1. మెస్సర్స్ శ్రీజా కాటన్ (ఋణగ్రహీత), ఫ్లాట్ నెం. 301, చిగురుపాటి టవర్స్, 11వ లైన్, శ్రీరాం నగర్ కాలనీ, న్యూ ఇన్నర్ రింగ్ రోడ్డు, గుంటూరు-522006. **2. శ్రీమతి ఆలోకం శిల్ప (ప్రొప్రయిటర్),** భర్త: ఏ.సుధాకర్ బాబు, ఫ్లాట్ నెం. 301, చిగురుపాటి టవర్స్, 11వ లైన్, శ్రీరాం నగర్ కాలనీ, న్యూ ఇన్నర్ రింగ్ రోడ్, గుంటూరు-522006. **3. శ్రీ ఆలోకం సుధాకర్ బాబు (హామీదారు),** ఫ్లాట్ నెం. 301, చిగురుపాటి టవర్స్, 11వ లైన్, శ్రీరాం నగర్ కాలనీ, న్యూ ఇన్నర్ రింగ్ రోడ్, గుంటూరు-522006. **4. శ్రీ భవిరిసెట్టి హనుమంతరావు (హామీదారు),** తండ్రి: చిన్న నరసింహారావు, డి.నెం. 2-122, మల్లాది గ్రామం, అమరావతి మండలం, గుంటూరు జిల్లా-522020. **5. శ్రీ వెంప శ్రీనివాసరావు (హామీదారు),** తండ్రి: సాంబశివ రావు, డి.నెం. 3-79, మల్లాది గ్రామం, అమరావతి మండలం, గుంటూరు జిల్లా-522020.

విషయం: సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ & ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 ప్రకారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అస్సెట్ రికవరీ బ్రాంచి (79170) వారికి శ్రీ భవిరిసెట్టి హనుమంతరావు & శ్రీ వెంప శ్రీనివాసరావు కి చెందిన బకాయి వసూలు కొరకు చెందిన ఆస్తి అమ్మకం.

చట్టం 13(2) విభాగం పరిధిలో నేను/బ్యాంక్ డిమాండ్ నోటీసు **తేది.05-12-2019** ద్వారా మీకు డిమాండ్ పంపినప్పటికీ మీరు బ్యాంక్‌కు చెల్లించవలసిన బకాయి మొత్తం చెల్లించుటలో మీరు విఫలమైనారు.

పైన చెప్పిన చట్టం పరిధిలో సంక్రమించిన అధికారాలతో ఈ దిగువ తెలిపిన ఆస్తిని **తేది.18-06-2020** న అధీకృత అధికారి లాంఛనాత్మకంగా స్వాధీన పరచుకున్నారు.

ఆస్తిని స్వాధీన పరచుకున్న తర్వాత కూడా, మీరు **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అస్సెట్ రికవరీ బ్రాంచి (79170)** కు చెల్లించవలసిన బకాయి మొత్తమును మీరు చెల్లించలేదు. అందువలన, ఈ నోటీసు తేదీ నుండి 30 దినములు తర్వాత దిగువ తెలిపిన ఆస్తిని ఇ-వేలం ద్వారా విక్రయించవలసిన అవసరం ఏర్పడినది. విడిగా జారీచేయబడు అమ్మకం ప్రకటన ద్వారా, వేలం తేదీ మరియు సమయం మరియు సర్వీసు ప్రొవైడర్ వివరములు తెలియచేయ బడతాయి మరియు హెచ్చు ధర ఆఫర్ చేసిన వ్యక్తికి ఆస్తి విక్రయించబడుతుంది. కాబట్టి, ఆస్తులను ప్రైవేటు అమ్మకం ద్వారా కూడా విక్రయించవచ్చును. లేదా వ్యక్తుల నుండి కొటేషన్లు కూడా పొందవచ్చును. బ్యాంక్ ఆమోదయోగ్యమైన మరియు కొనుగోలుదారుని ఉద్దేశించిన నిబంధనలు మరియు షరతులకు లోబడి ఆస్తి విక్రయించవచ్చును.

మీరు ప్రైవేటు అమ్మకం ద్వారా లేదా కొటేషన్ పొందడం ద్వారా ఆస్తిని ఎవరికైనా విక్రయించే ప్రతిపాదనలను కలిగి ఉన్నట్లుయితే, ఈ నోటీసు అందిన తేది నుండి 7 రోజులలోపుగా దానిని బ్యాంక్‌కు తెలియజేయగలరు.

విఫలమైనచో, మీకు అలాంటి ప్రతిపాదన ఏమీ లేదని పైన సూచించిన ప్రకారం ఇ-వేలం ద్వారా ఆస్తి విక్రయం చేయుటకు బ్యాంక్ తదుపరి ప్రక్రియ కొనసాగిస్తుంది.

ఇ-వేలం ప్రకటన ప్రచురణ తేదీన లేదా ఆలోగా బ్యాంక్ డిమాండ్ నోటీసు **తేది.05-12-2019** నందు సూచించిన పూర్తి మొత్తంతో పాటు చెల్లించు తేదీ వరకు అందుపై తదుపరి వడ్డీ మరియు అప్పటివరకు సంభవించిన ఖర్చులు మరియు వ్యయాలు చెల్లించి ఆస్తిని విడిపించుకోవచ్చునని దయచేసి మీరు గమనించగలరు. ఇట్టి విషయంలో షెడ్యూలులో తెలిపిన ఆస్తి అమ్మకానికి తదుపరి వేలం ఉండదు. చట్టంలోని సెక్షన్ 13(8) ప్రకారం విముక్తి హక్కు అందుబాటులో ఉంది.

షెడ్యూల్ ఆస్తి

తనఖా పెట్టబడిన ఆస్తుల వివరాలు దిగువ వివరించబడ్డాయి:
1) గుంటూరు జిల్లా, అమరావతి గ్రామం & మండలం (నివాస & కొంత వాణిజ్య ఏరియాలో) ఎస్.నెం. 134/1B, 134/1C, 135/B, 135/C1, 135/D, (డిస్.నెం. సి3/186/2009, తేది: 29.07.2009, VGTM-UDA ద్వారా ఆమోదించబడిన ప్రణాళిక ప్రకారం నిర్మించబడింది), డోర్.నెం. 7-1, 858 1/2 చ.గ.లు (259 1/2 + 599) స్థలం మరియు అందు గల ఆర్.సి.సి రూఫ్డ భవనం (GF+FF) నిర్మించబడినది శ్రీ భవిరిశెట్టి హనుమంతరావు గారి పేరున కలదు. హద్దులు క్రింద పేర్కొనబడ్డాయి, **సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం. 1112/2013 ప్రకారం: తూర్పు:** అలోకం కృష్ణయ్య గారికి చెందిన స్థలం, **దక్షిణం:** జొరిజ్ కొండలు @ వెంకటేశ్వరరావు యొక్క స్థలం, **పడమర:** ఆర్ & బి మెయిన్ రోడ్డు, **ఉత్తరం:** విన్నకోట సాంబ శివరావు గారికి చెందిన స్థలం. **సేల్ డీడ్ నెం. 1115/2013 ప్రకారం హద్దులు: తూర్పు:** అలోకం సుధాకర్ బాబు గారికి చెందిన ఆస్తి, **దక్షిణం:** వాగినేపల్లి వెంకటేశ్వరరావు గారికి చెందిన ఆస్తి, **పడమర:** అలోకం సుధాకర్ బాబు & విన్నకోట సాంబశివరావు గారికి చెందిన ఆస్తి, **ఉత్తరం:** అళ్ళగడ్డ రామారావు గారికి చెందిన ఆస్తి మరియు 10 అడుగుల వెడల్పు మార్గం. 2) గుంటూరు, అమరావతి గ్రామం & మండలం, ఎస్.నెం. 134/1B, 134/1C, 135/B, 135/C1, 135/D, సమీప డోర్.నెం.7-1, 599 చ.గ.లలో నివాస ఖాళీ స్థలం శ్రీ వెంప శ్రీనివాసరావు గారి పేరున కలదు. **సేల్ డీడ్ నెం. 1113/2013 ప్రకారం హద్దులు: తూర్పు:** మార్గం, **దక్షిణం:** విన్నకోట సాంబశివరావు గారికి చెందిన ఆస్తి, పడమర: ఆర్&బి మెయిన్ రోడ్డు, **ఉత్తరం:** అళ్ళగడ్డ రామారావు గారికి చెందిన ఆస్తి. **సేల్ డీడ్ నెం. 1114/2013 ప్రకారం హద్దులు: తూర్పు:** పెరుగు పుల్లయ్య మరియు ఇతరులకు చెందిన ఆస్తి, **దక్షిణం:** వజినేపల్లి వెంకటేశ్వరరావు గారికి చెందిన ఆస్తి, **పడమర:** అలోకం కృష్ణయ్య గారికి చెందిన ఆస్తి, **ఉత్తరం:** అళ్ళగడ్డ రామారావు గారికి చెందిన ఆస్తి. అక్షాంశం & రేఖాంశం: 16.571388, 80.359166

తేది: 25-02-2025 **అధీకృత అధికారి**
ప్రదేశము: విజయవాడ **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**

ఆర్థికభారం లేకుండా బనకచర్ల

- జూన్ 20కి డిపిఆర్
- అక్టోబరు నాటికి అనుమతులు
- సమీక్షా సమావేశంలో సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

దాదాపు 82 వేల కోట్ల రూపాయలు ఖర్చు అయ్యే పోలవరం-బనకచర్ల ప్రాజెక్టును ఆర్థికభారం లేకుండా నిర్వహించేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారులను ఆదేశించారు. సోమవారం నాడు ఆయన ఈ ప్రాజెక్టుపై జలవనరుల శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గోదావరి జలాలను పోలవరం నుంచి లిఫ్టులతో తరలించేందుకు అయ్యే విద్యుత్ వినియోగాన్ని ప్రాజెక్టు ప్రాంతంలోనే పంప్డ్ స్టోరేజ్, సోలార్ విద్యుత్ ప్లాంట్ నెలకొల్పడంతో ఉత్పత్తి చేసి భారం తగ్గించవచ్చని చెప్పారు. అదే విధంగా ఇతర అవకాశాలను కూడా పరిశీలించి సమగ్ర నివేదిక (డిపిఆర్)ను జూన్ 20వ తేదికల్లా సిద్ధం చేయాలని చెప్పారు. అక్టోబరు 20కి ప్రాజెక్టుకు సిడబ్ల్యుసి ఆమోదం పొందేలా చూడాలని ఆదేశించారు. పర్యావరణ అనుమతులు పొంది పనులు త్వరగా ప్రారంభించాలన్నారు. రోజుకు రెండు టిఎంసిల నీరు డిశ్చార్జ్ అయ్యేలా ప్రాజెక్టు డిజైన్ రూపొందించాలని చెప్పారు. 368.60 కిలో మీటర్ల ఒపెన్ కెనాల్‌తో నీటిని తరలిస్తారని తెలిపారు. మెయిన్ టన్నెల్ 20.50 కిలో మీటర్లు ఉండగా, సిద్ధాపురం ట్విన్ టన్నెల్ 6.60 కిలో మీటర్లు, పైపులైన్ 17 కిలో మీటర్లు వరకూ నిర్మిస్తారని, ఇందు కోసం మొత్తం 9 లిఫ్టులు వినియోగిస్తారని తెలిపారు. 3,377 మెగావాట్ల విద్యుత్ అవసరం అవుతుందన్నారు.

54 వేల ఎకరాల భూ సేకరణ

ఈ ప్రాజెక్టు కోసం 15,300 ఎకరాల అటవీ భూమితో కలిపి మొత్తం 54 వేల ఎకరాలు సేకరించాల్సి ఉంటుందని చంద్రబాబునాయుడు చెప్పారు. బొల్లాపల్లి రిజర్వాయర్ కోసం 5 గ్రామాల్లో 18 నివాస ప్రాంతాల ప్రజలకు పునరావాసం కల్పించాల్సి ఉందన్నారు. ప్రాజెక్టు మొత్తాన్ని మూడు సెగ్మెంట్‌లుగా చేపట్టనున్నట్లు తెలిపారు. మొదటి సెగ్మెంట్ పోలవరం నుంచి ప్రకాశం బ్యారేజ్ దిగువన ఉన్న పవిత్ర సంగమం వరకూ తాడిపూడి వరద కాల్వతో 175 కిలో మీటర్లు 18 వేల క్యూసెక్కుల డిశ్చార్జ్‌తో నీటిని తరలిస్తామన్నారు. ఇందుకు 1,401 ఎకరాల భూమి అవసరమని, రూ.13,800 కోట్లు ఖర్చు అవుతుందన్నారు. రెండవ సెగ్మెంట్‌లో వైకుంఠపురం నుంచి బొల్లాపల్లి రిజర్వాయర్ వరకూ 23 వేల క్యూసెక్కుల డిశ్చార్జ్‌తో నీటిని తీసుకువెళ్తారని, ఇందుకు ఒపెన్ కెనాల్ 83.40 కిలో మీటర్లు, పైపులైన్ 12.05 కిలోమీటర్లు, 6 లిఫ్టులు నిర్మిస్తామన్నారు. 2,493 మెగావాట్ల విద్యుత్‌ను వినియోగిస్తారని, 230 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుందని తెలిపారు. బొల్లాపల్లి రిజర్వాయర్‌కు 152 టిఎంసిల లైవ్ స్టోరేజ్ సామర్ధ్యం ఉంటుందని, ఇందుకు 35,750 కోట్లు వ్యయం అవుతుందని తెలిపారు. మూడవ సెగ్మెంట్‌లో బొల్లాపల్లి రిజర్వాయర్ నుంచి బనకచర్ల రెగ్యులేటర్‌కు 23వేల క్యూసెక్కుల డిశ్చార్జ్‌తో నీటిని తరలిస్తామన్నారు. ఇందుకు ఒపెన్ కెనాల్ 109.80 కిలో మీటర్లు, పైపులైన్ 5.7 కిలో మీటర్లు, మెయిన్ టన్నెల్ సిద్ధాపురం ట్విన్ టన్నెల్స్ నిర్మిస్తామన్నారు. . పోలవరం - బనకచర్ల అనుసంధానం పూర్తయితే రాష్ట్రానికి ఎన్నో లాభాలు ఉన్నాయని సిఎం తెలిపారు. మొత్తం 12.40 లక్షల హెక్టార్లకు సాగునీరు అందుతుందని, కాలువ ప్రవహించే సుమారు 400 కిలో మీటర్ల పొడవునా ఉన్న గ్రామాలకు తాగునీటి సమస్య తీరడంతోపాటు భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. 430 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుందని, బొల్లాపల్లి రిజర్వాయర్‌లో మత్స్య సంపద పెరుగుతుందని, వివిధ మార్గాల్లో ఏడాదికి రూ.12,294 కోట్ల సంపద సృష్టి జరుగుతుం దని అధికారులు అంచనా వేసినట్లు తెలిపారు.


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

వేసవి దృష్ట్యా రాష్ట్రంలో తాగునీటి ఎద్దడి లేకుండా అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. సచివాలయంలో వేసవి ముందస్తు ప్రణాళికలపై ఆయన విపత్తు నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షను సోమవారం నిర్వహించారు. ఎండల తీవ్రతపై ముందుగా వివిధ విభాగాల నుంచి సమాచారం తెప్పించి ప్రజలను అప్రమత్తం చేయాలని విపత్తు నిర్వహణ శాఖ అధికారులకు సూచించారు. మార్కెట్లు, కూలీ అడ్డాలు, జన సమూహం ఉండే ప్రాంతాల్లో ప్రభుత్వపరంగా చలి వేంద్రాలు, మజ్జిగ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పశువులకు తాగునీటి కోసం రాష్ట్ర వ్యాప్తంగా గ్రామాల్లో రూ.35 కోట్లతో 12,138 నీటి తొట్ల నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. పాఠశాలల్లో వాటర్ బెల్ విధానం అమలు చేయాలని, తప్పని సరిగా తాగునీటిని అందుబాటులో ఉంచాలని సూచించారు. అడవుల్లో అగ్నిప్రమాదాలు కారుచిచ్చులపై అప్రమత్తంగా ఉండాలని, డ్రోన్లతో పర్యవేక్షించాలని సూచించారు. అగ్నిప్రమాదాలు జరిగే ఆస్కారం ఉన్న పరిశ్రమల్లో మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. మున్సిపాలిటీల్లో నీటి సమస్య పరిష్కారానికి రూ.39 కోట్లు విడుదలకు అనుమతించారు. నీటి లభ్యతను పెంచేందుకు ఉపాధి పథకంలో పంట కుంటల నిర్మాణం, చెరువుల్లో పూడికతీత పనులు చేపట్టాలని సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో సిఎస్ విజయానంద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సంక్షేమంపై వైసిపి దుష్ప్రచారం

- టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉద్యోగుల సంక్షేమంపై కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై వైసిపి నేతలు దుష్ప్రచారం చేస్తున్నారని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు విమర్శించారు. వైసిపి హయాంలో ఆ పార్టీ నేతల అవినీతి, అక్రమాలకు ప్రభుత్వ ఉద్యోగులు సహకరించలేదన్న ఉద్దేశంతో న్యాయబద్ధంగా చెల్లించాల్సిన నిధులు కూడా ఇవ్వకుండా వేధింపులకు గురిచేశారని సోమవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వైసిపి పెట్టిన బకాయిల్లో ఈ ఏడాది జనవరిలో రూ.1000 కోట్లకు పైగా చెల్లించామన్నారు. రూ.6,200 కోట్లు వివిధ బకాయిలు కింద ఉద్యోగులకు చెల్లించి అండగా నిలబడుతున్నారన్న అక్కసుతో వైసిపి నేతలు తప్పుడు ప్రచారానికి పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో సిపిఎస్ కింద 6 నెలల బకాయిలు రూ.2,800 కోట్లు, జిపిఎఫ్ రూ.2,500 కోట్లు, ఎపిజిఎల్ఐ రూ.900 కోట్లు చొప్పున పెట్టిన బకాయిలను తమ ప్రభుత్వం చెల్లిస్తుందని తెలిపారు. ఐదేళ్ల వైసిపి పాలనలో ఒక్క ఏడాదైనా ఒకటో తేదీన వేతనాలు వచ్చాయా? అని ప్రశ్నించారు. వారికి రావాల్సిన సరెండర్ లీవ్స్, మెడికల్ లీవ్స్, జిపిఎఫ్ వంటి వాటిని బకాయి పెట్టి తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని విమర్శించారు.

यूनियन बैंक ऑफ इंडिया | యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భారత ప్రభుత్వ రంగ సంస్థ
కొరిటిపాడు బ్రాంచి
హరి హర మహల్ ఎదురు
కొరిటిపాడు, గుంటూరు-522007.

డిమాండ్ నోటీసు
Notice under Sec.13 (2) read with Sec.13 (3) of Securitization and Reconstruction of Financial Assets and Enforcement of Security Interest Act, 2002.

ఋణగ్రహీత(లు)/తనఖాదారు(లు)/కో-ఆబ్లిగెంట్(లు)/హామీదారు(లు): 1.శ్రీ ఘంటసాల నాగేశ్వర శాస్త్రి, తండ్రి: జి.వి. లక్ష్మీ నారాయణ శాస్త్రి, డి.నెం.25-18-92, స్వామి అయ్యప్ప గుడి దగ్గర, సంపత్ నగర్, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522003. **సహ-ఋణగ్రహీత: 2. శ్రీ. ఘంటసాల విజయ కుమార్,** తండ్రి: ఘంటసాల నాగేశ్వర శాస్త్రి, అర్చక్, సాయిబాబా గుడి, విద్యానగర్ 3వ లేన్, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522003. **3. శ్రీ ఘంటసాల శ్రీదేవి,** భర్త: ఘంటసాల విజయ్ కుమార్, ఎస్.బి.ఐ కాలనీ, జె.కె.సి కాలేజీ దగ్గర, సాయిబాబా గుడి, విద్యానగర్ 3వ లేన్, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522003. **4. శ్రీమతి ఘంటసాల అన్నపూర్ణ,** భర్త: ఘంటసాల నాగేశ్వర శాస్త్రి, డి.నెం. 25-18-92, స్వామి అయ్యప్ప గుడి దగ్గర, సంపత్ నగర్, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522003. **కో-ఆబ్లిగెంట్: 5. శ్రీ ప్రత్తిపాటి శ్రీనివాస్,** తండ్రి: సాంబశివ రావు, ఎఫ్.నెం. 7, కమలేష్ టవర్స్, విద్యానగర్ 1వ లేన్, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522003.

నేచర్ ఆఫ్ లిమిట్	తేది. 30.11.2024 నాటికి బకాయి మొత్తం	ది.30.11.2024 నాటికి వర్తించని వడ్డీ	బ్యాంక్ చేసిన ఖర్చు ఛార్జీలు	బకాయి మొత్తం
HL001 (031430029002988)	రూ. 1,51,699.84	రూ. 57,775/-	రూ. 500/-	రూ. 2,09,974.84

దిగువ వివరించిన స్థిరాస్తి తనఖా: గుంటూరు, సంపత్ నగర్, వార్డు నెం. 16, బ్లాక్ నెం. 11, పట్టణ సర్వే నెం: 661.63.664, డి.నెం. 25-18-92/4, మున్సిపల్ అసెస్‌మెంట్ నెం. 35317, విస్తీర్ణం 173.79 చ.గ.లలో ఉన్న నివాస భవనం శ్రీ ఘంటసాల నాగేశ్వర శాస్త్రి గారికి చెందినది మరియు ఈ క్రింది హద్దులు: **తూర్పు:** పెద్దినల్ల నాగేంద్రం గారి గోడ 41'-0", **దక్షిణం:** టి.సత్యనారాయణమ్మ మరియు గల్లీ 38'-4", **పడమర:** బి.హనుమ శాస్త్రి గారి ఆస్తి 39'-9", **ఉత్తరం:** రామనామ క్షేత్రం గోడ 39'-3". పై హద్దులలో 173.7/9 చ.గ.ల విస్తీర్ణంలో ఆర్.సి.సి డాబా ఇల్లు. **ఐటమ్ నెం.2:** గుంటూరు, సంపత్ నగర్, వార్డు నెం. 16, బ్లాక్ నెం. 11, పట్టణ సర్వే నెం: 661.63.664, డి.నెం. 25-18-92/4, మున్సిపల్ అసెస్‌మెంట్ నెం. 35317, విస్తీర్ణం 173.79 చ.గ.లలో ఉన్న నివాస భవనం శ్రీ ఘంటసాల నాగేశ్వర శాస్త్రి గారి పేరున కలదు మరియు ఈ క్రింది హద్దులు: **తూర్పు:** వేడి దిమల్ల నాగేంద్రం గారి గోడ 39'-9", **పడమర:** కె. రోశయ్య మరియు నాయుడు గారి గోడ 39'-9", **ఉత్తరం:** ఐటమ్ నెం.1-5', **దక్షిణం:** 30 అడుగుల వెడల్పు రోడ్డు-5', పైన పేర్కొన్న హద్దులలో విస్తీర్ణం 22 చ.గ.లలో అర్ధ భాగం అంటే 11 చ.గ.లు ఐటమ్ నెం. 1 మరియు ఐటమ్ నెం. 2 కలిపి మొత్తం విస్తీర్ణం 184-7/9 చ.గ.లు.

గౌరవనీయులైన సర్/మేడమ్
విషయం: ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టము ప్రకారము నోటీసు - మీరు మా నుండి పొందిన ఋణ సౌకర్యములకు సంబంధించి-నిరర్ధక ఆస్తులుగా వర్గీకరణ.

ఇందుమూలముగా మీకు తెలియజేయునది ఏమనగా మీరు హౌసింగ్ లోన్ అకౌంట్ క్రింద మా **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా** వద్దనున్న మీ ఋణ బకాయిలను / వడ్డీని చెల్లించుటలో విఫలమైనందున మీ ఖాతాను **ది.27-09-2021**న నిరర్ధక ఆస్తిగా **(NPA)** వర్గీకరించబడినది. ఎగువ తెలిపిన తేదీన మీ ఋణ ఖాతాల బకాయిలు **ది. 30-11-2024** నాటికి మొత్తము **రూ. 2,09,974.84 (అక్షరాలా రెండు లక్షల తొమ్మిది వేల తొమ్మిది వందల డెబ్బై నాలుగు రూపాయల ఎనభై నాలుగు పైసలు మాత్రమే).** అనేక మార్లు విన్నపములు చేసినప్పటికీ, మీరు మీ ఖాతాలోని బకాయి మొత్తములను చెల్లించలేదు/మీ ఋణములను చెల్లించలేదు. అందువలన సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ & ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 యొక్క సెక్షన్ 13 (2) ప్రకారము మీ యొక్క బకాయి మరియు ఋణ పత్రములో అంగీకరించబడిన నియమ నిబంధనలలో ఉన్న ఒప్పంద రేటు ప్రకారము పైన తెలుపబడిన బకాయి తదుపరి నెలవారి వడ్డీ మరియు ఇతర ఖర్చులతో సహా ఈ నోటీసు అందిన 60 రోజులలోగా చెల్లించవలసి ఉంటుందని, అట్లు చేయుటలో విఫలమైనచో మీరు మా బ్యాంక్‌కు హామీ ఇచ్చిన ఆస్తులపై సదరు చట్టం ప్రకారం లభించు ఏవేని లేదా అన్ని హక్కులను ప్రయోగించవలసి ఉంటుందని తెలియజేయడమైనది.
1) మీరు సదరు బకాయిలను 60 రోజులలోగా తిరిగి చెల్లించుటలో విఫలమైనచో, బ్యాంకు వారు సదరు చట్టం ప్రకారం వారికి సంక్రమించిన అన్ని హక్కులను వినియోగించి హామీ ఇవ్వబడిన ఆస్తుల విక్రయ ధనముతో బకాయిలను పూర్తిగా చెల్లించబడనప్పుడు, మిగిలిన బకాయి సొమ్ము మీ నుండి రాబట్టుకొనుటకు, న్యాయస్థానము /డెట్ రికవరీ ట్రిబ్యునల్ నందు తగు న్యాయపరమైన చర్యలు తీసుకోబడునని తెలియజేయడమైనది.
2) సదరు చట్టం యొక్క సెక్షన్ 13 (13) ప్రకారము ఈ నోటీసు పొందిన అనంతరం మీరు పైన చెప్పబడిన ఆస్తులను సాధారణ వ్యాపార కార్యకలాపాలు తప్ప బ్యాంకు వారి అనుమతి లేకుండా విక్రయించరాదు. మరియు లావాదేవీలు జరుపరాదు సదరు సెక్షన్‌లో నిబంధనలలో ఏ విధమైన అతిక్రమణ జరిగిన తీవ్ర పరిణామాలకు దారి తీస్తుందని గమనించగలరు.
3) SARFAESI చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) ప్రకారము ఋణగ్రహీత తనఖా ఆస్తిని గడువు లోపల విడిపించుకొనుటకు గాను దృష్టిసారించవలసి ఉన్నది.
గమనిక: SARFAESI చట్టం సెక్షన్ 13(2) క్రింద 18.12.2024 తేదీన జారీచేసిన ముందస్తు డిమాండ్ నోటీసు ఉపసంహరించబడింది.

తేది : 26-12-2024 **అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**

ఉద్యోగాల కల్పనకు ప్రతి పాలసీలో సంస్కరణలు

- మంత్రివర్గ ఉపసంఘం సమావేశంలో మంత్రి లోకేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉద్యోగాల కల్పన కోసం ప్రతి పాలసీలో సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరం ఉందని విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అభిప్రాయం వ్యక్తం చేశారు. పెట్టుబడులు పెట్టాలనుకునేవారికి ప్రతిబంధకంగా మారిన విధానాల్ని సంస్కరిస్తామన్నారు. అంతర్జాతీయంగానూ, దేశంలోనూ ఉన్న అన్ని పెద్ద కంపెనీలనూ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆహ్వానించాలని సూచించారు. లోకేష్ ఛైర్మన్‌గా ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం రెండో సమావేశం ఉండవల్లిలో సోమవారం జరిగింది. ఇప్పటివరకు వచ్చిన పెట్టుబడులు, ఉద్యోగాల కల్పనతో పాటు వివిధ ఎంఒయుల స్థితిగతులపై అధికారులు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. ఇప్పటి వరకు కుదుర్చుకున్న ఒప్పందాల ద్వారా రూ.8,73,220 కోట్లు పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందని, తద్వారా 5,27,824 మందికి ఉద్యోగాలు వచ్చే అవకాశాలు ఉన్నాయని వివరించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ.. ఇన్వెస్ట్‌మెంట్ ట్రాకర్ పోర్టల్‌ను సమర్ధవంతంగా తీర్చిదిద్దాలని, భూ కేటాయింపులు, అనుమతులకు సంబంధించిన అన్ని వివరాలు ఇందులో ఉంచాలని చెప్పారు. రాష్ట్రంలో ఇప్పటికే పెట్టుబడులు పెట్టిన కంపెనీలు మరింతగా విస్తరించేలా వారిలో నమ్మకం కల్పించాలని, ఇవ్వాల్సిన రాయితీలు, ప్రోత్సాహకాలు అందించాలని చెప్పారు. ఎంఎస్ఎంఇ రంగంలో పెద్దయెత్తున ఉపాధి, ఉద్యోగాల కల్పన జరుగుతోందన్నారు. ఐటిఐ, పాలిటెక్నిక్‌ల ద్వారా పరిశ్రమలకు అవసరమైన మానవ వనరులను అందించాలని చెప్పారు. పోర్టుల అభివృద్ధిపైనా దృష్టి కేంద్రీకరించాలని, టూరిజం రంగంలో పెట్టుబడులు ఆకర్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. మైనింగ్ రంగంలోనూ విస్తృత అవకాశాలు ఉన్నాయని, ఈ రంగంపైనా దృష్టిసారించాలని దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో పరిశ్రమలు, ఇంధన, మున్సిపల్ పట్టణాభివృద్ధి, ఎంఎస్ఎంఇ, గనులశాఖ మంత్రులు టిజి భరత్, గొట్టిపాటి రవికుమార్, పి నారాయణ, కొండపల్లి శ్రీనివాస్, కొల్లు రవీంద్ర, పర్యాటకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్, పరిశ్రమలశాఖ కార్యదర్శి ఎన్ యువరాజ్, ఐటిశాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

బోరుగడ్డ అనిల్‌పై హైకోర్టు ఆగ్రహం

ప్రజాశక్తి-అమరావతి

సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ ఇతరులపై సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారనే కేసులో తనకు మంజూరు చేసిన మధ్యంతర బెయిల్ ఉత్తర్వులను పొడిగించాలంటూ బోరుగడ్డ అనిల్ కోరడంపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎన్నిసార్లు బెయిల్ పొడిగించాలని కోరతారని నిలదీసింది. తప్పుడు మెడికల్ సర్టిఫికెట్లు సమర్పించి మధ్యంతర బెయిల్ పొందారనే అభియోగాల నేపథ్యంలో దీనిపై లోతుగా విచారణ చేయాలని పోలీసులను ఆదేశించింది. ఇది నిజమని తేలితే అనిల్‌తోపాటు సర్టిఫికెట్ ఇచ్చిన డాక్టర్‌పై కూడా విచారిస్తామంది. ఈ నెల 11 సాయంత్రం 5 గంటల నాటికి రాజమండ్రి సెంట్రల్ జైల్లో లొంగిపోవాలన్న గత ఉత్తర్వులను అమలు చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎందుకు లొంగిపోలేదో వివరణ ఇవ్వాలంది. విడులైనప్పుడు సమర్పించిన పూచీకత్తులు ఇచ్చిన వాళ్ల వివరాలు ఇవ్వాలని జైలు సూపరింటెండెంటును ఆదేశించింది. వచ్చే వారానికి విచారణను వాయిదా వేస్తున్నట్లు జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జునరావు సోమవారం ప్రకటించారు. సోషల్ మీడియా పోస్టుల కేసులో అరెస్టయి జైల్లో ఉన్న బోరుగడ్డ అనిల్ కుమార్ వేసిన బెయిల్ పిటిషన్ హైకోర్టులో ఉండగానే తన తల్లికి అనారోగ్యంగా ఉందని పేర్కొంటూ ఈ నెల 11 వరకు మధ్యంతర బెయిల్ పొందారు. తల్లి ఆరోగ్యానికి సంబంధించిన మెడికల్ రిపోర్టుల్లో తప్పులున్నాయంటూ కోర్టులో లొంగిపోవాలని ఆదేశించింది. ఈ ఉత్తర్వులను అమలు చేయకపోవడంతో అనిల్‌పై ఆగ్రహించింది.

ఈద్ ముందస్తు వేడుకలపై బెదిరింపులు

- రద్దు చేసుకున్న సిమ్లా పాఠశాల

సిమ్లా : ఈద్ ముందస్తు వేడుకలపై హిందుత్వ శక్తుల నుంచి బెదిరింపులు రావడంతో సిమ్లాలో ఒక ప్రైవేటు పాఠశాల వీటిని రద్దు చేసింది. సిమ్లాలోని ఒక ప్రైవేటు పాఠశాల ఈ నెల 28న ఈద్ ముందస్తు వేడుకలు నిర్వహించాలని నిర్ణయించి, విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు తెలిపింది. విషయం తెలిసిన స్థానిక హిందుత్వ గ్రూపు దేవ్‌భూమి సంఘర్ష్ సమితి పాఠశాలపై బెదిరింపులకు దిగింది. పాఠశాల ముందు నిరసనలు చేస్తామని, చట్టపరమైన చర్యలకు దిగుతామని హెచ్చరించింది. దీంతో పాఠశాల అధికారులు ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకుంటున్నట్లు తెలిపింది.

यूनियन बैंक ऑफ इंडिया | Union Bank of India
అస్సెట్ రికవరీ బ్రాంచ్ (79170), విజయవాడ,
4వ అంతస్తు, ఆంధ్రా బ్యాంక్ భవనం, ఆర్.ఆర్. అప్పారావు వీధి, విజయవాడ, ఏపి-520001.

అమ్మకం గురించి ఋణగ్రహీతకు తెలియపరుచు ప్రకటన (30 రోజుల ప్రకటన)
(RULE 6(2)/RULE 8(6) OF SECURITY INTEREST (ENFORCEMENT) RULES 2002)

ఋణగ్రహీతలు/కో ఆబ్లిగెంట్స్ / తనఖాదారులు / హామీదారులు: 1) మెస్సర్స్ సాయి వెంకట రామ ఆయిల్ & ఆగ్రో ప్రొడక్ట్స్. డోర్ నెం.3-165, జి.టి రోడ్డు, ఎడ్లపాడు గ్రామం మరియు మండలం, గుంటూరు-522233. **2) మెస్సర్స్ సాయి వెంకట రామ ఆయిల్ & ఆగ్రో ప్రొడక్ట్స్,** మేనేజింగ్ పార్టనర్: శ్రీ పంగులూరి పెదబాబు, డోర్ నెం.3-165, జి.టి రోడ్డు, ఎడ్లపాడు గ్రామం మరియు మండలం, గుంటూరు-522233. **3) మెస్సర్స్ సాయి వెంకట రామ ఆయిల్ & ఆగ్రో ప్రొడక్ట్స్,** పార్టనర్: శ్రీ పంగులూరి సుబ్బారావు డోర్ నెం.3-165, జి.టి రోడ్డు, ఎడ్లపాడు గ్రామం మరియు మండలం, గుంటూరు-522233. **4) మెస్సర్స్ సాయి వెంకట రామ ఆయిల్ & ఆగ్రో ప్రొడక్ట్స్,** పార్టనర్: శ్రీ పోపూరి అప్పారావు, డోర్ నెం.3-165, జి.టి రోడ్డు, ఎడ్లపాడు గ్రామం మరియు మండలం, గుంటూరు-522233. **5) శ్రీ పంగులూరి పెదబాబు,** తండ్రి: రామచంద్రయ్య, డి.నెం.3-460/1, పండరీపురం, 9వ లైన్, చిలకలూరిపేట, గుంటూరు-522616. **6) శ్రీ పంగులూరి సుబ్బా రావు,** తండ్రి: కోటయ్య, డి.నెం.1-730, పండరీపురం, 9వ లైన్, చిలకలూరిపేట, గుంటూరు-522616. **7) శ్రీమతి పంగులూరి స్వప్న కుమారి,** భర్త: పెదబాబు, డి.నెం.3-460/1, పండరీపురం, 9వ లైన్, చిలకలూరిపేట, గుంటూరు-522616. **8) శ్రీమతి మాదినేని ఉదయ లక్ష్మి,** భర్త: లింగయ్య చౌదరి, డి.నెం.3-460/1, పండరీపురం, 9వ లైన్, చిలకలూరిపేట, గుంటూరు-522616. **9) శ్రీమతి పదర్తి పద్మలత,** భర్త: ప్రసాద్, డి.నెం.9-225, జాకీర్ హుస్సేన్ వీధి, నెహ్రూ నగర్, కృష్ణ మహల్ సెంటర్, పురుషోత్తపట్నం, చిలకలూరిపేట, గుంటూరు-522616. **10) శ్రీమతి దావులూరి సుధా రాణి,** భర్త: శ్రీహరి బాబు, డి.నెం.4ఈ2, గణపతి లేఅవుట్, కృష్ణమ్మాళ్ వీధి నెం.1, కుప్పకోనన్‌పుదూర్, కోయంబత్తూర్, తమిళనాడు-641038. **11) శ్రీ పోపూరి అప్పారావు,** తండ్రి: వెంకట సుబ్బయ్య, డి.నెం. 7-41, ఎన్టీఆర్ సెంటర్ దగ్గర, ప్రభుత్వ ఆసుపత్రి బజార్, ఎడ్లపాడు, గుంటూరు-522233.

విషయం: సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ & ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 ప్రకారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అస్సెట్ రికవరీ బ్రాంచి (79170) వారికి మెస్సర్స్ సాయి వెంకట రామ ఆయిల్ & ఆగ్రో ప్రొడక్ట్స్ కి చెందిన బకాయి వసూలు కొరకు మీకు చెందిన ఆస్తి అమ్మకం.

చట్టం 13(2) విభాగం పరిధిలో నేను/బ్యాంక్ డిమాండ్ నోటీసు **తేది.01-06-2023** ద్వారా మీకు డిమాండ్ పంపినప్పటికీ మీరు బ్యాంకుకు చెల్లించవలసిన బకాయి మొత్తం చెల్లించుటలో మీరు విఫలమైనారు.

పైన చెప్పిన చట్టం పరిధిలో సంక్రమించిన అధికారాలతో ఈ దిగువ తెలిపిన ఆస్తిని **తేది.29-08-2023** న అధీకృత అధికారి లాంఛనాత్మక స్వాధీన పరచుకున్నారు.

ఆస్తిని స్వాధీన పరచుకున్న తర్వాత కూడా, మీరు **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అస్సెట్ రికవరీ బ్రాంచి (79170)** కు చెల్లించవలసిన బకాయి మొత్తమును మీరు చెల్లించలేదు. అందువలన, ఈ నోటీసు తేదీ నుండి 30 దినములు తర్వాత దిగువ తెలిపిన ఆస్తిని ఇ-వేలం ద్వారా విక్రయించవలసిన అవసరం ఏర్పడినది. విడిగా జారీచేయబడు అమ్మకం ప్రకటన ద్వారా, వేలం తేదీ మరియు సమయం మరియు సర్వీసు ప్రొవైడర్ వివరములు తెలియచేయ బడతాయి మరియు హెచ్చు ధర ఆఫర్ చేసిన వ్యక్తికి ఆస్తి విక్రయించబడుతుంది. కాబట్టి, ఆస్తులను ప్రైవేటు అమ్మకం ద్వారా కూడా విక్రయించవచ్చును. లేదా వ్యక్తుల నుండి కొటేషన్లు కూడా పొందవచ్చును. బ్యాంక్ ఆమోదయోగ్యమైన మరియు కొనుగోలుదారుని ఉద్దేశించిన నిబంధనలు మరియు షరతులకు లోబడి ఆస్తి విక్రయించవచ్చును.

మీరు ప్రైవేటు అమ్మకం ద్వారా లేదా కొటేషన్ పొందడం ద్వారా ఆస్తిని ఎవరికైనా విక్రయించే ప్రతిపాదనలను కలిగి ఉన్నట్లుయితే, ఈ నోటీసు అందిన తేది నుండి 7 రోజులలోపుగా దానిని బ్యాంక్‌కు తెలియజేయగలరు.

విఫలమైనచో, మీకు అలాంటి ప్రతిపాదన ఏమీ లేదని పైన సూచించిన ప్రకారం ఇ-వేలం ద్వారా ఆస్తి విక్రయం చేయుటకు బ్యాంక్ తదుపరి ప్రక్రియ కొనసాగిస్తుంది.

ఇ-వేలం ప్రకటన ప్రచురణ తేదీన లేదా ఆలోగా బ్యాంక్ డిమాండ్ నోటీసు **తేది.01-06-2023** నందు సూచించిన పూర్తి మొత్తంతో పాటు చెల్లించు తేదీ వరకు అందుపై తదుపరి వడ్డీ మరియు అప్పటివరకు సంభవించిన ఖర్చులు మరియు వ్యయాలు చెల్లించి ఆస్తిని విడిపించుకోవచ్చునని దయచేసి మీరు గమనించగలరు. ఇట్టి విషయంలో షెడ్యూలులో తెలిపిన ఆస్తి అమ్మకానికి తదుపరి వేలం ఉండదు. చట్టంలోని సెక్షన్ 13(8) ప్రకారం విముక్తి హక్కు అందుబాటులో ఉంది.

షెడ్యూల్ ఆస్తి

ఆస్తి-1: పార్ట్-1: నరసరావుపేట రిజిస్ట్రేషన్ జిల్లా, చిలకలూరి పేట సబ్ రిజిస్ట్రేషన్ జిల్లా, ఎడ్లపాడు గ్రామపంచాయితీ & గ్రామం, డి.నెం.374/ఏ1 లో ఎకరా 1.38 సెంట్ల గ్రామీణ పారిశ్రామిక భూమి మరియు భవనం శ్రీ పోపూరి అప్పారావు గారి పేరున కలదు. హద్దులు **తూర్పు:** ఎన్.ఎస్.పి బోదే కాలువ, **దక్షిణం:** మద్దుల సాంబశివరావు తదితరుల భూమి, **పడమర:** కాకుమాను సుబ్బారావు తదితరుల భూమి, **ఉత్తరం:** నూతలపాటి సుబ్బారావు తదితరుల భూమి. **పార్ట్-2:** నరసరావుపేట రిజిస్ట్రేషన్ జిల్లా, చిలకలూరి పేట సబ్ రిజిస్ట్రేషన్ జిల్లా, ఎడ్లపాడు గ్రామపంచాయితీ & గ్రామం, డి.నెం.374/బి, 374/సి లో ఎకరా 0.66 సెంట్ల గ్రామీణ పారిశ్రామిక భూమి మరియు భవనం శ్రీ పంగులూరి పెద్దబాబు గారి పేరున కలదు. హద్దులు **తూర్పు:** జి.టి రోడ్ మార్జిన్, **దక్షిణం:** పంగులూరి రామచంద్రయ్య భూమి, **పడమర:** పంగులూరి రామచంద్రయ్య భూమి, **ఉత్తరం:** పోపూరి అప్పారావు భూమి. **పార్ట్-3:** నరసరావుపేట రిజిస్ట్రేషన్ జిల్లా, చిలకలూరి పేట సబ్ జిల్లా, ఎడ్లపాడు గ్రామపంచాయితీ & గ్రామం, డి.నెం.374/డి1, 374/ఈ (రీ సర్వే.నెం.374/ఈ1), 374/డి1, 372, 373/2, 374/డి (రీ సర్వే.నెం.374/డి1) లో ఎకరా 1.85 1/2 సెంట్ల గ్రామీణ పారిశ్రామిక భూమి మరియు ఏసిసి రూఫ్ గోడౌన్స్ శ్రీ పంగులూరి రామచంద్రయ్య గారి పేరున కలదు. తదనంతరం శ్రీ పంగులూరి రామచంద్రయ్య మరియు ఆయన భార్య శ్రీమతి పంగులూరి ఈశ్వరమ్మ మరణంతో వారి చట్టరిత్యా వారసులు (1.శ్రీ పంగులూరి పెదబాబు వారి కుమారుడిగా, మరియు 2. శ్రీమతి మాదినేని ఉదయ లక్ష్మి, భర్త: లింగయ్య చౌదరి, 3.శ్రీమతి పదర్తి పద్మలత, భర్త: ప్రసాద్, 4.శ్రీమతి దావులూరి సుధా రాణి, భర్త: శ్రీహరి బాబు వారి కుమార్తెలుగా) యజమానులుగా మారారు మరియు వారికి కట్టుబడి ఉన్నారు: హద్దులు **తూర్పు:** గ్రాండ్ ట్రంక్ రోడ్ పరిమితి, **దక్షిణం:** మాదం ఆంజనేయులుకు చెందిన భూమి, **పడమర:** రెమిశెట్టి సుబ్బారావుకు చెందిన భూమి, **ఉత్తరం:** పంగులూరి పెదబాబుకు చెందిన భూమి. గూగుల్ కోఆర్డినేట్స్: 16.174638, 80.231713
ఆస్తి-2: చిలకలూరి పేట మున్సిపల్ పరిధి, చిలకలూరి పేట, పురుషోత్తమపట్నం గ్రామం, బ్లాక్ నెం.3, డి.నెం.131/జి, దగ్గరి డోర్.నెం.3-460 లో ఎకరం 0-11 సెంట్లు లేదా 532 చ.గ.లు లేదా 448 చ.మీ.ల నివాస భూమి మరియు ఆర్.సి.సి రూఫ్ గ్రౌండ్ & మొదటి అంతస్తు నివాస భవనం శ్రీ పంగులూరి పెదబాబు, తండ్రి: రామచంద్రయ్య మరియు భార్య శ్రీమతి పంగులూరి స్వప్న కుమారి గారి పేరున కలదు. హద్దులు: **తూర్పు:** గడగొట్టు వెంకట సుబ్బయ్య ఆస్తి-81 1/2 లింకులు, **దక్షిణం:** పెరవల్లి సాంబయ్య ఆస్తి-135 లింకులు, **పడమర:** సర్కారు బజార్-81 1/2 లింకులు, **ఉత్తరం:** సంగిశెట్టి బసవయ్య ఆస్తి-135 లింకులు. గూగుల్ కోఆర్డినేట్స్: 16.096291, 80.162093

తేది: 01-03-2025 **అధీకృత అధికారి**
ప్రదేశము: విజయవాడ **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**

స్వాధీనతా ప్రకటన
ఇడెల్‌వీస్ అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్
CIN: U67100MH2007PLC174759
రిటైల్ సెంట్రల్ & రిజిస్టర్డు ఆఫీసు: ఇడెల్‌వీస్ హౌస్, ఆఫ్ సిఎస్‌టి రోడ్, కలీనా, ముంబయి-400098.

అనుబంధం-4 (రూల్-8(1)) స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కొరకు)

ఏదైతే, సెక్యూర్డు క్రెడిటర్ల యొక్క అధీకృత అధికారిగా, సెక్యూరిటైజేషన్ అండ్ రికన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ (యాక్ట్) 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ (రూల్ 3)తో చదువగల సెక్షన్ 13 (12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ సదరు నోటీసు స్వీకరణ తేది నుండి 60 రోజుల్లోపు నోటీసులో పేర్కొన్న మొత్తాలను తిరిగి చెల్లించాలని రుణగ్రహీతలను కోరుతూ డిమాండ్ నోటీసు జారీచేయబడినది.
ఆ తరువాత, సెక్యూర్డు క్రెడిటర్స్, SARFAESI చట్టం, 2002 యొక్క సెక్షన్ 5 క్రింద కమీడట EARC గా పేర్కొనబడును వివిధ ట్రస్టీల యొక్క ట్రస్టీగా దీని సామర్థ్యంలో స్వంతగా/ వ్యవహరిస్తున్న **ఇడెల్‌వీస్ అసెట్ రీకన్‌స్ట్రక్షన్స్ కంపెనీ లిమిటెడ్** వారికి ఫైనాన్షియల్ అసెట్స్‌ను కేటాయించింది. సెక్యూర్డు క్రెడిటర్ యొక్క షూష్‌లోకి EARC ప్రవేశించింది మరియు సెక్యూరిటీ ఇంట్రెస్ట్, గ్యారంటీలు, తాకట్టు క్రిందగల వాటితోపాటుగా ఫైనాన్షియల్ అసెట్స్‌కు సంబంధించి సెక్యూర్డు క్రెడిటర్ యొక్క అన్ని హక్కులు, టైటిల్ మరియు ఇంట్రెస్ట్‌ను రుణగ్రహీత సంబంధించి EARC వారికి ఇవ్వబడినవి మరియు సెక్యూర్డ్ క్రెడిటర్‌గా దీని అన్ని హక్కులను EARC వినియోగిస్తుంది.
రుణగ్రహీత మొత్తాలను తిరిగిచెల్లించుటలో విఫలం చెందిన కారణంగా, ఇందుమూలంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలకు నోటీసు ఇవ్వడమేమనగా, క్రింది సంతకందారు, **ఇడెల్‌వీస్ అసెట్ రీకన్‌స్ట్రక్షన్స్ కంపెనీ లిమిటెడ్** యొక్క అధీకృత అధికారిగా, సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8తో చదవగల చట్టంలోని సెక్షన్ 13 యొక్క ఉప-సెక్షన్ (4) క్రింద అతనికి సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ ప్రతి ఆస్తికి ఎదురుగా పేర్కొన్న తేదిన దిగువ వివరించిన ఆస్తిని స్వాధీనంలోకి తీసుకున్నారు.

క్ర. సం.	రుణగ్రహీత & సహ-రుణగ్రహీత పేరు/ రుణ ఖాతా నంబరు	ట్రస్ట్ వివరాలు	డిమాండ్ నోటీసు తేది& మొత్తాలు	స్వాధీనతా తేది	లాంఛనప్రాయ/ భౌతిక స్వాధీనతా
5	1) శ్రీ ఎన్ శశి కుమార్ ముక్కోల్లు (రుణగ్రహీత) 2) శ్రీమతి మాధవి లత ముక్కోల్లు (సహ-రుణగ్రహీత) LAN: HL/0053/H/13/000067	ఇఏఆర్‌సి ట్రస్ట్ ఎస్‌సి-423 మరియు పూనావాల ఫిన్‌కార్ప్ లిమిటెడ్	12-12-2022 and Rs.37,00,568.17	22-03-2025	భౌతిక స్వాధీనతా
	సెక్యూర్డ్ అసెట్ వివరణ: చందర్లపాడు గ్రామం, చందర్లపాడు గ్రామ పంచాయతీ పరిధి, నందిగామ సబ్ రిజిస్ట్రీ, కృష్ణా జిల్లాలోని డోర్ నెం.10-105 దగ్గరలోని ఆర్ఎస్ నెం.179/9లోని 520.3 చ.గ.ల విస్తీర్ణపు ఆర్‌సిసి బిల్డింగ్ కలిగిన ఆస్తి మొత్తం. **సరిహద్దులు: తూర్పు:** జువ్వా సూర్యం ఆస్తి, **దక్షిణం:** రోడ్డు, **పడమర:** కట్టా చౌదరయ్య మిగిలిన ఆస్తి, **ఉత్తరం:** ధూళిపాల రవి ఆస్తి. నందిగమ సబ్-రిజిస్ట్రార్ ముందు డాక్యుమెంట్ నెం.2826/2009, తేది.20.10.2009నాటి ద్వారా సేల్ డీడ్‌లో మరింత ప్రత్యేకంగా ప్రస్తావించబడింది.				
6	1) మెసర్స్ జ్యోతి జనరల్ స్టోర్స్ ("రుణగ్రహీత") 2) లేట్ శ్రీ.గోకవరపు జానకి రామయ్య("సహ-రుణగ్రహీత") 3) శ్రీమతి గోకవరపు జ్యోతి కుమారి ("సహ-రుణగ్రహీత") 4) శ్రీ గోకవరపు సాయి సత్యనారాయణ (సహ-రుణగ్రహీత) LAN:- 3342650	ఇఏఆర్‌సి ట్రస్ట్ ఎస్‌సి-482 మరియు హెచ్‌డిబి ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్	12-08-2024 and Rs.29,65,715.60	24-03-2025	లాంఛనప్రాయ స్వాధీనతా
	సెక్యూర్డ్ అసెట్ వివరణ: గుంటూరు రిజిస్ట్రేషన్ జిల్లా, ఉప జిల్లా మందడం, తుళ్లూరు మండలం వెలగపూడి గ్రామ పంచాయతీ, వెలగపూడి గ్రామం, డి. నెం.32/ఏ1 మరియు అసెస్‌మెంట్ నెం.297 మరియు డోర్ నెం.3-40తో 103 చ.గ.లు లేదా 86.118 మీటర్లకు సమానమైన విస్తీర్ణపు షెడ్యూల్ ఆస్తి మొత్తం. **సరిహద్దులు: తూర్పు:** ఆర్‌సిఎం చర్చి స్థలం, **దక్షిణం:** షేక్ నబీ సాహెబ్ మొ॥న వారి స్థలం, **పడమర:** షేక్ నబీ సాహెబ్ మొ॥న వారి స్థలం, **ఉత్తరం:** పంచాయతీ రోడ్డు. 103 చదరపు గజాలు లేదా 86.118 మీటర్ల విస్తీర్ణం.				

సెక్యూర్డు ఆస్తుల విమోచనానికి అందుబాటులోవున్న సమయానికి సంబంధించి చట్టంలోని సెక్షన్ 13యొక్క ఉప-సెక్షన్ (8) నియమాలను అనుసరించి రుణగ్రహీత యొక్క శ్రద్ధను కోరుతున్నారు. ప్రధానంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలను ఇందుమూలంగా హెచ్చరించడమేమనగా, సదరు ఆస్తితో ఏవిధమైన లావాదేవీలు జరుపరాదని మరియు ఆస్తితో ఏవేని లావాదేవీలు జరుపదలచిన వారు **ఇడెల్‌వీస్ అసెట్ రీకన్‌స్ట్రక్షన్స్ కంపెనీ లిమిటెడ్** వారికి దిగువ పేర్కొన్న మొత్తాలు మరియు దానిపై వడ్డీతోసహా చెల్లించుటకు లోబడి ఉంటుంది.

ప్రదేశం: ఆంధ్రప్రదేశ్ **సం/- అధీకృత అధికారి,**
తేది: 25-03-2025 **ఇడెల్‌వీస్ అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్**

Edelweiss
Asset Reconstruction

అలహాబాద్ హైకోర్టుకే యశ్వంత్ వర్మ

- **బదిలీని నిర్ధారించిన సుప్రీంకోర్టు కొలీజియం**
- **కేంద్రం ఆమోదం తర్వాతే అమలులోకి**




న్యూఢిల్లీ : తన అధికారిక నివాసంలో భారీ ఎత్తున నోట్ల కట్టలు బయటపడిన వ్యవహారంలో ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ బదిలీని సుప్రీంకోర్టు కొలీజియం నిర్ధారించింది. ఆయనను అలహాబాద్ హైకోర్టుకు ట్రాన్స్‌ఫర్ చేయడాన్ని ధ్రువీకరించింది. అగ్నిప్రమాద ఘటన సందర్భంగా ఆయన అధికారిక నివాసంలో కాలిన నోట్ల కట్టలు భారీగా బయటపడటంతో, ఆయనను అలహాబాద్ హైకోర్టుకు ట్రాన్స్‌ఫర్ చేయాలని సుప్రీంకోర్టు కొలీజియం ఇప్పటికే ప్రతిపాదించింది. దీనిని ఇప్పుడు ధ్రువీకరించింది. ప్రతిపాదిత బదిలీ సిఫారసును కేంద్రం ఆమోదించిన తర్వాత ఆయన ట్రాన్స్‌ఫర్ అమలులోకి వచ్చే అవకాశముంది.

కేంద్రానికి చేసిన ఈ బదిలీ సిఫారసును సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసిన తీర్మానంలో బహిరంగంగా ప్రకటించింది. "సుప్రీంకోర్టు కొలీజియం మార్చి 20, 24 తేదీల్లో జరిగిన సమావేశాల్లో ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మను అలహాబాద్ హైకోర్టుకు పంపాలని సిఫారసు చేసింది" అని తీర్మానం పేర్కొంది. ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి డి.కె ఉపాధ్యాయ.. జస్టిస్ వర్మపై అంతర్గత విచారణ ప్రారంభించారనీ, ఆయనను బదిలీ చేసే ప్రత్యేక ప్రతిపాదన ఉన్నదని సుప్రీంకోర్టు ఈనెల 21న తెలిపింది. జస్టిస్ యశ్వంత్ వర్మ నివాసంలో జరిగిన సంఘటనకు సంబంధించిన తప్పుడు సమాచారం, పుకార్లు వ్యాప్తి చెందుతున్నాయని వివరించింది. సమాచారం అందిన తర్వాత ప్రధాన న్యాయమూర్తి ఉపాధ్యాయ అంతర్గత విచారణ ప్రక్రియ ప్రారంభించారని, ఆధారాలు, సమాచారాన్ని సేకరించారని తెలిపింది. మార్చి 20న సుప్రీంకోర్టు కొలీజియం సమావేశానికి ముందే జస్టిస్ ఉపాధ్యాయ విచారణ ప్రారంభించారని చెప్పింది.

కొలీజియం నిర్ణయంపై దుమారం

అలహాబాద్ హైకోర్టుకు జస్టిస్ వర్మను బదిలీ చేస్తూ సుప్రీంకోర్టు కొలీజియం తీసుకున్న నిర్ణయంపై ఇప్పటికే దుమారం చెలరేగింది. అలహాబాద్ హైకోర్టు బార్ అసోసియేషన్.. దీనిపై తీవ్రంగా ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. అవినీతి ఆరోపణలున్న యశ్వంత్‌ను ఇక్కడకు ఎలా బదిలీ చేస్తారని నేరుగా సీజేఐకి లేఖ రాసింది. ఆ 'చెత్త' మాకొద్దంటూ తీవ్ర పదజాలాన్ని వినియోగించింది.

ఈనెల 14న రాత్రి 11.35 గంటల ప్రాంతంలో లుటియన్స్ ఢిల్లీలోని జస్టిస్ యశ్వంత్ వర్మ నివాసంలో జరిగిన అగ్నిప్రమాదం తర్వాత కాలిన నోట్ల కట్టలు పెద్ద ఎత్తున బయటపడ్డాయని ఆరోపణలు వచ్చిన విషయం విదితమే. సిజెఐ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని సుప్రీంకోర్టు కొలీజియం, ఢిల్లీ హైకోర్టు.. జస్టిస్ వర్మకు న్యాయపరమైన విధులు కేటాయించకుండా వరుస ఆదేశాలు జారీ చేశాయి. విచారణ కోసం సిజెఐ అంతర్గత కమిటీని ఏర్పాటు చేశారు. జస్టిస్ యశ్వంత్ వర్మకు ఎలాంటి న్యాయపరమైన విధులను అప్పగించవద్దని ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి డి.కె ఉపాధ్యాయను ఆదేశించారు.

జస్టిస్ యశ్వంత్ వర్మకు షాక్
న్యాయపరమైన విధుల అప్పగింతపై ఢిల్లీ హైకోర్టు

జస్టిస్ యశ్వంత్ వర్మకు మరో షాక్ తగిలింది. ఆయనకు న్యాయపరమైన విధులను దూరంగా ఉంచుతూ ఢిల్లీ హైకోర్టు నిర్ణయం తీసుకున్నది. ఆయన జ్యుడీషియల్ వర్క్‌ను తక్షణమే ఉపసంహరించుకున్నది. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు ఈ నిర్ణయం అమలులో ఉంటుందని వివరించింది. యశ్వంత్ వర్మ నేతృత్వంలోని డివిజన్ బెంచ్-3 కోర్ట్ మాస్టర్.. ఆ రోజు చేపట్టాల్సిన విషయాలలో తేదీలను ఇస్తారని పేర్కొన్నది.

ఆర్‌జి కర్ హత్యాచారం కేసు డైరీ ఇవ్వండి

- **సిబిఐకి కోల్‌కతా హైకోర్టు ఆదేశం**

కోల్‌కతా : ఆర్‌జి కర్ ఆసుపత్రిలో విధుల్లో ఉన్న మెడికోపై అత్యాచారం, హత్య ఘటన విచారణకు సంబంధించిన కేసు డైరీని ఈ నెల 28 నాటికి తమకు అందజేయాలని సిబిఐను కోల్‌కతా హైకోర్టు సోమవారం ఆదేశించింది. ఈ కేసులో సామూహిక అత్యాచారం లేదా సాక్ష్యాధారాలను నాశనం చేయడం అనే కోణాలపై విచారణ నిర్వహిస్తున్నారా.. అని సిబిఐను హైకోర్టు ప్రశ్నించింది. కోర్టు పర్యవేక్షణలో ఈ కేసు విచారణ సాగాలని కోరుతూ బాధితురాలి తల్లిదండ్రులు వేసిన పిటిషన్‌ను హైకోర్టు విచారిస్తుంది. ట్రయిల్ కోర్టులో చార్జిషీట్ సమర్పించిన సమయంలో ఈ కేసులో పెద్ద కుట్ర ఉందని సిబిఐ పేర్కొనట్లుగానూ పిటిషన్‌దారులు గుర్తు చేశారు. ఈ కేసులో మరింత దర్యాప్తు జరగాలని పిటిషన్‌దారులు అభ్యర్థించారు ఈ పిటిషన్‌ను విచారించిన జస్టిస్ తీర్థంకర్ ఘోష్ 'సిబిఐ అందజేసే విచారణ స్టేటస్ రిపోర్టును పరిశీలించిన తరువాత నిర్ణయం తీసుకుంటాం' అని తెలిపారు. గతేడాది ఆగస్టులో జరిగిన ఈ దారుణం దేశవ్యాప్తంగా నిరసనలకు దారి తీసిన సంగతి తెలిసిందే.

భారత్‌పై ట్రంప్ సుంకాల దాడి

- **భాగస్వాములైన అమెరికా వాణిజ్య సంస్థలు**

వాషింగ్టన్ : భారత్‌పై అమెరికా అధ్యక్షులు ట్రంప్ సుంకాల దాడిలో అక్కడి వాణిజ్య సంస్థలు కూడా భాగస్వామ్యమయ్యాయి. అమెరికా ఎగుమతులను పెంచేందుకు, టారిఫ్స్, నాన్ టారిఫ్‌లు, నియంత్రణ అడ్డంకులను తగ్గించాలని భారత్‌ను ఒత్తిడి చేయాల్సిందిగా అమెరికా పరిశ్రమ సంఘాలు, కంపెనీలు ట్రంప్ ప్రభుత్వాన్ని కోరాయి. యుఎస్ చాంబర్ ఆఫ్ కామర్స్ (యుఎస్‌సిసి), కొలైషన్ ఆఫ్ సర్వీసెస్ ఇండస్ట్రీస్ (సిఎస్ఐ) మరియు ప్రముఖ బైక్ కంపెనీ హార్లే డేవిడ్సన్ వంటివి ఈ జాబితాలో ఉన్నాయి. ఏప్రిల్ 2న పరస్పర సుంకాల విధింపు ప్రకటనకు ముందు అమెరికా వాణిజ్య ప్రతినిధి (యుఎస్‌టిఆర్)కి ఈ మేరకు విజ్ఞప్తి చేశాయి. భాగస్వామ్య దేశాల చట్టవ్యతిరేక వాణిజ్య పద్ధతులపై యుఎస్‌టిఆర్ ఇటీవల సమీక్ష చేపట్టిన సంగతి తెలిసిందే.

భారత వినియోగదారులకు అవసరమైన ఔషధాలను తక్కువ ధరలకు పొందేందుకు వీలుగా, ఆరోగ్య సంరక్షణ రంగంలో వాణిజ్యాన్ని, పెట్టుబడులను ప్రోత్సహించేలా ఔషధ తయారీ ఉత్పత్తులపై భారత్ దిగుమతి సుంకాలను తగ్గించాలని అమెరికాలోని అతిపెద్ద వాణిజ్య సంప్రదింపుల సంస్థ యుఎస్ఎస్‌సిసి కోరింది. ప్రపంచ సరఫరా గొలుసును బలోపేతం చేసే ఔషధ తయారీకి రెండవ స్థానంలోకి అనుమతించే నిబంధనలను చేర్చడానికి అవసరమైన వాణిజ్య ఒప్పందాన్ని కూడా కోరింది. పేటెంట్ పొందిన మందులు, స్టెంట్లు, మోకాలి ఇంప్లాంట్స్ వంటి వైద్య పరికరాలపై జాతీయ ప్రాముఖ్య మెడిసిన్స్ జాబితా కింద ధరల నియంత్రణను, భారత్‌లో మెడిసిన్ తయారీ ఉత్పత్తుల పెట్టుబడులను నిరోధించే వాణిజ్య విధానాలను, నకిలీ మెడిసిన్ ముప్పును కూడా యుఎస్‌సిసి ప్రస్తావించింది. సిటిస్కానర్లు, ఇతర అధునాతన శస్త్రచికిత్సకు అవసరమైన పునరుద్ధరించబడిన /పునర్వినియోగించిన వైద్య పరికరాల దిగుమతిని భారత్ అనుమతించాలని కోరింది. అమెరికన్ కంపెనీల లాభదాయకతను ప్రతికూలంగా ప్రభావితం చేసే సిన్ /డిమెరిట్ వస్తువుల వర్గీకరణ కింద ఆల్కహాల్ లేని పానీయాలపై 28 శాతం జిఎస్‌టిని తగ్గించాలని యుఎస్‌సిసి కోరింది. వివిధ దేశాల్లో అమెరికా తయారీ మోటార్‌సైకిల్స్ దిగుమతి సుంకాలు అసమానతను హార్లే డేవిడ్‌సన్ కంపెనీ ప్రస్తావించింది. మోటార్‌సైకిల్స్‌పై యూరోపియన్ యూనియన్‌లో 6-8 శాతం సుంకం చెల్లిస్తుండగా, బ్రెజిల్‌లో 18 శాతం, థాయ్‌లాండ్‌లో 60 శాతం ఉండగా, భారత్‌లో ఈ సుంకం రేటు 100 శాతంగా ఉందని స్పష్టం చేసింది.

బుకాయిస్తారా?

- **విడదల రజినిపై ఎంపి శ్రీకృష్ణదేవరాయలు**

ప్రజాశక్తి-న్యూఢిల్లీబ్యూరో

మాజీ మంత్రి విడదల రజిని క్రషర్ యజమానులను భయపెట్టి డబ్బులు వసూలు చేసి, ఇప్పుడు బుకాయిస్తున్నారని ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. సోమవారం నాడిక్కడ ఆయన మీడియాతో మాట్లాడుతూ.. విడుదల రజిని ఒత్తిడితోనే స్టోన్ క్రషర్స్‌పై భారీగా జరిమానా వేయబోయారనేది నిజం కాదా? అని ప్రశ్నించారు. 40 ఏళ్ల నుంచి విద్యాసంస్థలు నడుపుతున్న తాము ఏనాడూ భూములు కావాలని ప్రభుత్వాలను అడిగింది లేదని అన్నారు. అందరితో పాటు తాము భూముల వేలంలో పాల్గొన్నామని, ఎక్కువ ధరకు తీసుకున్నామని చెప్పారు. ఒకరిని విమర్శించే ముందు వివరాలన్నీ తెలుసుకోవాలని హితవు పలికారు. 'నాడు అధికారం అడ్డం పెట్టుకుని విడదల రజిని ఐపిఎస్ అధికారులను బెదిరించారు. లక్ష్మీబాలాజీ స్టోన్ క్రషర్స్‌తో నాకు ఎలాంటి బంధుత్వం లేదు. 2021 ఆగస్టు 24న మీ నుంచే ఒక ఫిర్యాదు వచ్చింది. లక్ష్మీబాలాజీ స్టోన్ క్రషర్స్‌లో అక్రమాలు ఉన్నాయని మీరే ఫిర్యాదు చేశారు. బాలినేని శ్రీనివాసరెడ్డి దగ్గరికి సాక్షి రిపోర్టర్ మాధవరెడ్డిని తీసుకొని వెళ్లింది మీరు కాదా? ఐపిఎస్ అధికారులను బెదిరించింది మీరు కాదా? అక్రమాలు చేసింది మీరు. రెడ్ బుక్ అంటూ మళ్లీ బుకాయింపులా' అని ప్రశ్నించారు.

న్యాయవాదుల సంక్షేమానికి చర్యలు

ప్రజాశక్తి-అమరావతి

రాష్ట్ర బార్ కౌన్సిల్ ఛైర్మన్ ఎన్ ద్వారకనాథ్‌రెడ్డి ఆధ్వర్యాన న్యాయవాదుల సంక్షేమం కోసం పలు నిర్ణయాలు తీసుకుంది. అడ్వకేట్ మరణిస్తే వారి నామినీలకు చెల్లించే పరిహారాన్ని రూ.5 లక్షల నుంచి రూ.6 లక్షలకు పెంపుదల చేసింది. ఈ ఏడాది ఏప్రిల్ ఒకటి నుంచి అమల్లోకి రానుంది. న్యాయవాదులు, వారి కుటుంబ సభ్యులకు వైద్య సాయం మొత్తాన్ని రూ.లక్ష నుంచి రూ.1.5 లక్షలకు పెంచింది. అదే రీతిలో బార్ కౌన్సిల్ రోల్స్‌లో నమోదు చేసుకున్న న్యాయవాదులు ప్రమాదవశాత్తు మరణిస్తే వారి కుటుంబ సభ్యులకు రూ.5 లక్షలు పరిహారం చెల్లించాలని నిర్ణయం తీసుకుంది. ఈ మొత్తాలను బార్ కౌన్సిల్ నిధుల్లోంచి చెల్లింపులు ఉంటాయి. కౌన్సిల్ ఛైర్మన్ నల్లారి ద్వారకనాథరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకుంది. గుంటూరుకు చెందిన ప్రముఖ సీనియర్ న్యాయవాది, తెలుగు సాహిత్య రంగంలో ఎంతో పేరు పొందిన పెనుగొండ లక్ష్మీ నారాయణను ఘనంగా సన్మానించారు. తెలుగు భాషకు, సాహిత్యానికి చేసిన అసాధారణమైన సేవలకు గానూ కేంద్ర సాహిత్య అకాడమీ నుండి 2024 సంవత్సరానికి 'కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం' అందుకున్న సందర్భంగా ఆయన్ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిల్ వైస్ ఛైర్మన్ ఎస్ కృష్ణమోహన్, సభ్యులు వట్టిజొన్నల బ్రహ్మారెడ్డి, ఎస్ బ్రహ్మానందరెడ్డి, గంటా రామారావు, వజ్జా శ్రీనివాసరావు, రోళ్ల మాధవి, రావిగువేరా, కార్యదర్శి పద్మలత తదితరులు పాల్గొన్నారు.

2024 ఎన్నికల ఖర్చు రూ.3,861 కోట్లు!

- **ఆదాయంలో 85 శాతం, వ్యయంలో 45 శాతం బిజెపిదే**

న్యూఢిల్లీ : ఎన్నికల్లో విజయం సాధించడానికి రాజకీయ పార్టీలు విచ్చలవిడిగా డబ్బు ఖర్చు చేస్తున్న సంగతి తెలిసిందే. ఎన్నికలు ఏవైనా వ్యయం మాత్రం కొండలా పెరిగిపోతూనే ఉంది. గత సంవత్సరం దేశంలో ఐదు ఎన్నికలు జరిగాయి. వీటికి అయిన ఖర్చు అక్షరాలా రూ.3,861 కోట్లు. లోక్‌సభ ఎన్నికలకే రూ.1.35 లక్షల కోట్లు ఖర్చు చేశారని సెంటర్ ఫర్ మీడియా స్టడీస్ సంస్థ నిర్వహించిన అధ్యయనం తెలిపింది. ఇది అనధికారిక అంచనా. మరి లోక్‌సభ ఎన్నికలతో పాటు ఆంధ్రప్రదేశ్, ఒడిషా, అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం రాష్ట్రాల శాసనసభలకు జరిగిన ఎన్నికల కోసం రాజకీయ పార్టీలు చేసిన ఖర్చుపై ఎన్నికల కమిషన్ వెల్లడించిన అధికారిక లెక్కలు ఎలా ఉన్నాయి?


రాజకీయ పార్టీలు తమ ఆదాయాన్ని, వ్యయాన్ని తెలియజేస్తూ ఎన్నికల కమిషన్‌కు నివేదికలు అందిస్తుంటాయి. అందులో పూర్తి వివరాలు ఉండవు. కొన్ని జమాఖర్చులను రహస్యంగా ఉంచుతాయి. వివిధ రాజకీయ పార్టీలు ఎన్నికల కమిషన్‌కు సమర్పించిన వివరాల ఆధారంగా కామన్వెల్త్ హ్యూమన్ రైట్స్ ఇనిషియేటివ్ (సిహెచ్‌ఆర్‌ఐ) అనే సంస్థ ఇటీవల ఓ అధ్యయనం జరిపింది. అధికారం కోసం రాజకీయ పార్టీలు ఎన్నికలలో ఏ స్థాయిలో విచ్చలవిడిగా డబ్బును ఖర్చు చేస్తాయో ఈ అధ్యయనం బయటపెట్టింది. ఆదాయంలోనే కాదు... ఖర్చులోనూ అధికార బిజెపిదే పైచేయి. అధికార గణాంకాల అధ్యయనం ప్రకారం కేవలం 22 పార్టీలు రూ.18,742.31 కోట్లు ఖర్చు చేశాయి. వీటిలో ఆమ్ ఆద్మీ, అసోం గణపరిషత్, అన్నా డిఎంకె, మజ్లిస్, తృణమూల్ కాంగ్రెస్, ఆల్ ఇండియా యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్, బిజెడి, బిజెపి, బిఎస్‌పి, సిపిఎం, డిఎంకె, కాంగ్రెస్, జెడిఎస్, జెడియు, ఎల్‌జెపి (రాం విలాస్), ఆర్‌జెడి, సమాజ్‌వాదీ, సిక్కిం డెమొక్రటిక్ ఫ్రంట్, సిక్కిం క్రాంతికారి మోర్చా, టిడిపి, వైసిపి ఉన్నాయి. ఇవన్నీ ఎన్నికల కోసం రూ.3,861.57 కోట్లు ఖర్చు చేయగా ఒక్క బిజెపియే రూ.1,737.68 కోట్లు... అంటే మొత్తం వ్యయంలో 45 శాతం ఖర్చు చేసింది. అన్ని పార్టీలకూ కలిపి రూ.7,416.31 కోట్లు విరాళాల రూపంలో అందగా, అందులో 84.5 శాతం బిజెపి ఖాతాకే చేరాయి. కేవలం ఏడు పార్టీలు అందజేసిన వివరాల ప్రకారం ప్రింట్, టీవీ, డిజిటల్ వేదికల ద్వారా మీడియా ప్రకటనల కోసం రూ.992.48 కోట్లు, సోషల్ మీడియా, వర్చువల్ ప్రచారం కోసం రూ.196.23 కోట్లు ఖర్చు చేశారని సీహెచ్‌ఆర్‌ఐ డైరెక్టర్ వెంకటేష్ నాయక్ తెలిపారు. స్టార్ క్యాంపెయినర్ల హెలికాప్టర్, ప్రైవేటు జెట్ల ప్రయాణాలకు రూ.830.15 కోట్లు ఖర్చయ్యాయి. ఇక బ్యానర్లు, హోర్డింగులు, పోస్టర్లు, ఇతర ప్రచార సామగ్రి నిమిత్తం రూ.398.49 కోట్లు ఖర్చు చేశారు. వివిధ రాజకీయ పార్టీలకు నగదు ఎలా లభించింది అని అడిగిన ప్రశ్నకు వెంకటేష్ నాయక్ సమాధానమిస్తూ 'జవాబు దొరకని ప్రశ్నలు అనేకం ఉన్నాయి. ఎన్నికలు ముగిసిన తర్వాత పార్టీల ఖాతాలలో రూ.14.848.46 కోట్లు నిల్వ ఉన్నాయి. ఈ అదనపు సొమ్ము ఎక్కడికి పోతుంది? బీజేపీ సహా ఆరు పార్టీల వద్ద ఎన్నికల ప్రారంభంలో కంటే ముగిసిన తర్వాతే ఎక్కువ సొమ్ము ఉంది. ఇది ఎలా సాధ్యం? జెఎంఎం, శివసేన, శిరోమణి అకాలీదళ్ సహా అనేక పార్టీలు తమ ఖర్చుల వివరాలే ఇవ్వలేదు' అని చెప్పారు.'ఈ లెక్కల్ని చూస్తుంటే ఒక విషయం స్పష్టమవుతోంది. దేశంలో ఎన్నికలు ఇంకెంతో కాలం ప్రజాస్వామ్యం గురించి జరగబోవు. అవి ధనాన్ని విచ్చలవిడిగా వెదజల్లే యుద్ధ క్షేత్రాలుగా మారతాయి. రాజకీయ పార్టీలు ఈ విధంగా డబ్బును మంచినీళ్ల మాదిరిగా ఖర్చు చేస్తుంటే సామాన్య మానవుడి మనసులో ఓ ప్రశ్న మెదులుతుంది. ఈ డబ్బంతా ఎక్కడి నుండి వస్తోంది? చివరికి ప్రయోజనం పొందేది ఎవరు?. ఏదేమైనా ఎన్నికలలో ఓట్లు కాదు... డబ్బే నిర్ణయాత్మక పాత్ర పోషించబోతోంది. భారత రాజకీయ భవితవ్యాన్ని నిర్ణయించబోయేది డబ్బే. ఈ ధన ప్రవాహాన్ని ఎన్నికల కమిషన్ అడ్డుకోగలదా? లేదా ధనబలం, గోప్యత ఇలా కొనసాగుతాయా? అనేదే తేలాల్సి ఉంది' అని వెంకటేష్ నాయక్ చెప్పారు.

ఇజ్రాయిల్ దాడుల్లో 61మంది మృతి

గాజా : దక్షిణ గాజా ప్రాంతంపై ఇజ్రాయిల్ మిలటరీ నిరంతరంగా కొనసాగిస్తున్న బాంబు దాడుల్లో గత 24గంటల్లో 61మంది మరణించారు. శిథిలాల నుండి నాలుగు మృత దేహాలను వెలికితీశారు. కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి గత మంగళవారం ఇజ్రాయిల్ దాడులను పునరుద్ధరించిన తర్వాత ఇప్పటి వరకు 730మంది మరణించారని, 1367మంది గాయపడ్డారని ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. రఫా నగరంలో జరిగిన దాడుల్లో ఆరుగురు పాలస్తీనా పారా మెడికల్ సిబ్బంది గల్లంతయ్యారు. ఆదివారం రఫా నగరాన్ని ఇజ్రాయిల్ బలగాలు చుట్టుముట్టడంతో వేలాదిమంది ప్రజలు లోపల చిక్కుకుపోయారు. తీర ప్రాంతం పొడవునా తాత్కాలిక శిబిరాలతో వున్న అల్ మావసి ప్రాంతానికి కాలి నడకన వెళ్లిపోవాల్సిందిగా ప్రజలను ఆర్మీ ఆదేశించింది. చాలామంది ఇజ్రాయిల్ సైనికుల చేతుల్లో చిక్కుకుపోయారు. వేలాదిమంది పాలస్తీనియన్లతో సంబంధాలు తెగిపోయాయని రఫా మున్సిపాలిటీ ప్రకటించింది. సెంట్రల్ గాజాలోని నుస్రత్ శిబిరంలో ఒక స్కూల్లో ఏర్పాటు చేసిన నిర్వాసితుల శిబిరంపై జరిగిన వైమానిక దాడిలో ఇద్దరు చిన్నారులతో సహా నలుగురు మరణించారు. మరో 18మంది గాయపడ్డారు. నజర్ ఆస్పత్రిలోని సర్జికల్ భవనంపై ఆదివారం రాత్రి దాడి జరిగిందని, ఇటువంటి దాడుల్లో సామాన్యులే మరణిస్తున్నారని గాజా ఆరోగ్య శాఖ తెలిపింది.

పార్లమెంట్‌లో పాలక బిజెపి రభస

- డికె శివకుమార్ వ్యాఖ్యలపై స్తంభింపజేసిన కమలం పార్టీ
- జడ్జి నివాసంలో కరెన్సీ కట్టలపై చర్చ జరగకుండా చేసేందుకేనన్న ప్రతిపక్షాలు
- వ్యాఖ్యలను వక్రీకరించారన్న కాంగ్రెస్



రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ నారాయణ సింగ్, సభలో మాట్లాడుతున్న ఖర్గే

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కర్ణాటకలో ముస్లిం రిజర్వేషన్లకు సంబంధించి కర్ణాటక డిప్యూటీ సిఎం డికె శివకుమార్ చేసిన వ్యాఖ్యలపై పాలక బిజెపి పార్లమెంటును స్తంభింపజేసింది. రిజర్వేషన్ల కోసం రాజ్యాంగాన్నైనా మార్చడానికి వెనుకాడబోనని శివకుమార్ వ్యాఖ్యానించారని ఆరోపిస్తూ అధికార బిజెపి సభ్యులు పార్లమెంట్ ఉభయ సభల్లో గందరగోళం సృష్టించారు. అవసరమైతే రాజ్యాంగంలో మార్పులు చేస్తామని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చేసిన ప్రకటన రాజ్యాంగ ఉల్లంఘన అని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు రాజ్యసభలో విమర్శించారు. మత ఆధారిత రిజర్వేషన్ల కోసం రాజ్యాంగాన్ని మారుస్తామనడం చాలా తీవ్రమైన అంశమని, ఇలాంటి వివాదాస్పద వ్యాఖ్యలపై కాంగ్రెస్ వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాజ్యసభ ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ, అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగాన్ని ఎవరూ మార్చలేరని అన్నారు. రిజర్వేషన్లపై శివకుమార్ చేసిన ప్రకటనను బిజెపి వక్రీకరించిందని విమర్శించారు. బిజెపి సభ్యులు పట్టు వదలకుండా పదే పదే ఆందోళనలకు దిగుతూ బిగ్గరగా నినాదాలు చేయడంతో రాజ్యసభ మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా పడింది. లోక్‌సభలో కూడా పాలక సభ్యులు తీవ్ర గందరగోళం సృష్టించారు. న్యాయమూర్తి ఇంట్లో 'కరెన్సీ నోట్ల' కనుగొనడం సహా పలు ముఖ్యమైన అంశాలపై చర్చ జరగకుండా అడ్డుకోవడానికే బిజెపి ఈ అంశాలను రెచ్చగొడుతోందని ప్రతిపక్షం విమర్శించింది. పాలక పక్షమే పార్లమెంటు కార్యకలాపాలను స్తంభింపజేయడం కొత్త ధోరణిగా వుందని ప్రతిపక్ష సభ్యులు విమర్శించారు.

ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి నివాసంలో నోట్ల కట్టలు దొరికిన సంఘటనపై చర్చ జరపాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఎంపి వి.శివదాసన్‌తో సహా ఇతర ప్రతిపక్ష ఎంపిలు నోటీసు జారీ చేశారు. సభా నాయకుడు జెపి నడ్డా, ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గేలతో రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖర్ దీనిపై చర్చించారు. సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం కొట్టివేసిన జాతీయ న్యాయ నియామకాల కమిషన్ (ఎన్‌జెఎసి) చట్టం, న్యాయమూర్తుల నియామక ప్రక్రియపై ఈ సమావేశంలో చర్చించారు. ఉత్తరప్రదేశ్‌లో యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వ హయాంలో నేరాల పెరుగుదలను నిరసిస్తూ సమాజ్‌వాదీ పార్టీ సభ్యులు లోక్‌సభకు పోస్టర్లతో రావడంతో స్పీకర్ ఓం బిర్లా ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మీరు సభకు పోస్టర్లను తీసుకురావద్దు. దయచేసి సహకరించండి. మీరు సభలో పోస్టర్లను ప్రదర్శిస్తే నేను మీపై చర్య తీసుకోవాల్సి వస్తుంది' అని అన్నారు. గత పది బడ్జెట్లలోనూ పంజాబ్‌ను అసలు పరిగణనలోకి తీసుకోవడం లేదని శిరోమణి అకాలీదళ్ ఎంపి హర్‌సిమ్రత్ కౌర్ బాదల్ విమర్శించారు. అసలు భారతదేశ చిత్రపటంలో పంజాబ్ లేదనుకుంటా, దేశం కోసం ఎంతో పాటుపడిన రాష్ట్రాన్ని ఈనాడు పట్టించుకోవడం లేదని అన్నారు.

నా వ్యాఖ్యలను వక్రీకరించారు : డి.కె.శివకుమార్

మతం ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించేందుకు వీలుగా రాజ్యాంగాన్ని మారుస్తానంటూ తాను వ్యాఖ్యానించలేదని డిప్యూటీ సిఎం శివకుమార్ స్పష్టం చేశారు. తన వ్యాఖ్యలను బిజెపి నేతలు వక్రీకరించారని చెప్పారు. బెంగళూరులో సోమవారం మీడియాతో మాట్లాడుతూ ఆయన, గత 36ఏళ్లుగా తాను అసెంబ్లీలో వున్నానని, తనకు కామన్‌సెన్స్ వుందని, అటువంటి వ్యాఖ్యలు చేయలేదని అన్నారు. వివిధ తీర్పుల తర్వాత అనేక మార్పులు జరుగుతాయని చాలా సాధారణమైన రీతిలో వ్యాఖ్యానించానని, అంతేకానీ మేం రాజ్యాంగాన్ని మార్చబోతున్నామని అనలేదని చెప్పారు. వారు చెప్పేదంతా అబద్ధమేనన్నారు. తమది జాతీయ పార్టీ అని, రాజ్యాంగమంటే ఏమిటో తమకు తెలుసునన్నారు. తన వ్యాఖ్యలను తప్పుగా భాష్యం చెప్పారన్నారు. దీనిపై తాను సభా హక్కుల నోటీసు ఇస్తానని, దీనిపై పోరాడతానని అన్నారు.

ఎంపిల జీతాలు 24 శాతం పెంపు

- 2023 ఏప్రిల్ 1 నుంచి పెంపు వర్తింపు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఎంపిల జీతాలు 24శాతం పెంచుతూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు సోమవారం కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిత్వశాఖ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ పెంపును 2023 ఏప్రిల్ ఒకటి నుంచి అమలు చేస్తారు. పార్లమెంట్ సభ్యుల జీతాలు, డైలీ అలవెన్సెస్, పెన్షన్, అదనపు పెన్షన్‌లలో కేంద్ర ప్రభుత్వం కీలక మార్పులు చేసింది. వాటిని పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం పార్లమెంట్ సభ్యుల జీతం రూ.లక్షగా ఉంది. దాన్ని ఏకంగా రూ.1.24 లక్షకు పెంచింది. డైలీ అలవెన్సెస్‌ను రూ.2 వేల నుంచి రూ.2,500లకు పెంచింది. మాజీ సభ్యులకు ప్రతినెలా రూ.25 వేల పెన్షన్ అందుతోంది. దాన్ని రూ.31 వేలకు పెంచింది. మాజీ సభ్యుల అదనపు పెన్షన్‌లోనూ మార్పులు చేసింది. దాన్ని రూ.2 వేల నుంచి రూ.2,500లకు పెంచింది. ఈ పెంపు 2023 ఏప్రిల్ ఒకటి నుంచి వర్తిస్తుందని తెలిపింది.

రోడ్డు రవాణా కార్మికుల 'పార్లమెంట్' మార్చ్

- మే 20న సమ్మెలోకి కార్మికులు



పార్లమెంట్ మార్చ్‌లో మాట్లాడుతున్న తపన్‌సేన్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రోడ్డు రవాణా రంగాన్ని ఏకస్వామ్యంగా మార్చాలనే కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలనే డిమాండ్లతో సహా వివిధ డిమాండ్లను లేవనెత్తుతూ ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎఐఆర్‌టిడబ్ల్యుఎఫ్) 'చలో పార్లమెంట్' మార్చ్‌ను నిర్వహించింది. మణిపూర్, జమ్మూ కాశ్మీర్ సహా 23 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుండి వేలాది మంది రోడ్డు రవాణా కార్మికులు ఈ మార్చ్‌లో పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా మే 20న కార్మిక సంఘాలు నిర్వహించనున్న జాతీయ సమ్మెలో భారీ విజయం సాధించాలని పార్లమెంట్ మార్చ్ పిలుపునిచ్చింది. రవాణా కార్మికులు సమ్మెలో పూర్తిగా పాల్గొంటారని ప్రకటించింది.

సిఐటియు ప్రధాన కార్యదర్శి తపన్ సేన్ మాట్లాడుతూ.. ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాన్ని తీవ్రతరం చేయాలని పిలుపునిచ్చారు. అంతేకాకుండా మే 20న నాలుగు కార్మిక కోడ్‌లకు వ్యతిరేకంగా జరిగే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. సిఐటియు జాతీయ కార్యదర్శి కరుమలయన్ మాట్లాడుతూ.. రోడ్డు రవాణా రంగ కార్మికులు చేపట్టే పోరాటలకు సిఐటియు పూర్తి మద్దతుగా ఉంటుందని అన్నారు. డిఎంకె ఎంపి షణ్ముగం, సిపిఎం ఎంపిలు అమ్రారామ్, సచ్చిదానందం, సిపిఐ(ఎంఎల్) ఎంపి సుధామ ప్రసాద్ మాట్లాడుతూ.. రవాణా కార్మికుల పోరాటానికి తమ మద్దతును ప్రకటించారు. పార్లమెంటులో సమస్యలను లేవనెత్తడానికి ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు.

ఎఐఆర్‌టిడబ్ల్యుఎఫ్ ప్రధాన కార్యదర్శి ఆర్ లక్ష్మయ్య మాట్లాడుతూ.. డిమాండ్లను వివరించారు. కార్మికులు 'మే 20 సమ్మెను విజయవంతం చేయాలనే' నినాదంతో ఆమోదించారు. 2024 డిసెంబర్‌లో కేంద్ర రోడ్డు రవాణా మంత్రి నితిన్ గడ్కరీని కలిసి తమ డిమాండ్లను లేవనెత్తినప్పటికీ, పరిష్కారం లేదన్నారు. రోడ్డు రవాణాకు సంబంధించిన ఇతర సంఘాలతో చర్చలు జరుగుతున్నాయని, మరికొన్ని మే 20 సార్వత్రిక సమ్మెలో చేరడానికి ఐక్యంగా పోరాడటానికి అంగీకరించాయని ఆయన అన్నారు.

అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరల తగ్గుదలకు అనుగుణంగా డీజిల్ ధరలను తగ్గించడం, థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ ప్రీమియం పెంపును నివారించడం, టోల్ రేట్లను తగ్గించడం, ఏకస్వామ్య చర్యను తిప్పికొట్టడం, ఓలా, ఉబర్ వంటి గుత్తాధిపత్య సంస్థల రవాణా రంగంలో శ్రమ దోపిడీని అంతం చేయడం, రోడ్డు రవాణా కార్మికులకు సామాజిక భద్రత కల్పించడం, కార్మిక చట్టాలకు అనుగుణంగా ఉండేలా చూసుకోవడం వంటి డిమాండ్లను పార్లమెంట్ మార్చ్ లేవనెత్తింది. డిమాండ్లను వివరించే వినతిపత్రాన్ని ప్రధాన మంత్రికి పంపించారు. పార్లమెంట్ మార్చ్‌లో కెకె దివాకరన్, నేపాల్‌దేవ్ భట్టాచార్య, కడకంపల్లి సురేంద్రన్, జిబన్ సాహా తదితరులు పాల్గొన్నారు.

హేబిటేట్ స్టూడియో కూల్చివేత

- స్టాండప్ కమేడియన్ కునాల్‌పై కక్షసాధింపు
- క్షమాపణ చెప్పాలన్న సిఎం... కోర్టులు ఆదేశిస్తేనే చెప్తానన్న క్రమా
- మూక హింసే వారి మార్గం : సిపిఎం ఖండన
- మూతబడిన స్టూడియో, క్రమాపై ఎఫ్ఐఆర్



హేబిటేట్ స్టూడియోలో పలు భాగాలను కూల్చివేస్తున్న బిఎంసి అధికారులు (ఇన్‌సెట్‌లో) కునాల్ క్రమా

ముంబయి : మహారాష్ట్ర డిప్యూటీ ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండేపై క్రమా ఇటీవల చేసిన వ్యాఖ్యలపై నానా రభస చేసిన కమలం పార్టీ, శివసేన (షిండే గ్రూపు) నేతలు తాజాగా కక్షసాధింపు చర్యలకు దిగారు. బృహన్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ (బిఎంసి) సిబ్బంది ముంబయిలోని క్రమా షో ప్రదర్శించిన హేబిటేట్ స్టూడియోలో పలు భాగాలను కూల్చివేశారు. ఈ స్టూడియో నిబంధనలను ఉల్లంఘిస్తోందని అందుకే కూల్చివేశామని అధికారులు చెప్పారు. ఏ నిబంధనలు ఎలా ఉల్లంఘించారో సమాచారం లేదు. బిఎంసి అధికారులు అధికారికంగా ఎలాంటి వివరాలనూ ఇవ్వలేదు. బేస్‌మెంట్‌లో స్టూడియో ఏర్పాటు చేయడానికి అనుమతి లేదని, అనుమతించిన ప్లాన్ ప్రకారమే అన్నీ వున్నాయో లేదో తనిఖీలు చేస్తామని బిఎంసి అధికారి ఒకరు చెప్పారు. హోటల్ బేస్‌మెంట్‌లోని తాత్కాలిక షెడ్, ఇతర నిర్మాణాలను కూల్చివేసినట్లు పౌర అధికారి ఒకరు చెప్పారు. ఖర్‌లోని యూనికాంటినెంటల్ హోటల్ లోపల గల వేదిక వద్దకు సుత్తులు పట్టుకుని పౌర అధికారులు ప్రవేశించడం కనిపించింది.

వ్యాఖ్యలపై చింతించడం లేదు : కునాల్

షిండేను ప్రస్తావిస్తూ 'గద్దర్ లేదా దేశద్రోహి' అని తాను చేసిన వ్యాఖ్యల గురించి తానేమీ చింతించడం లేదని క్రమా ముంబయి పోలీసులకు తెలిపారు. న్యాయస్థానాలు ఆదేశిస్తేనే తాను క్షమాపణలు చెబుతానని క్రమా ఇప్పటికే స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ అసెంబ్లీలో మాట్లాడుతూ, భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ పేరుతో తక్కువ స్థాయి కామెడీని, డిప్యూటీ ముఖ్యమంత్రిని అగౌరవపరచడాన్ని సమర్ధించలేమని అన్నారు. క్రమా తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రెండు రోజుల్లో షిండేకు క్షమాపణ చెప్పకపోతే క్రమాను వీధుల్లో తిరగనిచ్చేది లేదని శివసేన ఎంఎల్ఎ ముర్జి పటేల్ హెచ్చరించారు. క్రమా క్షమాపణలు చెప్పేవరకు వదిలిపెట్టేది లేదని శివసేన నేత సంజయ్ నిరుపమ్ అన్నారు.

క్రమా, శివసేన కార్యకర్తలపై ఎఫ్ఐఆర్

షిండేపై అప్రతిష్టాకర వ్యాఖ్యలు చేశారంటూ క్రమాపై ముంబయి పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. హేబిటేట్ స్టూడియోను ధ్వంసం చేసినందుకు 40మంది శివసేన కార్యకర్తలపైనా పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ తర్వాత వారందరికీ బెయిల్ మంజూరు చేశారు. స్టూడియోపై, హోటల్ ఆవరణపై వారు దాడికి దిగారని పోలీసులు తెలిపారు. తొలుత కనాల్‌తో సహా 12మందిని అరెస్టు చేసిన పోలీసులు బాంద్రాలోని మేజిస్ట్రేట్ కోర్టు ఎదుట వారిని హాజరు పరచగా, 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీకి పంపారు. అనంతరం వారు బెయిల్‌కి దరఖాస్తు చేసుకోగా, రూ.15వేల పూచీకత్తుపై వారిని విడుదల చేశారు.

స్టూడియో మూసివేత

శివసేన కార్యకర్తలు తమ వేదికను ధ్వంసం చేసినందున హేబిటేట్ స్టూడియోను మూసివేస్తున్నట్లు అంతకుముందు స్టూడియో యాజమాన్యం ప్రకటించింది. "మేం దిగ్భ్రాంతి చెందాం, ఆందోళన చెందుతున్నాం. మమ్మల్ని లక్ష్యంగా చేసుకుని విధ్వంసానికి దిగిన చర్యలతో మా హృదయాలు చెదిరిపోయాయి." అని ఇన్‌స్టాగ్రామ్‌లో సోమవారం స్టూడియో యాజమాన్యం పేర్కొంది. "కళాకారులు తమ అభిప్రాయాలకు, సృజనాత్మక ఎంపికలకు మాత్రమే బాధ్యత వహిస్తారు. ప్రదర్శించిన కంటెంట్‌లో ఎన్నడూ జోక్యం చేసుకోరు." అని స్టూడియో పేర్కొంది. "దాదాపుగా ప్రదర్శనకారుడికి ప్రాక్సీగా వున్న ప్రతిసారీ తమని ఎలా నిందిస్తున్నారో, లక్ష్యంగా చేసుకుంటున్నారో ఇటీవలి సంఘటనలతో తాము పునరాలోచించుకోవాల్సి వస్తోందని పేర్కొంది. మేం కానీ, మా ఆస్తులు గానీ ఇబ్బందుల్లో పడకుండా వుండేలా భావ ప్రకటనా స్వేచ్ఛకు ఒక వేదికను అందించేందుకు ఉత్తమ మార్గాన్ని రూపొందించుకునేవరకు స్టూడియోను మూసివేస్తున్నట్లు ప్రకటించింది. ఇందుకోసం కళాకారులు, ప్రేక్షకులు, దీనితో ప్రమేయమున్న ఇతర పక్షాల వారినందరినీ వారి అభిప్రాయాలు తెలియజేయాల్సిందిగా కోరుతున్నామని, ప్రదర్శనకారుల హక్కులను కూడా తాము గౌరవిస్తామని స్టూడియో నోట్ పేర్కొంది.

కునాల్ భావ వ్యక్తీకరణ స్వేచ్ఛకు బాసటగా ఉంటాం : సిపిఎం

స్టాండప్ కమేడియన్ కునాల్ క్రమాను లక్ష్యంగా చేసుకుని ఆయన షోను ప్రదర్శించిన స్టూడియోను పాలక గూండాలు ధ్వంసం చేయడాన్ని సిపిఎం తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు ఒక ప్రకటన జారీ చేసింది. ఇదే స్టూడియోలోని పలు భాగాలను మున్సిపల్ అధికారులు సోమవారం కూల్చివేశారు. క్రమాను బెదిరించడం, అడ్డగించడంతో సహా ఆయనపై అనేక కేసులను ప్రభుత్వం నమోదు చేసింది. ఈ పరిస్థితి చూస్తుంటే బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వాలకు మూక హింస ఒక్కటే చట్టమని స్పష్టమవుతోందని సిపిఎం విమర్శించింది. ఈ తరుణంలో కునాల్ క్రమాకు ఆయన భావ వ్యక్తీకరణ స్వేచ్ఛకు సిపిఎం బాసటగా వుంటుందని పేర్కొంది.

తాలిబన్ల దేశంగా మార్చాలనుకుంటున్నారా? : ప్రతిపక్షాల ఆగ్రహం

ప్రజాస్వామ్యంలో ఇటువంటి విమర్శలను, వ్యాఖ్యలను సహించాల్సిందేనని మహారాష్ట్ర కాంగ్రెస్ ఎక్స్‌లో వ్యాఖ్యానించింది. స్టూడియో విధ్వంసాన్ని ఖండించింది. మహారాష్ట్రను తాలిబన్ల దేశంగా మార్చాలని పాలక పక్షం అనుకుంటోందా అని సీనియర్ కాంగ్రెస్ నేత హర్షవర్ధన్ సప్కాల్ ప్రశ్నించారు. మీరు ప్రభుత్వంలో వున్నారు కాబట్టి చట్టాన్ని మీ చేతుల్లోకి తీసుకుంటారా, నిస్సిగ్గుగా హింసకు పాల్పడతారా అని శివసేన (యుబిటి) నేత ప్రియాంక చతుర్వేది విమర్శించారు.

వేతనాలు పెంచండి

(మొదటి పేజీ తరువాయి)

అనుగుణంగా వేతనాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం లేబర్ కోడ్స్ తీసుకువచ్చి కార్మికుల హక్కులను హరిస్తుందని, వీటిని రద్దు కోసం మే 20 జరిగే సమ్మెలో ఆర్పీలు అందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఆర్పీల పోరాటానికి సిఐటియు అండగా ఉంటుందని తెలిపారు. సంఘం అధ్యక్షురాలు ఎస్.ఉమాదేవి మాట్లాడుతూ... వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని, రాజకీయ వేధింపులు, తొలగింపులు ఆపాలని కోరారు. మహిళా మార్టుల్లో పొదుపు మహిళల పెట్టుబడులను తిరిగి వారికే చెల్లించాలన్నారు. పొదుపు సంఘాల సమావేశాలకు ఫేస్ రీడింగ్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. యూనియన్ రాష్ట్ర నాయకులు రమాదేవి మాట్లాడుతూ... రాపిడో ఆటోలు, స్కూటీలు గ్రూపు సభ్యులు తప్పనిసరిగా తీసుకోవాలనే షరతులు పెట్టి లక్ష్యాలు నిర్దేశించి ఆర్పీలను వేధించడం, మానసికంగా హింసించడం సరైంది కాదన్నారు. టార్గెట్‌లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర నాయకులు జె.జాన్సీ మాట్లాడుతూ... ఆర్పీలకు రూ.10 లక్షల గ్రూపు బీమా సౌకర్యాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర నాయకులు సిహెచ్.జాన్సీ, మల్లేశ్వరి, సత్య, రుద్రమ్మ, ఎస్.రమాదేవి, స్వాతి, లక్ష్మీ, ఎలక్ట్రిసిటి ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ముజఫర్ తదితరులు ప్రసంగించారు.

బకాయిలు చెల్లిస్తాం: మెప్మా ఎండి తేజ్ భరత్

ఆర్పీలకు చెల్లించాల్సిన వేతన బకాయిలు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మెప్మా ఎండి తేజ్ భరత్ తెలిపారు. బీమా సౌకర్యం కల్పించనున్నట్లు చెప్పారు. ధర్నా అనంతరం ఆర్పీల సంఘ నాయకులు తాడేపల్లిలోని మెప్మా కార్యాలయంలో ఎండిని కలిసి సమస్యలపై వినతి పత్రాన్ని అందజేశారు. మున్సిపాలిటీల్లో పన్నులు, ప్లాస్టిక్ కవర్లు, గ్లాస్‌లు సేకరించాలని ఆదేశించిన తెనాలి మున్సిపల్ కమిషనర్ విషయాన్ని ఎండి దృష్టికి సంఘం తీసుకువెళ్లింది. సంఘం ఇచ్చిన వినతిపత్రంలో ప్రధాన డిమాండ్లయినత వేతనాల పెంపు, గ్రేడింగ్ విధానం రద్దు, ఉద్యోగ భద్రత తదితర అంశాలకు సంబంధించి స్పష్టమైన హామీ ఇవ్వలేదని సంఘ నాయకులు తెలిపారు. అయితే రూ.10 వేల వేతనం నేరుగా ఆర్పీల ఖాతాలకే జమ చేస్తామని, ఎస్ఎల్ఎఫ్ ఇవ్వాల్సిన రూ.2 వేలు ఆర్పీలకే అందేలా చర్యలు తీసుకుంటామని ఎండి తెలిపారన్నారు. నిలిచిపోయిన లాగిన్స్ పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారని చెప్పారు. భవిష్యత్తులో మరిన్ని సేవలు అప్పగిస్తామని, దీని వల్ల ఆదాయం మరింత పెరుగుతుందని చెప్పారని, ఇందుకు సిద్ధంగా ఉండాలని సంఘం రాష్ట్ర కమిటీ ఆర్పీలకు విజ్ఞప్తి చేసింది.

పార్లమెంటు సీట్ల పునర్విభజనపై టిడిపి మౌనం రాష్ట్రానికి నష్టం

(మొదటి పేజీ తరువాయి)

లేఖ రాయాలని తెలిపారు. దీనిపై కూటమి పార్టీలు స్పందించకపోతే భవిష్యత్‌లో ఎపి ప్రయోజనాలను దెబ్బతీసినవారవుతారన్నారు.

ఆర్ఎస్ఎస్, విహెచ్‌పి మతోన్మాద సర్వేను ఆపాలి

రాష్ట్రంలో ఆర్ఎస్ఎస్, విహెచ్‌పి మత విభజన కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాయని, ఇంతకు ముందు పంచాయతీరాజ్, సోషల్ వెల్ఫేర్ శాఖలు కూడా ఇదే తరహాలో చర్చిలు, మసీదుల వివరాలు సర్వేచేసి ప్రజావ్యతిరేకతతో వెనక్కు తగ్గిందని తెలిపారు. ఇప్పుడు విహెచ్‌పి, ఆర్ఎస్ఎస్ గ్రామాల్లో ఉన్న చర్చిలు, మసీదులు, దళితులు, ముస్లిముల జనాభా, తటస్థతంగా ఉన్న ఇతర మతస్తుల వివరాలపై సర్వే చేస్తున్నాయని తెలిపారు. ఇది ప్రమాదరకమైన చర్యని, దీన్ని ప్రభుత్వం అడ్డుకోవాలని కోరారు. లౌకిక పార్టీ అని చెప్పుకుంటున్న టిడిపి దీన్ని అడ్డుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ సర్వేను టిడిపి, జనసేన అంగీకరిస్తాయా, వ్యతిరేస్తాయా అన్న విషయాన్ని కూడా స్పష్టం చేయాలని అన్నారు. మత సామరస్యం, దేశ సమైక్యత కోసం టిడిపి ఇటువంటి సర్వేలను నిరోధించాలని కోరారు.



రాహుల్‌గాంధీకి వినతి పత్రం సమర్పిస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

ఎన్ఇపిని వెనక్కి తీసుకోవాలి

- విద్యా కాషాయీకరణ ఆపాలి
- యునైటెడ్ స్టూడెంట్ పార్లమెంట్ మార్చ్
- విద్యారంగాన్ని నాశనం చేసేందుకు ఆర్ఎస్ఎస్ యత్నం : రాహుల్ గాంధీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

జాతీయ విద్యా విధానం (ఎన్ఇపి), విద్యను నిరంతరం కాషాయీకరణ చేయడాన్ని వ్యతిరేకిస్తూ వేలాదిమంది విద్యార్థులు కదంతొక్కారు. సోమవారం నాడిక్కడ జంతర్ మంతర్ వద్ద ఇండియా బ్లాక్ విద్యార్థి సంఘాలు యునైటెడ్ స్టూడెంట్ పార్లమెంట్ మార్చ్ నిర్వహించాయి. పోలీసులు అడ్డుకోవడంతో, విద్యార్థులు బారికేడ్ పైకి ఎక్కి నిరసన తెలిపారు. జాతీయ విద్యా విధానం, యుజిసి ముసాయిదా, ప్రశ్నాపత్రాల లీక్ కుంభకోణం, వెనుకబడిన తరగతుల విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, విశ్వవిద్యాలయ సంఘాల ఎన్నికలు, నిరుద్యోగ సమస్య తదితర అంశాలపై ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్, ఎన్ఎస్‌యుఐ, ఎంఎస్ఎఫ్ సహా దాదాపు ఏడు విద్యార్థి సంఘాలు ఆందోళనలో పాల్గొన్నాయి. పాఠ్యాంశాల్లో ఆర్ఎస్ఎస్ సైద్ధాంతిక చొరబాటు, విద్య వాణిజ్యకరణ, విద్య నుండి అణగారిన వర్గాలను బహిష్కరించడం, జాదవ్‌పూర్, జామియా, పాండిచ్చేరి, హెచ్‌సియు నుండి జెఎన్‌యు వరకు క్యాంపస్ ప్రజాస్వామ్యం లేకపోవడం వంటి వాటికి వ్యతిరేకంగా విద్యార్థులు తమ గళం వినిపించారు. సిపిఎం ఎంపిలు అమ్రారామ్, వి శివదాసన్, సిపిఐ ఎంపి సంతోష్ కుమార్, సిపిఐఎంఎల్ ఎంపి సుదామ ప్రసాద్, సిపిఎం మాజీ ఎంపి నీలోత్పల్ బసు తదితరులు కూడా మాట్లాడి విద్యార్థుల ఉద్యమానికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నేతలు వారికి వినతిపత్రాలు సమర్పించారు.

విద్యారంగాన్ని నాశనం చేసేందుకు ఆర్ఎస్ఎస్ యత్నం : రాహుల్ గాంధీ

ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ మాట్లాడుతూ.. దేశ భవిష్యత్తును, విద్యా రంగాన్ని నాశనం చేయడానికి ఆర్ఎస్ఎస్ ప్రయత్నిస్తోందని విమర్శించారు. యూనివర్సిటీల వైస్ ఛాన్స్‌లర్లపై ఆర్ఎస్ఎస్ ఆధిపత్యం చెలాయిస్తోందని, రాష్ట్ర యూనివర్సిటీల విసిలను కూడా ఆర్ఎస్ఎస్ సిఫార్సుతోనే నియమిస్తారని అన్నారు. దీనిని మనం ఆపాలని, ఈ విషయాలన్నీ విద్యార్థుల ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. సిద్ధాంతాలు, విధానాల విషయంలో 'ఇండియా బ్లాక్' పార్టీల మధ్య స్వల్ప తేడాలు ఉండవచ్చని, కానీ దేశ విద్యావ్యవస్థ విషయంలో ఎప్పుడూ రాజీపడలేదని అన్నారు. విద్యావ్యవస్థ ఆర్ఎస్ఎస్ చేతుల్లోకి వెళ్తే దేశం నాశనమవుతుందని, ఎవరికీ ఉపాధి అవకాశాలు రావని అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ గతవారం పార్లమెంట్‌లో మహాకుంభ మేళాను ప్రస్తావించారని, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, విద్యావ్యవస్థ గురించి కూడా మాట్లాడి ఉంటే బాగుండేదని అన్నారు. దేశంలోని వనరులన్నింటినీ అదానీ, అంబానీలకు, విద్యా సంస్థలన్నింటినీ ఆర్ఎస్ఎస్‌కు అప్పగించడమే వారి మోడల్ అని విమర్శించారు. యూనివర్సిటీలు, కాలేజీల్లో టీచర్లు, సిబ్బంది నియామకాలకు సంబంధించిన యుజిసి డ్రాఫ్ట్ రెగ్యులేషన్స్... ఒకే చరిత్ర, ఒకే సంప్రదాయం, ఒకే భాషను బలవంతంగా రుద్దాలనే ఆర్ఎస్ఎస్ ఎజెండాను ముందుకు తీసుకువెళ్లే ప్రయత్నమని అన్నారు.

విద్యను కాషాయీకరించే ప్రయత్నం : ఎస్ఎఫ్ఐ

ఎస్ఎఫ్ఐ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విపి సాను, మయూఖ్ బిశ్వాస్ మాట్లాడుతూ.. జాతీయ విద్యా విధానంతో విశ్వవిద్యాలయాలను కాషాయీకరణ చేసే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. ప్రభుత్వ విద్యపై పెరుగుతున్న దాడికి వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాల అవసరాన్ని నొక్కి చెప్పారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీకి వినతిపత్రం అందజేశారు. నాణ్యమైన, శాస్త్రీయమైన లౌకిక విద్య కోసం పోరాటంలో ఎస్ఎఫ్ఐ ఎల్లప్పుడూ ముందంజలో ఉంటుందని, ప్రభుత్వ విద్యపై దాడులు తీవ్రతరం కావడంతో పోరాటం మరింత బలపడాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వరుణ్ చౌదరి (ఎన్ఎస్‌యుఐ), ప్రసేన్‌జిత్ (ఎఐఎస్ఎ), దినేష్ సీరంగరాజ్ (ఎఐఎస్ఎఫ్), నౌఫాల్ ఎండి సఫియుల్లా (పిఎస్‌యు), టిస్ ముంబాయిలో సస్పెండ్ అయిన పిహెచ్‌డి స్కాలర్, ఎస్ఎఫ్ఐ సిఇసి సభ్యుడు రామదాస్ ప్రిని శివానందతో పాటు ఎస్ఎఫ్ఐ నేతలు దినిత్ డెంటా, నితీష్ నారాయణన్, ఎస్ఎఫ్ఐ ఢిల్లీ అధ్యక్ష, కార్యదర్శులు సూరజ్, ఐషీఘోష్, సమాజ్‌వాది ఛాత్ర సభ, సిఆర్‌జెడి, ఎంఎస్ఎఫ్ సంఘాల నేతలు పాల్గొన్నారు.

పార్లమెంట్‌లో అరకు కాఫీ స్టాల్స్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంట్‌లో అరకు కాఫీ స్టాల్స్ ఏర్పాటు చేశారు. సోమవారం అరకు కాఫీ స్టాల్‌ను లోకసభ క్యాంటీన్‌లో పార్లమెంటరీ వ్యవహారాలశాఖ మంత్రి కిరణ్ రిజిజు, రాజ్యసభ క్యాంటీన్‌లో వాణిజ్య వ్యవహారాల శాఖ మంత్రి పియూష్ గోయల్ ప్రారంభించారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఆదేశాల మేరకు రెండు స్టాల్స్ ఏర్పాటుకు లోకసభ భవనాల డైరెక్టర్ కుల్ మోహన్ సింగ్ అరోరా ఉత్తర్వులిచ్చారు. ఎంపిలు అల్పాహారం తీసుకునే సంగం 1, 2 కోర్ట్ యార్డ్ వద్ద ఎపి గిరిజన కో-ఆపరేటివ్ సొసైటీ స్టాల్స్ ఏర్పాటు చేసింది. సోమవారం నుంచి ఈ నెల 28 వరకు స్టాల్స్ ఏర్పాటుకు అవకాశం కల్పించారు. ఈ కార్యక్రమానికి గిరిజన వ్యవహారాలశాఖ మంత్రి జోయల్ ఓరం, కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర గిరిజనశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, టిడిపి, బిజెపి, జనసేన, ఇతర పార్టీల ఎంపిలు హాజరయ్యారు.

కాల్పుల విరమణపై అమెరికా, రష్యా భేటీ

రియాద్ : ఉక్రెయిన్‌లో పాక్షిక కాల్పుల విరమణపై చర్చించేందుకు అమెరికా, రష్యా ప్రతినిధి బృందాలు సోమవారం సౌదీ అరేబియా రాజధాని రియాద్‌లో సమావేశమయ్యాయి. అమెరికా, ఉక్రెయిన్ ప్రతినిధుల మధ్య చర్చలు జరిగిన కొద్ది గంటల తర్వాత ఈ సమావేశం ప్రారంభమైందని రష్యన్ మీడియా పేర్కొంది. ఈ సమావేశం అనంతరం మరోసారి అమెరికా, ఉక్రెయిన్ బృందాలు భేటీ అవుతాయని భావిస్తున్నట్లు టాస్, రియా నొవొస్తి వార్తా సంస్థలు తెలిపాయి. ఇంధన, పౌర సదుపాయాలపై రష్యా, ఉక్రెయిన్‌లు దీర్ఘశ్రేణి దాడులు జరపకుండా తాత్కాలికంగా విరామం ఇచ్చే అంశం సహా పలు అంశాలపై చర్చిస్తున్నారు.

'ఉత్తరాంధ్ర'కు ఇంటర్నేషనల్ యూనివర్సిటీ

(మొదటి పేజీ తరువాయి)

లీడర్లుగా తీర్చిదిద్దాలన్న తమ ప్రభుత్వ చిత్తశుద్ధి, నిబద్ధతకు ఈ ఒప్పందం నిదర్శనమని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉన్నత విద్య ప్రమాణాలను మెరుగుపర్చడం, గ్లోబల్ ఎక్స్‌పోజర్, పాఠ్యాంశాలను మెరుగుపరచడం, అధునాతన విద్య, సాంకేతికతను అందించడం, పరిశోధన, నవీన ఆవిష్కరణలను ప్రోత్సహించడం ఒప్పందం ప్రధాన లక్ష్యమన్నారు. అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన ప్రోగ్రామ్‌లలో ముఖ్యంగా టెక్నాలజీ, బిజినెస్, ఆరోగ్యహెల్త్ కేర్‌లలో జిఎన్‌యు నైపుణ్యాలను అందిస్తుందని తెలిపారు. పరిశ్రమ డిమాండ్లకు అను గుణంగా నైపుణ్యాలు, అర్హతలతో కూడిన విద్యార్థులను సన్నద్ధం చేసి జాతీయ, అంతర్జాతీయ స్థాయి ఉపాధి అవకాశాలకు ఊతమిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కళాశాల విద్య కమిషనర్ భరత్ గుప్తా, జిఎన్‌యు, విద్యా వ్యవహారాల వైస్ రెక్టార్ ప్రొఫెసర్ జార్జ్ గవ్రాడ్జె, అడ్మినిస్ట్రేటివ్ ఎఫైర్స్ వైస్ రెక్టార్ గొడెర్జి బుచాష్విలి, ఇండియా ఆపరేషన్స్ అండ్ అడ్మిషన్స్ డైరెక్టర్ జొన్నలగడ్డ వివేకానంద మూర్తి తదితరులు పాల్గొన్నారు

ప్రభుత్వానిది కపట ప్రేమ

(మొదటి పేజీ తరువాయి)

అరటి పంటకు విదేశాల్లో మంచి డిమాండ్ ఉందన్నారు. ప్రస్తుత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల గిట్టుబాటు ధర రాక ఈ ప్రాంత రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. తమ ప్రభుత్వ హయాంలో రైతుల కోసం పులివెందులలో ఇంటిగ్రేటెడ్ కోల్డ్ స్టోరేజీరూ.25 కోట్లతో నిర్మించామన్నారు. రైతులు పండించిన అరటి పంటను కోల్డ్ స్టోరేజ్ నుంచి రెండు కంటైనర్లలో నేరుగా ఎగుమతి చేశామని గుర్తు చేశారు. నెల రోజుల కిందట రూ.26 వేలు ఉన్న టన్ను అరటి ధర ప్రస్తుతం రూ.9 వేలకు పడిపోయిందని, అయినా, రైతులను ఆదుకోకుండా ప్రస్తుత ప్రభుత్వం చోద్యం చూస్తోందన్నారు. ఈ ప్రభుత్వంలో మిర్చి, కంది, పెసర, శనగ, మినుములు, ఇతర ఏ పంటలకూ గిట్టుబాటు ధర రావడం లేదని తెలిపారు. చీని రైతులకు గతంలో టన్నుకు రూ.లక్ష వచ్చేదని, ఇప్పుడు సూట్ రూపంలో చీని రైతులను మోసం చేస్తున్నారని అన్నారు. జగన్ వెంట ఎంపి వైఎస్.అవినాష్‌రెడ్డి, వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్ రెడ్డి, మండల కన్వీనర్ బాబురెడ్డి, యూత్ కన్వీనర్ మనోహర్‌రెడ్డి ,వైసిపి నియోజకవర్గ రైతు సంఘం అధ్యక్షులు సారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



మీకోసం

కారం ఎక్కువ కాలం తాజాగా ఉండాలంటే అందులో ఇంగువ కలుపుకోవాలి.

జీవన సౌరభం

లక్ష్యాన్ని సాధించలేని జ్ఞానం నిరుపయోగమైనది.

JEEVANA జీవన the family

ఔను చెప్పాలి!



చందమామ రావే
జాబిల్లి రావే పాట ఏమైంది?
అదిగో ఆ చరవాణి వలలో
చిక్కుకు పోయింది

బామ్మ చెప్పే కథలు
బాలమిత్ర సుధలు
ఏమైపోయాయి?
అదిగో ఆ యూట్యూబ్ సంకెళ్లలో
బంధీ అయిపోయాయ్

ఆరుబయట ఆటలు
తాత పెంచిన తోటలు
ఏమైపోయాయి?
ఫ్రీ ఫైర్, పబ్జి గేముల్లో
గిరికీలు కొడుతున్నాయ్

రాసుకున్న రాతలు
చదువుకున్న నీతులు
ఏమైపోయాయి?
ఫేస్బుక్ పరిచయంతో
మరుగున పడిపోయాయ్

ఇక ఇంతేనా..
పిల్లల ప్రగతి వింతేనా!?
లేదు లేదు..
ఇకనైనా కళ్లు తెరిచి, ఒళ్లు విరిచి,
కథల వనంలో తిప్పాలి
మంచి, చెడుల్ని, విడమర్చి
చెప్పాలి.
ఔను చెప్పాలి!!

- కోరాడ. అప్పలరాజు,
(టీచర్)
అనకాపల్లి,
95502 34204.



తేడాలు గుర్తించండి

పిల్లలూ! ఈ చిత్రంలో ఆరు తేడాలు ఉన్నాయి. అవి ఏంటో గుర్తించండి.

నేను గీసిన బొమ్మ



ఎస్ భార్గవి,
6వ తరగతి,
ఎపి మోడల్ స్కూలు



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ఊరి కోసం...



తను,
తన కుటుంబం బాగుంటే చాలు అనుకునే ఈ రోజుల్లో ఊరు బాగుపడాలని ఆలోచించేవారు చాలా తక్కువ మంది. అందులోనూ 95 ఏళ్ల వృద్ధురాలు ఆలోచించడం మామూలు విషయం కాదు. ఒరిస్సా రాష్ట్రంలోని నౌపడ జిల్లా సింగ్జార్ గ్రామంలో ఈ సంఘటన జరిగింది. సబిత్రి మాఝీ (95) తన ఐదెకరాల భూమిని గ్రామంలో క్రీడామైదానం కోసం దానం చేసింది. ఈ విషయం ఆమె ఇంటికి జిల్లా కలెక్టరు వచ్చేవరకు గ్రామం దాటి బయటికి రాలేదు. అయితే సబిత్రి చూపిన ఔదార్యానికి కలెక్టరు వచ్చి మరీ అభినందనలు తెలపడం వెనుక ఆ ఊరి గురించి తెలుసుకోవాలి.

ఒడిశా రాష్ట్రంలోని సింగ్జార్ గ్రామంలో ఐదు దశాబ్దాలుగా వివిధ క్రీడాపోటీలను నిర్వహిస్తున్నారు. జిల్లా హెడ్‌క్వార్టర్స్‌కి 100 కిలోమీటర్ల దూరంలో ఉండే ఈ గ్రామంలో ప్రతి ఏడాది రాష్ట్రంలో ప్రముఖంగా నిర్వహించే బుదిరాజ్ కప్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తారు. రాయ్‌పూర్, బిలాస్‌పూర్, కటక్, భువనేశ్వర్, జార్ఖండ్ నుండి ఇక్కడ పాల్గొనేందుకు క్రికెట్ బృందాలు వస్తాయి. క్రికెట్ ఒక్కటే కాదు, కబడ్డీ, ఫుట్‌బాల్ టోర్నమెంటులు కూడా ఇక్కడ క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నారు. అయితే ఏదేని ప్రైవేటు స్థలమో, ప్రభుత్వ స్థలంలోనో పోటీలు జరుపుకుంటున్నారు.

గ్రామంలో ఉన్న పరిస్థితి గురించి ప్రేమ్‌చంద్ అనే గ్రామస్తుడు ఇలా చెబుతున్నాడు. 'బుదిరాజ్ కప్‌ని మా గ్రామంలో ఏడేళ్ల నుండి నిర్వహిస్తున్నారు. సొంత స్థలం ఇవ్వమని జిల్లా అధికారులను ఎన్నో సార్లు అడిగాం. కానీ ఎవరూ ముందుకు రాలేదు. అప్పుడే గ్రామంలోని యువత సబిత్రి దగ్గరికి వెళ్లి అభ్యర్థించారు. తన భూమిని ఇవ్వమని కోరారు' అని చెప్పారు. ఊళ్లో అందరూ ఉండగా సబిత్రినే ఎందుకు అడిగారో కూడా ప్రేమ్ చంద్ చెప్పారు. 'సబిత్రి, ఆమె భర్త నిలంబార్ మాఝీ గతంలో గ్రామ అవసరాల కోసం తమ తాతముత్తాతల నుండి వస్తున్న భూమిని విరాళంగా ఇచ్చారు. అలాగే ఇప్పుడు కూడా చేయమని సబిత్రిని అభ్యర్థించారు. ఆమె ఏడాది క్రితమే భూమిని గ్రామానికి రాసిచ్చింది. అయితే ఇప్పుడు కలెక్టరు వచ్చాక ఈ విషయం బయటివాళ్లకి తెలిసింది' అని చెప్పారు.

సబిత్రి భర్త దశాబ్ద కాలం కిందటే మరణించారు. గ్రామంలో స్కూలు, హైస్కూల్, ఆలయం వంటి నిర్మాణాలకు ఆ భార్యభర్త ఇద్దరూ భూమిని దానం చేశారు. సబిత్రి కుటుంబం గురించి మరో గ్రామస్తుడు ఇలా చెబుతున్నారు. 'ఇదంతా తెలుసుకుంటున్నప్పుడు ఆ దంపతులకు పిల్లలు లేరా? అని ఎవరికైనా అనుమానం వస్తుంది. అయితే వారికి 10 మంది సంతానం ఉన్నారు. ఇంతవరకు వాళ్లెవరూ ఎప్పుడూ అభ్యంతరం చెప్పలేదు. ఆ కుటుంబం దాతృత్వానికి మారు పేరుగా నిలుస్తుంది' అంటున్నారు.

సబిత్రి కూడా ఈ విషయంపై తన మనసులోని మాట చెప్పారు. 'నా వివాహమై వచ్చిన దగ్గర నుండి ఈ గ్రామస్తులు క్రీడలపై పెంచుకున్న ఆసక్తిని గమనించాను. ఏళ్ల తరబడి తరతరాలుగా ఇది ఒక సంప్రదాయంగా మారింది. సింగ్జార్‌కి ఓ ప్రత్యేక గుర్తింపు వచ్చింది. ఈ వారసత్వానికి ప్రోత్సహించడానికే, ప్రస్తుత, భవిష్యత్తు తరాల కోసం క్రీడా సదుపాయాలను అభివృద్ధి చేయడానికి భూమిని విరాళంగా ఇవ్వాలని నిర్ణయించుకున్నాను' అంటున్న సబిత్రి బామ్మ చేసిన ఈ గొప్ప పనితో ఇప్పుడు దేశం మొత్తం ఆ ఊరి వైపు చూస్తోంది.

ఎండల్లో పెరటి మొక్కల సంరక్షణ..



ఎండల్లో పెరటి మొక్కల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. వేసవికాలమని కుండీల్లోని మొక్కలకు కొంతమంది అదేపనిగా నీరు పోస్తుంటారు. ఇలా చేస్తే మొక్కల వేర్లు మురిగిపోయే ప్రమాదం ఉంటుంది. కాబట్టి..

✦ సూర్యోదయానికి ముందు, సూర్యాస్తమయం తర్వాతే మొక్కలకు నీళ్లు పోయాలి. ఈ సమయమైతేనే.. నీళ్లు నేలలోకి ఇంకిపోవడానికి, వేర్లను చేరుకోవడానికి అనుకూలంగా ఉంటుంది.

✦ మొక్కల సంరక్షణలో మొదట చేయాల్సిన పని 'కలుపు'ను ఏరివేయడం.

✦ వసంత మాసంలో మొక్కల పెరుగుదల ఎక్కువ. ఈ కాలంలో చీడపీడల బాధ తక్కువ. కాబట్టి, మొక్కలు వేగంగా, ఆరోగ్యంగా పెరుగుతుంటాయి. అయితే మొక్క మరింత ఆరోగ్యకరంగా ఉండా లంటే.. కత్తిరింపులు చేయాలి. క్రాసింగ్, దెబ్బతిన్న కొమ్మలు ఉంటే, వాటిని తొలగించాలి.

✦ మొక్కలు బాగా ఎదగాలని ఏ ఎరువులు పడితే అవి పరిమితికి మించి వాడకూడదు. మొక్కలకు సరిపోయేదే ఎన్నుకోవాలి. నత్రజని ఆధారిత ఎరువులు వేసవికి అనుకూలంగా ఉండటంతోపాటు మొక్కల పెరుగుదలనూ ప్రోత్సహిస్తాయి.



పిల్లలతో ఇవి తాగించండి..

వేసవిలో పిల్లలను హైడ్రేటెడ్‌గా ఉంచడం చాలా ముఖ్యం. శీతల పానీయాలకు బదులుగా, ఇంట్లో తయారుచేసిన పండ్ల రసాలను ఇవ్వాలి. వేసవిలో పిల్లలకు ఇవ్వడానికి అనువైన 4 ప్రత్యేక రకాల జ్యూస్‌లు ఉన్నాయి.

నారింజ రసం

నారింజ రసంలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. ఇది పిల్లల రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడానికి సహాయపడుతుంది. హైడ్రేటెడ్‌గా ఉంచడంలో కూడా దోహదపడుతుంది.

పుచ్చకాయ రసం

వేసవిలో పిల్లలకు పుచ్చకాయ రసం మంచి ఎంపిక. పుచ్చకాయలో నీటి శాతం ఎక్కువగా ఉంటుంది. ఇది పిల్లలను హైడ్రేటెడ్‌గా ఉంచడంలో సహాయపడుతుంది. దీనితో పాటు, పుచ్చకాయ రసంలో విటమిన్ సి, లైకోపీన్ పుష్కలంగా ఉంటాయి. ఇవి పిల్లల ఆరోగ్యానికి మేలు చేస్తాయి. పుచ్చకాయ రసం పిల్లల కడుపును చల్లగా ఉంచుతుంది. పిల్లలు రోజంతా తాజాగా ఉంటారు.

బొప్పాయి రసం

బొప్పాయిలో పపైన్ అనే ఎంజైమ్ ఉంటుంది. ఇది జీర్ణక్రియకు సహాయపడుతుంది. దీనితో పాటు, బొప్పాయి రసంలో విటమిన్ సి, పొటాషియం పుష్కలంగా ఉంటాయి. ఇవి పిల్లల ఆరోగ్యానికి మేలు చేస్తాయి. బొప్పాయి రసం తయారు చేసి పిల్లలకు ఉదయం, సాయంత్రం ఇవ్వవచ్చు.

ద్రాక్షపండు రసం

పిల్లలకు ద్రాక్ష రసం అంటే చాలా ఇష్టం. పిల్లలకు కూల్ డ్రింక్‌కు బదులుగా ద్రాక్ష రసం ఇవ్వొచ్చు. ద్రాక్షలో పొటాషియం, విటమిన్ సి ఉన్నాయి. ఇవి పిల్లల ఆరోగ్యానికి మేలు చేస్తాయి. దీనితో పాటు ద్రాక్ష రసం హైడ్రేటెడ్‌గా ఉంచడంలో కూడా సహాయపడుతుంది.



'ఓ భామ అయ్యో రామ' టీజర్ విడుదల

సుహాస్, మాళవిక మనోజ్ జంటగా రామ్ గోదల తెరకెక్కిస్తున్న చిత్రం 'ఓ భామ అయ్యో రామ'. హరీశ్ నల్ల నిర్మాత. తాజాగా ఈ సినిమా టీజర్ లాంచ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్రబృందం సినిమా విశేషాలు ముచ్చటించింది. సుహాస్ మాట్లాడుతూ, 'దీని స్టోరీ చాలా బాగుంటుంది. సెకండ్ హాఫ్‌లో ట్విస్ట్ అందరినీ ఆకట్టుకుంటుంది. భావోద్వేగాలు ఉన్నాయి. ఈ స్టోరీని అందరూ ఎంజాయ్ చేస్తారు' అన్నారు. దర్శకుడు రామ్ మాట్లాడుతూ 'ఇందులో హీరో పేరు రామ్.. హీరోయిన్ పేరు సత్య. నా రియల్ లైఫ్‌లో జరిగిన కొన్ని సంఘటనలు ఇందులో కొన్ని ఉన్నాయి. కథ రాసుకునేటప్పుడే సుహాస్ హీరో అయితే బాగుండని అనుకున్నాను. ఈ పాత్రకు ఆయన సరిపోతారు. కథ బాగుంటే తెలుగు ఆడియన్స్ ఎప్పుడూ ఆదరిస్తారు. ఈ సినిమాను కూడా ఆదరిస్తారు' అన్నారు. నిర్మాత హరీశ్ మాట్లాడుతూ 'ఒక సినిమా తెరకెక్కిస్తున్నప్పుడే అది హిట్ అవుతుందా లేదా అని అర్థమవుతుంది. ఇది అలాంటి సినిమానే. అందుకే దీని కోసం ఎక్కడా రాజీ పడకుండా ఖర్చుపెట్టాం' అన్నారు. హీరోయిన్ మాళవిక మనోజ్ మాట్లాడుతూ 'నా పాత్ర పేరు సత్యభామ. ఇలాంటి సినిమాలో ఇప్పటి వరకూ నటించలేదు. టాలీవుడ్ ఇండస్ట్రీ చాలా పెద్దది. గొప్ప సినిమాలు ఇక్కడి నుంచే వస్తున్నాయి' అని చెప్పారు.

'వీటీ15' ప్రారంభించారు



వరుణ్ తేజ్ నటిస్తోన్న తాజా చిత్రం 'వీటీ15'. మేర్లపాక గాంధీ దర్శకత్వం వహిస్తున్నారు. ఇండో-కొరియన్ హార్రర్ కామెడీ బ్యాక్‌డ్రాప్‌లో వస్తోన్న ఈ సినిమాకు సంబంధించి ఆసక్తికర వార్తను చిత్రబృందం షేర్ చేసింది. సోమవారం ఈ చిత్రం మొదలైంది. మేర్లపాక గాంధీ, క్రిష్, హీరోయిన్ రితికానాయక్ ఇతర టీం మెంబర్స్ సమక్షంలో ఈవెంట్ గ్రాండ్‌గా జరిగింది. ఈ చిత్రాన్ని యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌తో అసోసియేట్ అవుతూ తెరకెక్కిస్తోంది.

'మ్యాడ్ స్క్వేర్'లో 'మ్యాడ్'ని మించిన కామెడీ

కథానాయకులు నార్నే నితిన్, సంగీత్‌శోభన్, రామ్‌నితిన్



'మ్యాడ్ అనేది మాకు ఎంతో స్పెషల్ మూవీ. ఆ సినిమా ద్వారా మాకు బాగా పేరు వచ్చింది. వినోదమే 'మ్యాడ్ స్క్వేర్'ని నడిపిస్తుంది. మ్యాడ్‌తో పోలిస్తే ఇందులో కామెడీ పాళ్లు మరింత ఎక్కువగా ఉంటుంది. మా ముగ్గురి పాత్రల నిడివి కూడా ఎక్కువగానే ఉంటుంది. ప్రేక్షకులు ఈ కామెడీని బాగా రిసీవ్ చేసుకుంటారని నమ్ముతున్నాం. మొదటి సినిమాలో ప్రేక్షకులు ఎలా రిసీవ్ చేసుకుంటారు అనే విషయమై అప్పట్లో కొంచెం భయపడ్డాం. ఇప్పుడు ఈ సినిమాకు భయం లేదు. ఫర్ఫామెన్స్ కూడా ఇంకా బెటర్‌గా వచ్చింది. మ్యాడ్ విజయం ఇచ్చిన కాన్ఫిడెన్స్‌తో మ్యాడ్ స్క్వేర్‌ను ఆడుతూపాడుతూ చేశాం. ఇంకా ఎక్కువ నవ్వించాలనే ఆలోచన తప్ప ప్రత్యేక కసరత్తులేమీ చేయలేదు. ఈ సినిమాలో నాగవంశీ గారి పాత్రే కీలకం. ఆయన దర్శకుడు, నటీనటులని నమ్మి పూర్తిస్వేచ్ఛ ఇచ్చారు. ముఖ్యంగా పెళ్లి సీక్వెన్స్ అందరికీ నచ్చుతుంది' అని కథానాయకులు నార్నె నితిన్, సంగీత్ శోభన్, రామ్ నితిన్ చెప్పారు. హిట్ మూవీ 'మ్యాడ్'కి సీక్వెల్‌గా రూపొందుతున్న చిత్రం 'మ్యాడ్‌స్క్వేర్' ఈనెల 28న విడుదల కానుంది. కళ్యాణ్‌శంకర్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను శ్రీకర స్టూడియోస్‌తో కలిసి సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై హారిక సూర్యదేవర, సాయిసౌజన్య నిర్మిస్తున్నారు. సూర్యదేవర నాగవంశీ సమర్పిస్తున్నారు.



కన్నడలోనూ 'యమజాలీ'గా...

ఎస్‌పి క్రియేషన్స్ నిర్మాణంలో రచయిత, దర్శకుడు సుంకర సాయిపవన్ తెరకెక్కిస్తున్న సినిమా 'యమజాలీ..లవ్‌మీ లైలా' తెలుగుతోపాటుగా కన్నడ భాషలోనూ రానుంది. బెంగుళూరులో జెఎస్‌ఎస్‌పి కర్నాటక ప్రెసిడెంట్ అబ్దుల్‌ఖాదర్, సంగీత దర్శకులు ఎస్‌ఎస్ నజీర్, నటులు రుద్రా, కొరియోగ్రాఫర్ హుస్సేన్‌ఖాన్‌లతో సాయిపవన్ భేటీ అయ్యారు. సినిమా షూటింగ్ షెడ్యూల్, ఇతరత్రా విషయాలపై చర్చించిన అనంతరం వీరంతా కన్నడ కథానాయకుడు చేతన్‌ను కలిశారు. దర్శకుడు సాయిపవన్ కథను చెప్పగా చేతన్ వెంటనే ఒప్పుకున్నారు. ఈ సందర్భంగా అబ్దుల్‌ఖాదర్ మాట్లాడుతూ గతంలో 600 కథలను విన్నా చేతన్ ఒప్పుకోలేదనీ, 'యమజాలీ..లవ్‌మీ లైలా' కథను విని అందులో నటించటానికి అంగీకరించారన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరామచంద్రమూర్తి, కన్నడ సినిమా ప్రతినిధులు పాల్గొన్నారు.

అశుతోష్ మెరుపు ఇన్నింగ్స్

- 31బంతుల్లో 66 పరుగులు
- లక్నోపై ఢిల్లీ సంచలన విజయం
- పూరన్, మార్ష్ అర్ధసెంచరీలు వృథా



ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అశుతోష్ శర్మ

విశాఖ: చివరి ఓవర్ వరకు ఉత్కంఠభరితంగా సాగిన మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ సంచలన విజయం సాధించింది. చివరి ఓవర్లో ఆరు పరుగులు చేయాల్సిన ఢిల్లీని అశుతోష్ మూడో బంతికి సిక్సర్ కొట్టి ముగించాడు. లక్నో సూపర్ జెయింట్స్ నిర్దేశించిన 210 పరుగుల లక్ష్యాన్ని ఢిల్లీ క్యాపిటల్స్ 19.3ఓవర్లలో 9వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఢిల్లీ జట్టులో అశుతోష్ శర్మ(66నాటౌట్; 31బంతుల్లో 5ఫోర్లు, 5సిక్సర్లు)కి తోడు విప్‌రాజ్ నిగమ్(39; 15బంతుల్లో 5ఫోర్లు, 2సిక్సర్లు) రాణించారు.

అంతకుముందు లక్నో సూపర్ జెయింట్స్ బ్యాటర్లు నికోలాస్ పూరన్, మిచెల్ మార్ష్ రెచ్చిపోయి ఆడారు. విశాఖ ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో ఢిల్లీ క్యాపిటల్స్‌తో సోమవారం జరిగిన మ్యాచ్‌లో అర్ధసెంచరీలతో కదం తొక్కారు. దీంతో తొలిగా బ్యాటింగ్‌కు దిగిన లక్నో జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లకు 209 పరుగుల భారీస్కోర్ నమోదు చేసింది. ఈ మ్యాచ్ లో ఢిల్లీ జట్టు టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. ఓపెనర్ ఐడెన్ మార్క్రమ్ ధాటిగా ఆడే ప్రయత్నంలో 15 పరుగుల చేసి అవుటయ్యాడు. ఆ తర్వాత నికోలాస్ పూరన్, మిచెల్ మార్ష్ విధ్వంసక బ్యాటింగ్‌తో విశాఖ స్టేడియం హోరెత్తిపోయింది. వీరు సిక్సర్లు, ఫోర్లతో విరుచుకుపడ్డారు. పూరన్(75; 30బంతుల్లో 6ఫోర్లు, 7సిక్సర్లు), మార్ష్(72; 36బంతుల్లో 6ఫోర్లు, 6సిక్సర్లు) ధనా ధన్ ఇన్నింగ్స్‌తో చెలరేగారు. వీరిద్దరూ అవుటైన తర్వాత లక్నో స్కోరు మందగించింది. చివర్లో డేవిడ్ మిల్లర్ భారీ షాట్లు కొట్టడంతో లక్నో స్కోరు 200 మార్కు దాటింది. మిల్లర్ 19 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్సర్లతో 27 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. లక్నో కెప్టెన్ రిషబ్ పంత్(0) డకౌట్ అయ్యాడు. ఆరు బంతులు ఆడినా ఒక్క పరుగు కూడా చేయకుండా వెనుదిరిగాడు. ఢిల్లీ క్యాపిటల్స్ బౌలర్లలో మిచెల్ స్టార్క్‌కు మూడు, కుల్దీప్ యాదవ్‌కు రెండు, విప్రాజ్ నిగమ్, ముఖేశ్ కుమార్‌కు ఒక్కో వికెట్ దక్కాయి.

స్కోర్‌బోర్డు...

లక్నో సూపర్‌జెయింట్స్ ఇన్నింగ్స్: మార్క్రమ్ (సి)స్టార్క్ (బి)విప్‌రాజ్ నిగమ్ 15, మిచెల్ మార్ష్ (సి)స్టబ్స్ (బి)ముఖేష్ కుమార్ 72, పూరన్ (బి)స్టార్క్ 75, పంత్ (సి)డుప్లెసిస్ (బి)కుల్దీప్ 0, డేవిడ్ మిల్లర్ (నాటౌట్) 27, ఆయుష్ బడోని (సి)స్టబ్స్ (బి)యుల్దీప్ 4, శార్దూల్ ఠాకూర్ (రనౌట్) అక్షర్/పోరెల్ 0, షాబాజ్ అహ్మద్ (సి)టి. విజయ్ (బి)స్టార్క్ 9, బిష్ణోయ్ (బి)స్టార్క్ 0, అదనం 7. (20ఓవర్లలో 8వికెట్ల నష్టానికి) 209పరుగులు.

వికెట్ల పతనం: 1/46, 2/133, 3/161, 4/169, 5/177, 6/177, 7/194, 8/194

బౌలింగ్: స్టార్క్ 4-0-42-3, అక్షర్ పటేల్ 3-0-18-0, విప్‌రాజ్ నిగమ్ 2-0-35-1, ముఖేష్ కుమార్ 2-0-22-1, కుల్దీప్ యాదవ్ 4-0-29-2, మోహిత్ శర్మ 4-0-42-0, స్టబ్స్ 1-0-28-0

ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్: ఫ్రేజర్ (సి)బడోని (బి)శార్దూల్ 1, డుప్లెసిస్ (సి)డేవిడ్ మిల్లర్ (బి)బిష్ణోయ్ 29, అభిషేక్ పోరెల్ (సి)పూరన్ (బి)శార్దూల్ 0, సమీర్ రిజ్వి (సి)పంత్ (బి)సిద్దార్థ్ 4, అక్షర్ పటేల్ (సి)పూరన్ (బి)దిగ్వేష్ రాథి 22, స్టబ్స్ (బి)సిద్దార్థ్ 34, అశుతోష్ శర్మ (నాటౌట్) 66, విప్రాజ్ నిగమ్ (సి)సిద్దార్థ్ (బి)దిగ్వేష్ రాథి 39, స్టార్క్ (సి)పంత్ (బి)బిష్ణోయ్ 2, కుల్దీప్ (రనౌట్) పంత్/ప్రిన్స్ 5, మోహిత్ (నాటౌట్) 1, అదనం 8. (19.3ఓవర్లలో 9వికెట్ల నష్టానికి) 211 పరుగులు.

వికెట్ల పతనం: 1/2, 2/2, 3/7, 4/50, 5/65, 6/113, 7/168, 8/171, 9/192

బౌలింగ్: శార్దూల్ 2-0-19-2, సిద్దార్థ్ 4-0-39-2, దిగ్వేష్ రాథి 4-0-31-2, బిష్ణోయ్ 4-0-53-2, ప్రిన్స్ 4-0-47-0, షాబాజ్ అహ్మద్ 1.3-0-22-0.

ఐపిఎల్‌లో నేడు

గుజరాత్ జెయింట్స్ × పంజాబ్ కింగ్స్
వేదిక: అహ్మదాబాద్; రాత్రి 7.30గం॥లకు

హర్మన్, స్మృతి, దీప్తిలకు టాప్ గ్రేడ్

- గ్రేడ్-సిలో అరుంధతికి చోటు
- వార్షిక కాంట్రాక్టులను ప్రకటించిన బిసిసిఐ



ముంబయి: భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు(బిసిసిఐ) మహిళా క్రికెటర్లకు వార్షిక కాంట్రాక్టులను ప్రకటించింది. గత ఏడాది నుంచి నిలకడగా రాణిస్తున్న యువ క్రీడాకారిణులను ఈసారి అధిక ప్రాధాన్యనిచ్చింది. హైదరాబాద్ క్రికెటర్ అరుంధతి రెడ్డి, ఎమర్జింగ్ ప్లేయర్ అవార్డు గెలుపొందిన యువకెరటం అమన్‌జోత్ కౌర్ గ్రేడ్-సిలో కాంట్రాక్ట్ దక్కించుకున్నారు. ఇక గ్రేడ్-ఎలో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్, వైస్ కెప్టెన్ స్మృతి మంధానతోపాటు ఆల్‌రౌండర్ దీప్తి శర్మ ఉన్నారు. మూడు గ్రేడ్‌లలో కలిపి మొత్తం 16 క్రీడాకారిణులకు చోటు దక్కించుకున్నారు. 2024 ఏడాదిలో గ్రేడ్-బిలో ఉన్న రాజేశ్వరి గైక్వాడ్‌కు ఈసారి చోటు దక్కలేదు. కొత్తగా ఉమా ఛెత్రి, అరుంధతి రెడ్డి, టిటాస్ సద్ధుతోపాటు శ్రేయాంక పాటిల్ బిసిసిఐ సెంట్రల్ కాంట్రాక్ట్‌లో చోటు దక్కించుకున్నారు. అయితే.. ఈమధ్యే వన్డేల్లో సెంచరీతో మెరిసిన హర్లీన్ డియోల్‌కు మాత్రం చుక్కెదురైంది. ఆమెతో పాటు మేఘనా సింగ్, దేవికా వైద్య, అంజలీ సర్వానీలకు కూడా కాంట్రాక్టు దక్కలేదు. వార్షిక కాంట్రాక్టు 2024 అక్టోబర్ 1 నుంచి 2025 సెప్టెంబర్ 30వరకు వర్తిస్తుంది. ఇక గ్రేడ్-ఎ ఆటగాళ్లకు రూ.50 లక్షలు, గ్రేడ్-బి ఆటగాళ్లకు రూ.30 లక్షలు, గ్రేడ్-సి ఆటగాళ్లకు రూ. 10 లక్షలు చొప్పున బిసిసిఐ అందజేయనుంది.

గ్రేడ్-ఎ : హర్మన్‌ప్రీత్ కౌర్, స్మృతి మంధాన, దీప్తి శర్మ **గ్రేడ్-బి :** రేణుక సింగ్ ఠాకూర్, జెమిమా రోడ్రిగ్స్, షెఫాలీ వర్మ, రీచా ఘోష్ **గ్రేడ్-సి :** అమన్‌జ్యోత్ కౌర్, ఉమా ఛెత్రీ, పూజా వస్త్రాకర్, అరుంధతి రెడ్డి, స్నేహ్ రాణా, టిటాస్ సద్ధు, రాధా యాదవ్, శ్రేయాంక పాటిల్, యాస్టికా భాటియా.

బంగ్లా క్రికెటర్ తమీమ్‌కు గుండెపోటు..



ఢాకా: బంగ్లాదేశ్ మాజీ కెప్టెన్ తమీమ్ ఇక్బాల్ తీవ్ర గుండె పోటుతో ఆసుపత్రిలో చేరాడు. తమీమ్ పరిస్థితి విషమంగానే ఉందని డాక్టర్లు తెలిపారు. దాంతో, అతడి ఆరోగ్య పరిస్థితిపై కుటుంబసభ్యులు, బంగ్లా అభిమానులు ఆందోళనకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు(బిసిబి) ఓ ప్రకటన విడుదల చేసింది. ప్రస్తుతం తమీమ్ లైఫ్ సపోర్టింగ్ మీద ఉన్నాడని, డాక్టర్లు నిరంతరం పర్యవేక్షిస్తున్నారని బిసి తెలిపింది. ఢాకా ప్రిమియర్ డివిజన్ క్రికెట్ లీగ్ మ్యాచ్ సందర్భంగా తమీమ్ ఛాతిలో నొప్పితో మైదానంలోనే కుప్పకూలి పోయాడు. గత ఏడాది అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన తమీమ్.. అప్పటి ప్రధాని షేక్ హసీనా చొరవతో యూటర్న్ తీసుకున్నాడు. ఈ క్రమంలోనే చాంపియన్స్ ట్రోఫీలోనూ ఆడేందుకు నిరాకరించిన తమీమ్.. టీ20 లీగ్స్‌పై దృష్టి సారించాడు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68